


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## 'హిండెన్‌బర్గ్ రిసెర్చ్' మూసివేత

వ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ ప్రకటన


ఎవరి ఒత్తిళ్లు, బెదిరింపులూ లేవని వెల్లడి

గతంలో అదానీపై అభియోగాలతో సంచలనం

2

శుక్రవారం | 17-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 272 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి తె. 5.30 తదుపరి పంచమి; నక్షత్రం: మఖ మ. 12.45 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 9.27-11.11 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.49, మ. 12.47-1.31; అమృతఘడియలు: ఉ. 10.12-11.54; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



## సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

ముంబైలోని ఇంట్లోకి చొరబడి దుండగుడి దాడి

వెన్నెముక సహా ఆరుచోట్ల గాయాలు

కారు సిద్ధంగా లేక.. ఆటోలో ఆస్పత్రికి తరలింపు

లీలావతి ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. నిలకడగా ఆరోగ్యం

దుండగుడిపై దోపిడీ, హత్యాయత్నం కేసు నమోదు

2

## 12 మంది మావోయిస్టుల కాల్చివేత



2 కి.మీ. వెంటాడి.. వేటాడి హతమార్చిన భద్రతా దళాలు

తెలంగాణ సరిహద్దుల్లో మారేడుబాక అడవుల్లో ఘటన

వెయ్యి మందితో ఆపరేషన్.. భారీగా ఆయుధాల స్వాధీనం

మావోయిస్టుల టెక్నికల్ టీమ్ కమాండర్ లొంగుబాటు

12

## దోపిడీ దొంగల బీభత్సం

బీదర్‌లో సెక్యూరిటీ వాహనంపై దాడి.. గార్డు మృతి; మరొకరికి గాయాలు

ఏటీఎంలో పెట్టాల్సిన రూ.93 లక్షలతో పరార్.. హైదరాబాద్‌కు చేరిక

రాయ్‌పూర్ వెళ్లేందుకు యత్నం.. ఆబిడ్స్‌లో ఇద్దరికి బస్ టికెట్ కొనుగోలు

బ్యాగ్ తనిఖీ.. ట్రావెల్స్ ఉద్యోగిపై కాల్పులు.. నిందితుల కోసం గాలింపు

13

# విశాఖ ఉక్కుకు ఊపిరి



## 11,500 కోట్ల భారీ ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ ఓకే

వెల్లడించిన కేంద్ర అధికార వర్గాలు

నేడు పూర్తి వివరాలతో ప్రకటన

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలని ప్రధానికి పలుమార్లు సీఎం విజ్ఞప్తి

కేంద్ర ఉక్కు మంత్రికీ విన్నపం

చంద్రబాబు అభ్యర్థన మేరకు సాయానికి ప్రధాని పచ్చజెండా

న్యూఢిల్లీ/విశాఖపట్నం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటూ, ప్రైవేటీకరణ కత్తి వేలాడుతున్న విశాఖ స్టీల్ ప్లాంటుకు ఇది శుభవార్త! సీఎం చంద్రబాబు ప్రయత్నాలకు ఫలితం లభిస్తోంది. ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోసేలా... భారీ ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం ముందుకువచ్చింది. విశాఖ ఉక్కుకు రూ.11,500 కోట్ల ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్రం అంగీకరించినట్లు తెలిసింది. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ చేసిన ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం గురువారం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే ఇందుకు సంబంధించి కొన్ని అంశాలపై స్పష్టత కోసం శుక్రవారం కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామితో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు చర్చలు జరపనున్నారు. దీని తర్వాత ప్రత్యేక ప్యాకేజీ ద్వారా స్టీల్ ప్లాంట్‌ను నడిపేందుకు

మిగతా 13వ పేజీలో...

## ఇస్రో స్పేస్ డాకింగ్ విజయవంతం

# ఇక అంతరిక్ష కేంద్రం



రోదసిలో కరచాలనం

స్పేడెక్స్ ఉపగ్రహాల సంధానం సక్సెస్

ఆ ఘనత సాధించిన 3 దేశాల సరసన భారత్

ఉపగ్రహాల డాకింగ్ ప్రతీకాత్మక చిత్రం

2035 నాటికి నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్

ఐదు మాడ్యూళ్లను డాక్ చేయడం ద్వారా నిర్మాణం!

అందులో భాగంగానే స్పేస్ డాకింగ్ ప్రయోగ నిర్వహణ

2028 డిసెంబరు నాటికి తొలి మాడ్యూల్ లాంచింగ్

తర్వాత దశలవారీగా మిగతా 4 మాడ్యూళ్లు రోదసిలోకి

భూమికి 400 కిలోమీటర్ల ఎత్తున పరిభ్రమిస్తూ సేవలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన ప్రతిష్ఠాత్మక స్పేస్ డాకింగ్ ప్రక్రియ విజయవంతమైంది! కొంత సమయం తేడాతో.. ఒకే లాంచింగ్ వాహనం ద్వారా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిన 2 ఉపగ్రహాలూ సక్సెస్‌ఫుల్‌గా అనుసంధానమయ్యాయి! దీంతో భారతదేశం భవిష్యత్తులో ఒక దాని తర్వాత మరొకటిగా మాడ్యూళ్లను పంపి భారీ నిర్మాణాలను చేపట్టడానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం రోదసిలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం తరహాలోనే.. 2035 నాటికి సొంతంగా అంతరిక్ష కేంద్రం (భారతీయ అంతరిక్ష స్టేషన్-బీఏఎస్) నిర్మించాలన్న ఇస్రో లక్ష్యానికి ఈ విజయం ఎంతగానో కీలకం. గురువారం

మిగతా 9వ పేజీలో...

## శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్




నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

రూ.3,985 కోట్లు వ్యయం

నాలుగేళ్లలో పూర్తిచేయాలన్నది లక్ష్యం

2

# ఇదే మా పథం!



## నేనొస్తే అభివృద్ధి జరుగుతుందని ఆశించారు

## ఇప్పుడు అది చేసి చూపిస్తున్నాను: సీఎం

ఆదాయం పెంచుకోకుండా పథకాలు అమలు చేయాలంటే అప్పులొక్కటే మార్గం. ఒక దశ దాటాక అప్పులు రావు. తీర్చే దారీ దొరకదు. కేంద్రం మన ఒక్కళ్లకే సాయం చేయలేదు. మన కాళ్లపై మనం నిలబడి ఆదాయం పెంచుకోవాలి.

మనకు మనుషులే ఆస్తి. ఆ ఆస్తి తగ్గితే బలహీనపడతాం. జనాభాను పెంచుకోవాలి. కొత్తతరం చాలినంత రాకపోతే పెద్ద తరం మాత్రమే మిగులుతుంది. కొన్ని దేశాలు ఇది ముందుగా ఊహించలేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నాయి. మనం ఆ పరిస్థితి తెచ్చుకోవద్దు.

\- సీఎం చంద్రబాబు

7 నెలల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు

మళ్లీ పట్టాలెక్కిన అమరావతి, పోలవరం

ప్రతి కుటుంబానికీ ఇల్లు, నీళ్లు, విద్యుత్, గ్యాస్

**ఇద్దరు పిల్లలు ఉంటేనే ఎన్నికల్లో పోటీకి అవకాశమివ్వాలి: చంద్రబాబు**

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు వస్తే అభివృద్ధి జరుగుతుందని ఎన్నికల ముందు అందరూ అనుకున్నారు. నేనొస్తే జరిగే అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన గురువారమిక్కడ రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఈ ఏడు నెలల్లో

మిగతా 13వ పేజీలో...

**2047నాటికి రూ.347 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం**

తలసరి ఆదాయం రూ.58.14 లక్షలకు పెంచడమే లక్ష్యం

వైసీపీ హయాంలో రాజధాని అమరావతిని భ్రష్టు పట్టించారు

పోలవరాన్ని గోదాట్లో కలిపేశారు

పారిశ్రామికవేత్తలు పారిపోయేలా చేశారు: సీఎం

13

**ఇప్పటికే ఇవి చేశాం**

1.85 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్... ప్రధాని శంకుస్థాపన.

రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ..

అనకాపల్లిలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఆర్సెలార్ నిప్పన్ ఆసక్తి..

ముడి ఇనుముపై స్పష్టత వస్తే 1.40 లక్షల కోట్లతో స్థాపన.

హైవేలపై కేంద్రం ఖర్చు 50 వేల కోట్లు.. రైల్వే లైన్లపై రూ.70 వేల కోట్లు

**గ్రీన్ ఎనర్జీలో 10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం**

## విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్

రైల్వే బ్రిడ్జి వద్ద ఇరుక్కున్న కంటైనర్

4.కి.మీ మేర నిలిచిన వాహనాలు

హైదరాబాద్‌కు భారీగా ప్రజల తిరుగు ప్రయాణం

రోడ్లపై వాహనాల బారులు

11

## పూటుగా తాగేశారు

ఏరులై పారిన మద్యం



సంక్రాంతి 3 రోజుల్లో 400 కోట్ల అమ్మకాలు

సాధారణం కంటే 160 కోట్లు ఎక్కువ



# త్వరలో 8వ వేతన కమిషన్

నియామకానికి ప్రధాని ఆమోదం.. కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

2026 జనవరి 1 నుంచి 'కొత్త జీతాలు'.. గడువులోపు సంప్రదింపులకు వీలుగా

త్వరలోనే కమిషన్‌ను నియమిస్తాం.. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన

2

## ఆంధ్ర పిటిషన్లపై విడివిడిగా విచారణ

బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 నిర్ణయం.. తొలుత 2023 కేంద్ర గెజిట్‌పై వాదనలు

తర్వాత ప్రాజెక్టులకు నీటి కేటాయింపులపైన.. ఫిబ్రవరి 19 నుంచి 21 దాకా విచారణ

11

## రేపటి నుంచే డయాఫ్రం వాల్ పనులు!

## టీ-5 కాంక్రీట్ మిశ్రమానికే జలసంఘం ఓటు

సీఎస్ఎంఆర్ఎస్ సిఫారసుకు ఆమోదం.. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమాచారం

సీఎం ఆమోదించగానే ముందుకు.. ఈ ఏడాది చివరికల్లా పనుల పూర్తికి బావర్‌కు గడువు

3

# 96 గంటల సుదీర్ఘ చర్చలు

దానివల్లే ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ

హమాస్ వెనక్కి తగ్గేవరకూ ఆమోదించం: నెతన్యాహు

ఇజ్రాయెల్ వైదొలిగితేనే బందీల విడుదల: హమాస్

2

ఒప్పందానికి అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వం

# సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

**ముంబైలోని ఇంట్లోకి చొరబడి దుండగుడి దాడి.. వెన్నెముక నుంచి 2.5 అంగుళాల కత్తి అంచు తొలగింపు**

- లీలావతి ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. ఆరోగ్యం నిలకడ
- దుండగుడిపై దోపిడీ, హత్యాయత్నం కేసు నమోదు



పోలీసులు విడుదల చేసిన నిందితుడి ఫొటో



ముంబై, జనవరి 16: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఓ గుర్తుతెలియని దుండగుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఆరు కత్తిపోట్లకు గురైన సైఫ్.. ప్రస్తుతం లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అత్యవసర శస్త్రచికిత్సలు చేశామని, ప్రాణాపాయం ఏమీ లేదని, రెండ్రోజుల్లో నాన్-ఐసీయూ విభాగానికి మారుస్తామని వైద్యులు తెలిపారు. దొంగతనానికి వచ్చిన దుండగుడి ప్రయత్నాన్ని సైఫ్ అడ్డుకోవడంతో జరిగిన పెనుగులాటలో కత్తితో దాడి చేసినట్లు ఆ ఇంటి పనిమనిషి చెబుతోంది. ఆమెకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. సైఫ్ అలీఖాన్ ఇంటి పనిమనిషి ఫిర్యాదు, పోలీసుల కథనం ప్రకారం.. గురుగ్రామ్‌లోని పటౌడీ సంస్థాన వారసుడు, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ముంబైలోని బాంద్రాలో 12 అంతస్తులు ఉన్న సత్‌గురు శరణ్ అపార్ట్‌మెంట్‌లో.. చివరి నాలుగు అంతస్తుల్లో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి ఆయన భార్య, బాలీవుడ్ నటి కరీనాకపూర్, కుమారులు జహంగీర్ అలీఖాన్, తైమూర్ అలీఖాన్‌తో నిద్రకు ఉపక్రమించారు. వీరు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అయితే.. రాత్రి 2 గంటల సమయంలో ఓ దుండగుడు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కిందకు దిగేందుకు ఉపకరించే ఎమర్జెన్సీ మార్గం నుంచి సైఫ్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ మార్గం సైఫ్ కుమారుడు జహంగీర్ గదికి అనుసంధానమై ఉంటుంది. జహంగీర్ తన తల్లిదండ్రుల వద్దే ఉండడం.. ఆ గదిలో అలికిడి రావడంతో పనిమనిషి నిద్రలేచి, అక్కడికి వెళ్లింది. జహంగీర్ గదిలో దుండగుడు నక్కి ఉండడంతో.. "దొంగ.. దొంగ.." అంటూ గట్టిగా కేకలు వేసింది. దాంతో నిద్ర లేచిన సైఫ్.. ఆ గదికి చేరుకున్నాడు. అప్పటికే ఆ దుండుగు పనిమనిషిని గట్టిగా పట్టుకుని, మెడపై కత్తి పెట్టి సైఫ్‌ను బెదిరించాడు. "రూ. కోటిన్నర ఇస్తేనే ఆమెను వదులుతాను" అంటూ హెచ్చరించాడు. దీంతో సైఫ్ దుండగుడితో తలపడ్డారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగింది. తేరుకున్న దుండగుడు కత్తితో సైఫ్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ అలికిడితో కరీనా, ఇద్దరు పిల్లలు, మరో పనిమనిషి అక్కడికి వచ్చేసరికి దుండగుడు వచ్చిన మార్గంలోనే పరారవ్వగా.. సైఫ్ రక్తమోడుతూ కనిపించారు. సైఫ్ వెన్నెముక, మెడ భాగంలో లోతుగా కత్తిపోట్లు కాగా.. చేతిపై, భుజంపై మరో నాలుగు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను లీలావతి ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో కారు సిద్ధంగా లేకపోవడంతో లేకపోవడంతో.. సైఫ్‌ను ఆటోలో తీసుకెళ్లారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాంద్రా పోలీసులు భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని సెక్షన్లు 311(దోపిడీ యత్నం, హత్యాయత్నం, తీవ్రంగా గాయపరచడం), 331(4) (అనుమతి లేకుండా ఇంట్లోకి చొరబాటు, చోరీ యత్నం) కింద కేసు నమోదు చేశారు. ఆ వెంటనే కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు. సైఫ్ ఉంటున్న సద్గురు శరణ్ అపార్ట్‌మెంట్ సీసీకెమెరాల ఫుటేజీని జల్లెడపట్టిన పోలీసులు.. నిందితుడి ఫొటోను మీడియాకు విడుదల చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. క్లూస్‌టీమ్ కీలక ఆధారాలను సేకరించగా.. స్నిఫర్ డాగ్స్‌తో దర్యాప్తు కొనసాగించారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరున్న దయానాయక్ కూడా సైఫ్ ఇంటిని పరిశీలించారు. ఈ దర్యాప్తులో ఆయన కూడా పాలుపంచుకుంటారని తెలుస్తోంది. కొంతకాలంగా అపార్ట్‌మెంట్ ఉన్న హౌసింగ్ సొసైటీలో పలు ఇళ్లకు మరమ్మతులు జరుగుతున్నాయని, అక్కడ పనిచేస్తున్న కార్మికులను కూడా ప్రశ్నిస్తున్నామని పోలీసులు వివరించారు.

### రాజకీయ రచ్చ?

సైఫ్ అలీఖాన్‌పై దాడి ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. ముంబైలో సెలబ్రిటీలకే భద్రత లేకుంటే.. సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్‌పవార్ ప్రశ్నించారు. శాంతిభద్రతలు అదుపుతప్పాయని విమర్శించారు. గత ఏడాది బాంద్రాలోనే ఎన్సీపీ మాజీ ఎమ్మెల్యే బాబా సిద్ధిఖీ హత్యకు గురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎం ఫడణవీస్ వద్దే హోం శాఖ ఉన్న విషయం తెలిసిందే.! ముంబైలో ఎవరూ సురక్షితంగా లేరని శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్‌రౌత్ ఆరోపించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే కూడా హోంశాఖను తనవద్ద పెట్టుకున్న ముఖ్యమంత్రి ఫడణవీస్ శాంతిభద్రతల విషయంలో దారుణంగా విఫలమయ్యారంటూ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ ఘటనపై విస్మయం వ్యక్తం చేశారు. సైఫ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### సైఫ్ క్షేమం

తీవ్ర గాయాలపాలైన సైఫ్ అలీఖాన్‌కు లీలావతి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నితిన్ డాంగే(న్యూరో సర్జన్), డాక్టర్ లీనా జైన్(కాస్మెటిక్ సర్జన్), డాక్టర్ నిషా గాంధీ(అనస్థీషియాలజిస్టు) రెండున్నర గంటల పాటు శ్రమించి, శస్త్రచికిత్స చేశారు. 2.5 అంగుళాల పొడవున్న కత్తి అంచును సైఫ్ వెన్నెముఖ నుంచి తొలగించామని వైద్యులు పేర్కొన్నారు. "తెల్లవారుజామున 3 గంటల సమయంలో సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండ్రోజుల్లో కోలుకుంటారు. ఆ తర్వాత ఆయనను నాన్-ఐసీయూ వార్డుకు తరలిస్తాం" అని లీలావతి ఆస్పత్రి సీవోవో డాక్టర్ నీరజ్ వెల్లడించారు. వెన్నెముక గాయాన్ని సరిచేసి, లీకైన ఫ్లూయిడ్లను సరిచేశామన్నారు. చేతికి, మెడకు ప్లాస్టిక్ సర్జరీలు చేశామని తెలిపారు. కాగా.. ఆస్పత్రి వద్ద సైఫ్, కరీనా టీమ్‌లు మీడియాతో మాట్లాడాయి. ఈ దాడి విషయంలో మీడియా సంయమనం పాటించాలని కోరాయి. సైఫ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నాయి.

## పెన్, పేపర్ విధానంలోనే నీట్

**ఒకేరోజు, ఒకే షిఫ్ట్‌లో నిర్వహణ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి**

న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)-2025 నిర్వహణపరంగా ఓ స్పష్టత వచ్చింది. నీట్‌ను మునుపటి మాదిరిగానే పెన్, పేపర్ విధానం (ఓఎంఆర్)లో నిర్వహించనున్నారు. ఒకేరోజు, ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహిస్తారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. నీట్-2025ను ఓఎంఆర్ విధానంలో నిర్వహించాలా? కంప్యూటర్-బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించాలా? అనే విషయంలో కేంద్ర విద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖలు నెలరోజులుగా మల్లగుల్లాలు పడ్డాయి. ఈ మేరకు కేంద్రమంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన రెండు సార్లు సమావేశం కూడా నిర్వహించారు. చివరికి ఓఎంఆర్ విధానంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు ఎన్టీఏ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చని ఎన్టీఏ తెలిపింది.

## ఏఐ కంటెంట్‌పై లేబుల్స్ తప్పనిసరి

- ఎన్నికల ప్రచారంలో ఏఐ.. పార్టీలకు ఈసీ సూచనలు

న్యూఢిల్లీ, జనవరి 16: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో కృత్రిమ మేధ(ఏఐ)ను విరివిగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) అప్రమత్తమైంది. ఏఐ సాయంతో రూపొందించిన ఫొటోలు, వీడియోలు, ఆడియో వంటివి ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయని గుర్తించింది. దీంతో ఏఐ వినియోగం అంశంలో రాజకీయ పార్టీలకు పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొంటూ గురువారం పలు సూచనలు చేసింది.

ఏఐ ద్వారా రూపొందించిన ఫొటోలు, వీడియోలు, ఆడియోను ప్రచారంలో వినియోగిస్తే.. ఆ కంటెంట్‌పై 'ఏఐ జనరేటెడ్/డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్/ సింథటిక్ కంటెంట్' అనే లేబుల్స్‌ను కనిపించేలా తప్పనిసరిగా ముద్రించాలని రాజకీయ పార్టీలను ఈసీ ఆదేశించింది. అంతేకాక, ఏఐ సాయంతో రూపొందించిన కంటెంట్‌తో ప్రకటనలు ఇచ్చేటప్పుడు.. ముందుగా హెచ్చరికలు వెయ్యాలని సూచించింది. ఈ మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓ అడ్వయిజరీ పంపింది.

## కశ్మీర్‌లో మిస్టరీ మరణాలు

- నెలన్నర వ్యవధిలో 15 మంది మృతి

జమ్మూ, జనవరి 16: ప్రకృతి అందాలకు నెలవైన జమ్మూకశ్మీర్‌లో మిస్టరీ మరణాలు ప్రజలకు, అధికారులకు దడ పుట్టిస్తున్నాయి. కశ్మీర్ రాజౌరి జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలున్నర వ్యవధిలో 15 మంది మృతి చెందగా వారిలో ఎక్కువగా చిన్నారులే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. బాధితులు వాంతులు చేసుకుని, ఒక్కసారిగా స్పృహ కోల్పోతున్నారు. అనంతరం వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణిస్తున్నారు. బాధితుల నమూనాలను లేబరేటరీలకు పంపగా.. వారి మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని తేలడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. అయితే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్ (ఐఐటీఆర్) నిర్వహించిన విశ్లేషణలో మాత్రం ఆ నమూనాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు తేలింది. దీంతో అప్రమత్తమయిన ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని వివిధ శాఖలను ఆదేశించింది. దర్యాప్తు కోసం 11 మందితో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

## ఇంట్లో జారిపడ్డ పోప్ ఫ్రాన్సిస్

- కుడి చేయికి స్వల్పగాయం.. నిలకడగా ఆరోగ్యం

రోమ్, జనవరి 16: కేథలిక్ క్రైస్తవుల ప్రధాన మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) తన నివాసమైన శాంటా మార్టాలో గురువారం జారిపడినట్టు వాటికన్‌సిటీ వర్గాలు తెలిపాయి. ఈ కారణంగా ఆయన కుడి మంజేతికి స్వల్పంగా గాయమయిందని, ఎముకకు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించాయి. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపాయి. గత నెల ఏడో తేదీన కూడా ఆయన జారిపడడంతో గడ్డానికి చిన్న గాయమయింది. మోకాలు నొప్పుల కారణంగా చాలా సందర్భాల్లో ఆయన వీల్ ఛైర్‌ను ఉపయోగిస్తున్నారు. ఇంకొన్ని సమయాల్లో ఊతకర్ర పట్టుకొని నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేస్తారన్న వదంతులు కూడా వ్యాపించాయి.

## శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్

- నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సూళ్లూరుపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఈ లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి రూ. 3,985 కోట్లు వ్యయం అవుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇస్రో 'నెక్స్ట్ జెనరేషన్ లాంచ్ వెహికిల్స్ (ఎన్‌జీఎల్వీ)'తో పాటు ఎల్‌వీఎం3 అంతరిక్ష వాహనాల ప్రయోగాలకు అనుగుణంగా ఈ కొత్త లాంచ్ ప్యాడ్ నిర్మాణం ఉంటుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. అలాగే రెండో లాంచ్ ప్యాడ్‌కు స్టాండ్‌బై కూడా ఇది ఉంటుందని, భవిష్యత్‌లో మానవ సహిత అంతరిక్ష యాత్రకు సంబంధించిన రాకెట్ల ప్రయోగ సామర్థ్యం కూడా దీనితో పెరుగుతుందని తెలిపింది. నాలుగేళ్లలో దీని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ ప్రకటనలో ప్రభుత్వం వెల్లడించింది.



గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న అశేష భక్త జనం

## 4 రోజుల్లో 6 కోట్ల మంది!

- వైభవంగా సాగుతున్న మహా కుంభమేళా

మహాకుంభ్ నగర్/లఖ్‌నవూ, జనవరి 16: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఈ మహోత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో కోట్లాదిమంది పాలుపంచుకుంటూ.. భక్తిపారవశ్యంతో మునిగి తేలుతున్నారు. గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో గురువారం లక్షలాది మంది పుణ్య స్నానాలు ఆచరించగా, తొలి 4 రోజుల్లో అమృత స్నానాలు ఆచరించిన వారి సంఖ్య 6 కోట్లు దాటిందని అధికారికవర్గాలు పేర్కొన్నాయి. 45రోజులుసాగే మహా కుంభమేళాలో పాల్గొనేందుకు 50 కోట్ల మంది వరకు ప్రయాగ్‌రాజ్ వచ్చే అవకాశం ఉందని డీజీపీ ప్రశాంత్ కుమార్ అన్నారు. 20 లక్షల మంది వరకు విదేశీ యాత్రికులు ఉంటారని అంచనా వేశారు. కాగా, భారత విదేశాంగ శాఖ ఆహ్వానం మేరకు 10 దేశాలకు చెందిన 21 మందితో కూడిన అంతర్జాతీయ బృందం ప్రయాగ్‌రాజ్‌లోని తాత్కాలిక టెంట్ సిటీకి చేరుకుంది. వీరంతా త్రివేణి సంగంలో పవిత్ర స్నానాలు చేయడంతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కుంభ్ ఆధ్మాత్మిక వైభవంలో కాంటే వాలే బాబా అలియాస్ రమేశ్ కుమార్ మాంఝీ 'ముళ్ల కంప పాన్పు'పై పడుకొని డమరుకం మోగిస్తూ తన భక్తిని చాటారు. మహా కుంభమేళాను ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ఆరెస్సెస్ 'వన్ ప్లేట్, వన్ బ్యాగ్' ప్రచారాన్ని ప్రారంభించింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ యోగా సాధకులు 129 ఏళ్ల స్వామి శివానంద బాబా మహా కుంభమేళాకు హాజరయ్యారు. ఈయన గత వందేళ్లుగా ప్రయాగ్‌రాజ్, నాసిక్, ఉజ్జయినీ, హరిద్వార్‌లతో జరిగే ప్రతి కుంభమేళాకు హాజరవుతున్నారని ఆయన శిష్యుడు సంజయ్ సర్వజన పేర్కొన్నారు.

## లోకం తీరు




## హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ మూసివేత

**సంస్థ వ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ లేఖ**

వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 16: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ వ్యాపార సామ్రాజ్యాన్ని కుదిపేసి, ఆయన కంపెనీల నుంచి రూ.వందల కోట్లు ఆవిరి చేసి అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టించిన అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ 'హిండెన్‌బర్గ్ రిసెర్చ్' మూతపడింది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు నాథన్(నేట్) ఆండర్సన్ గురువారం ప్రకటించారు. తాము ఎంచుకున్న ప్రణాళికలు పూర్తయిన తర్వాత సంస్థను మూసేయాలన్న ఆలోచన ఉందని, అది ఈ రోజే.. అని సంస్థ వెబ్‌సైట్‌లో పోస్టు చేసిన లేఖలో ఆయన తెలిపారు. ఈ సంస్థను నడపడం జీవితకాల సాహసంగా ఆయన అభివర్ణించారు. 'ఈ నిర్ణయం వెనుక ఎలాంటి కారణాలు, బెదిరింపులు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగతమైన అంశాలు ఏమీ లేవు. గతంలో నన్ను నేను నిరూపించుకోవాలని భావించేవాడిని. ఇప్పుడు జీవితంలో తొలిసారిగా నేను కంఫర్ట్ జోన్‌లో ఉన్నానని అనిపిస్తోంది. హిండెన్‌బర్గ్ సంస్థను నన్ను నిర్వచించే ప్రధాన విషయంగా కాకుండా.. నా జీవితంలో ఒక అధ్యాయంగా మాత్రమే చూస్తున్నాను' అని ఆ లేఖలో ఆండర్సన్ వెల్లడించారు. కాగా, హిండెన్‌బర్గ్ సంస్థ మూసివేయడం అంటే మోదానీకి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు కాదని కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది.



## తప్పుడు క్లెయిమ్‌లతో 1,070 కోట్లు లాగేశారు

- ఐటీ శాఖ పరిశీలనలో తేలిన లెక్క

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను చట్టంలోని వివిధ సెక్షన్ల కింద అటు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), ఇటు ప్రైవేట్ సంస్థలకు చెందిన 90 వేల మంది వేతనజీవులు తప్పుడు క్లెయిమ్‌లు దాఖలు చేసి 2024 డిసెంబరు 31 నాటికి రూ.1,070 కోట్లు మినహాయింపులు పొందారని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ పరిశీలనలో తేలింది. ఐటీ శాఖ నిర్వహించిన సోదాలు, దాడులు, సర్వేల్లో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. వారందరూ సమర్పించిన ఐటీఆర్‌లలో 80సీ, 80డీ, 80ఇ, 80 జీ, 80 జీజీబీ, 80 జీజీసీ సెక్షన్ల కింద తప్పుడు క్లెయిమ్‌లు చేయడం వల్ల ఆ మేరకు ప్రభుత్వాదాయానికి గండి పడింది. ప్రధానంగా 80 జీజీబీ/80 జీజీసీ సెక్షన్ల కింద పన్ను చెల్లింపుదారులు తీసుకున్న మినహాయింపు మొత్తానికి, దానం తీసుకున్న సంస్థలు దాఖలు చేసిన ఐటీఆర్‌లలో చూపిన మొత్తానికి మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్టు తేలింది. అదే విధంగా 80సీ, 80ఇ, 80జీ కింద క్లెయిమ్ చేసుకున్న కొన్ని మినహాయింపులు సైతం అనుమానాస్పదంగా ఉన్నట్టు తేలిందని ఐటీ శాఖ వర్గాలు తెలిపాయి. కొందరు అవాంఛనీయ శక్తులు వారిని తప్పుదారి పట్టించినట్టు కూడా పరిశీలనలో తేలినట్టు చెప్పారు. ఇలాంటి తప్పుడు క్లెయిమ్‌ల వల్ల ఏర్పడే పరిణామాలు, వాటిని దిద్దుకునే మార్గాలపై యాజమాన్యాల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. ఐటీ చట్టం 1961 కింద ఐటీఆర్‌ల దాఖలులో ఎలాంటి లోటుపాట్లున్నా అసెసీలు సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం నుంచి రెండేళ్ల లోపు సవరించిన రిటర్న్ దాఖలు చేసుకునే వెసులుబాటు ఉంది.

# 96 గంటల చర్చలు

**దానివల్లే ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం**

- అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వం
- దోహాలో సుదీర్ఘ కసరత్తు

టెల్‌అవీవ్, జనవరి 16: దాదాపు 15 నెలలపాటు అంతులేని విధ్వంసానికి, ప్రాణనష్టానికి, వేదనలు, రోదనలకు కారణమైన ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం వెనుక సుదీర్ఘమైన కసరత్తు దాగి ఉంది. ఇరుపక్షాలు నిరవధికంగా 96 గంటల పాటు చర్చలు జరిపి చివరికి ఒక పరిష్కారానికి చేరుకున్నాయి. మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, ఈజిప్టు ప్రతినిధుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఖతార్ రాజధాని దోహాలో ఓ బహుళ అంతస్తుల భవనంలో చర్చలు జరిగాయి. ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధులు విడివిడిగా ఒక్కో అంతస్తులో ఉండగా.. వారితో మధ్యవర్తులు చర్చలు జరుపుతూ వివాదాన్ని కొలిక్కి తెచ్చారు. కాగా, ఈ చర్చల ప్రక్రియలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, కాబోయే అధ్యక్షుడు ట్రంప్ తరఫున ప్రతినిధులు ఒక్కటిగా కాకుండా.. ఎవరికివారుగానే పాల్గొనటం విశేషం. బైడెన్ దూతగా బ్రెట్ మెక్‌గార్క్, ట్రంప్ ప్రతినిధిగా స్టీవ్ విట్కాఫ్ పాల్గొన్నారు. అయితే, వారిద్దరూ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుకొంటూ.. మంచి సమన్వయంతో చర్చలను ముందుకు తీసుకెళ్లారని అమెరికా ప్రభుత్వాధికారులు వెల్లడించారు. చర్చల్లో అమెరికా విదేశాంగమంత్రి ఆంటోని బ్లింకెన్, ఆ దేశ జాతీయ భద్రత సలహాదారు జేక్ సులివాన్ కీలక పాత్ర పోషించారని బైడెన్ కొనియాడారు. తమ వల్లే ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం సాధ్యమైందంటూ అటు బైడెన్, ఇటు ట్రంప్ పోటాపోటీగా ప్రకటనలు జారీ చేయటం గమనార్హం.



### యుద్ధనష్టం

**ఇజ్రాయెల్**

2023 అక్టోబరు 7న హమాస్ దాడి - 1200 మంది మృతి; బందీలు 251 మంది (వీరిలో కొందరు ఇప్పటికే విడుదల కాగా.. పలువురు మరణించారు. 62 మంది సజీవంగా ఉన్నట్లు అంచనాలున్నాయి) ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం: మృతి చెందిన సైనికులు: 840; గాజా నుంచి ఇజ్రాయెల్ మీదికి ప్రయోగించిన రాకెట్లు: 10 వేలకుపైగా; దాడుల కారణంగా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన ప్రజలు: 75,500

**గాజా**

మరణించిన పాలస్తీనీయన్లు - 46 వేల మందికిపైగా (వీరిలో సగానికిపైగా స్త్రీలు, పిల్లలు), గాయపడిన వారు - 1.09 లక్షల మంది, హతమైన మిలిటెంట్లు: 17 వేల మంది (ఇజ్రాయెల్ సైన్యం చెప్పిన దాని ప్రకారం), ధ్వంసమైన ఇల్లు, కట్టడాలు: 1,36,000; ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ప్రజలు: 19 లక్షల మంది; ఇజ్రాయెల్ అదుపులో ఉన్న గాజా భూభాగం: 90 %.

### ఒప్పందం ప్రకారం ఇలా..

ఈ నెల 19 నుంచి అమలులోకి రానున్న కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం.. తమ వద్ద బందీలుగా ఉన్న 33 మందిని హమాస్ వచ్చే ఆరువారాల వ్యవధిలో విడిచిపెడుతుంది. దానికి బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో సుదీర్ఘకాలంగా మగ్గుతున్న వందలాది మంది పాలస్తీనీయులను ఇజ్రాయెల్ వదిలిపెడుతుంది. గాజాలో మోహరించిన పలు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం వైదొలుగుతుంది. ఇజ్రాయెల్ హెచ్చరికలు, బాంబుల వర్షంతో తరలిపోయిన గాజా వాసులు తిరిగి తమ స్వస్థలాలకు చేరుకుంటారు. రెండోదశలో భాగంగా హమాస్ తమ వద్ద ఉన్న మిగిలి ఉన్న బందీలను (వీరిలో ఇజ్రాయెల్ సైనికులు కూడా ఉన్నారు) విడిచిపెడుతుంది. ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు పూర్తిగా కట్టుబడి, దళాలను పూర్తిగా ఉపసంహరించుకోనంతవ రకూ తాము రెండో దశ బందీల విడుదల ప్రక్రియను చేపట్టబోమని హమాస్ ఇప్పటికే స్పష్టం చేసింది. కాగా, హమాస్‌ను పూర్తిగా తుదముట్టించేంతవరకూ తమ పోరాటం ఆగదని ఇజ్రాయెల్ తెలిపింది.



### పుతిన్‌తో భేటీ కానున్న ట్రంప్!

అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం అనంతరం ట్రంప్.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యే అవకాశం ఉందని గురువారం వార్తలు వెలువడ్డాయి. ఈ సమావేశంలో.. ఉక్రెయిన్ నాటో సభ్యత్వం గురించి ఇరువురూ చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. నాటోతో సంబంధాలను ఉక్రెయిన్ వదులుకోవాలని, పరిమితంగానే సైన్యాన్ని ఉంచుకోవాలని పుతిన్ డిమాండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ ఎక్కడ, ఎప్పుడు జరుగుతుందన్న వివరాలు వెల్లడి కాలేదు.

# త్వరలో 8వ వేతన కమిషన్

- నియామకానికి ప్రధాని ఆమోదం
- కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

న్యూఢిల్లీ, జనవరి 16: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం శుభవార్త వినిపించింది. ఏమాత్రం ఆలస్యం కాకుండా, సకాలంలో 'కొత్త జీతాలు' అందించేలా 8వ వేతన కమిషన్‌ను నియమించాలని నిర్ణయించింది. 2016 జనవరి 1వ తేదీ నుంచి 7వ వేతన కమిషన్ సిఫారసులు అమలులోకి వచ్చాయి. దీనికి సంబంధించి పదేళ్ల గడువు... ఈ ఏడాది చివరితో ముగుస్తుంది. 2026 జనవరి 1వ తేదీ నుంచి సవరించిన వేతనాలు అందించేలా ప్రధాని నరేంద్ర మోదీ 8వ వేతన సవరణ కమిషన్‌కు ఆమోదం తెలిపినట్లు కేంద్ర సమాచార-ప్రసార, రైల్వే, ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం విలేకరులకు తెలిపారు. కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఆయన... ఈ శుభవార్త కూడా వినిపించారు. "ప్రధాని మోదీ నిర్దిష్ట కాల పరిమితి ప్రకారం పీఆర్సీని నియమిస్తున్నారు. 2016 నుంచి అమలులోకి వచ్చిన 7వ పీఆర్సీ సిఫారసులు ఈ ఏడాదితో ముగుస్తాయి. 2026 జనవరి 1 నుంచి కొత్త పే కమిషన్ సిఫారసులు అమలులోకి రావాలి. ఈలోపే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలతో, ఇతర భాగస్వాములతో సంప్రదింపులు జరిపి సిఫారసులు చేసేలా త్వరలోనే 8వ వేతన కమిషన్‌ను వేస్తాం. ఒక చైర్మన్‌ను, ఇద్దరు సభ్యులను నియమిస్తాం" అని వైష్ణవ్ తెలిపారు. మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్న సమయంలోనే... కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఈ ప్రకటన రావడం మరో విశేషం. ఈ నిర్ణయం వల్ల 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. కొత్త కమిషన్ అమల్లోకి వస్తే కరువు భత్యం (డీఏ) సర్దుబాటు కూడా జరిగి తమ వేతనాలు, పింఛన్లు పెరుగుతాయి. అయితే... పే కమిషన్‌ను నిర్దిష్టంగా ఎప్పుడు నియమించనున్నదీ వైష్ణవ్ చెప్పలేదు.



### 7వ కమిషన్‌తో ఇలా...

వేతనాలు, పింఛన్లు లెక్కగట్టడంలో ఫిట్‌మెంట్‌ది కీలక పాత్ర. ఏడో కమిషన్ వేతనాలు సవరించే సమయంలో ఉద్యోగులు 3.68 ఫిట్‌మెంట్ కోరారు. అయితే కేంద్రం 2.57 ఫిట్‌మెంట్‌ను నిర్ణయించింది. ఈ నిర్ణయంతో నాడు కేంద్ర ఉద్యోగుల కనీస మూల వేతనం (బేసిక్ పే) నెలకు రూ.18 వేలకు పెరిగింది (ఆరో వేతన కమిషన్ కాలంలో ఇది రూ.6 వేలు మాత్రమే ఉండేది). అలాగే కనీస పింఛను రూ.3,500 నుంచి రూ.9 వేలకు, గరిష్ఠ వేతనం రూ.2,50,000కు, గరిష్ఠ పెన్షన్ రూ.1,25,000కు పెరిగాయి. ఎనిమిదో వేతన కమిషన్ సిఫారసులతో కనీస, గరిష్ఠ వేతనాలు, పెన్షన్లు భారీగా పెరుగుతాయని ఉద్యోగ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల తీరుతెన్నులు, అలవెన్సులు, ఇతర ప్రయోజనాల ఖరారులో వేతన కమిషన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. సాధారణంగా కేంద్ర వేతన కమిషన్ ప్రతి పదేళ్లకోసారి ఏర్పాటవుతుంది. 7వ వేతన కమిషన్‌ను 2014లో నియమించగా... దాని సిఫారసులు 2016 జనవరి 1నుంచి అమలులోకి వచ్చాయి. ద్రవ్యోల్బణం, ఇతర ఆర్థిక సూచికల ఆధారంగా పే స్కేళ్లు, అలవెన్సులు, ప్రయోజనాలను ఎలా మార్పు చేయాలో వేతన కమిషన్ సూచనలు చేస్తుంది. దాని సిఫారసులు లక్షలాది ఉద్యోగులు, పెన్షనర్లపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు వీటి సిఫారసులను అమలు చేస్తూ వస్తున్నాయి. 1947 నుంచి ఇప్పటివరకు కేంద్రం ఏడు వేతన కమిషన్లను ఏర్పాటుచేసింది. వచ్చేది ఎనిమిదోది.

### ఉద్యోగులు మాకు గర్వకారణం

"వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు మాకు గర్వకారణం. 8వ పే కమిషన్‌ను ఆమోదిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వారి జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుంది. వ్యయ సామర్థ్యాన్ని, వినియోగాన్ని పెంచుతుంది"

- ప్రధాని మోదీ (ఎక్స్ వేదికగా)



## శ్రీవారి సేవలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి

తిరుమల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డుప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా ఏటి పండుగ | కిటకిటలాడిన పినాకిని తీరం

సంక్రాంతి సంబరాల్లో చివరి పండుగ..ముక్కనుమ నాడు జరిగే ఏటి పండుగ పెన్నానది తీరంలో గురువారం రాత్రి వైభవంగా జరిగింది. కులమ తాలకు అతీతంగా కుటుంబాలతో కలిసి వచ్చి పాల్గొనడంతో పెన్నాతీరం కిటకిట లాడింది. భక్తులను ఆశీర్వదించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి దేవతా మూర్తులు సర్వాభరణాలు, విశేష అలం కారాలతో తరలి వచ్చి కొలువుదీరారు. మహిళలు గొబ్బెమ్మలకు పూజలు చేసి, పాటలు పాడుతూ పెన్నలో నిమజ్జనం చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు.

-ఆంధ్రజ్యోతి, నెల్లూరు (సాంస్కృతికం)



# రేపటి నుంచే 'వాల్' పనులు!

**టీ-5 కాంక్రీట్ మిశ్రమానికే జలసంఘం ఓటు.. సీఎస్ఎంఆర్ఎస్ సిఫారసుకు ఆమోదం**

- పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమాచారం
- సీఎం, మంత్రి ఆమోదించగానే ముందుకు
- ఈ ఏడాది చివరికల్లా డయాఫ్రం వాల్
- పనుల పూర్తికి బావర్‌కు గడువు

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణానికి అవాంతరాలు తొలగిపోయాయి. సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) ప్రతిపాదించిన టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్నే నిర్మాణంలో ఉపయోగించాలని కేంద్ర జల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి తన నిర్ణయాన్ని తెలియజేసింది. దీంతో.. ఈ నెల 18వ తేదీన మంచిరోజు కావడంతో వాల్ పనులు ప్రారంభించాలని ప్రాజెక్టు అధికారులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి.. వారి ఆమోదం పొందిన వెంటనే పనులు ప్రారంభించాలని జల వనరుల శాఖ, ప్రాజెక్టు ఇంజనీరింగ్ సిబ్బంది నిర్ణయించారు. ఇప్పటికే యంత్రాలు, నిపుణులను కూర్చుకున్న బావర్ సంస్థ కూడా ఇందుకు సంసిద్ధంగా ఉంది. పైగా 2016లో అప్పటి డయాఫ్రం వాల్ నిర్మాణంలో ఎల్ అండ్ టీ సంస్థతో కలసి బావరే టీ-5 మిశ్రమాన్ని రూపొందించి ఉపయోగించింది. ఇప్పుడూ ఇదే వాడాలని జల సంఘం ఆదేశించడంతో తమ పని మరింత సులువవుతుందని ఆ సంస్థ చెబుతోంది. వాస్తవానికి కాంక్రీట్ మిశ్రమంపై అమెరికా, కెనడా నిపుణులకు అవగాహన లేదని పీపీఏ, జల వనరుల శాఖ తొలుతే చెప్పాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. కానీ గతంలో జలసంఘం బాధ్యతలు చేపట్టిన ఏబీ పాండ్యా మాత్రం ఆ నిపుణుల మాటకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. వారు టీ-16 మిశ్రమాన్ని వాడాలని సూచించారు. అయితే అది పెలుసుగా ఉంటుందని.. అది వాడితే మున్ముందు ఇబ్బందులు తలెత్తుతాయని సీఎస్ఎంఆర్ఎస్ సహా కేంద్ర పరిశోధనా సంస్థలు స్పష్టం చేశాయి. టీ-5 మిశ్రమం మేలని సీఎస్ఎంఆర్ఎస్ పేర్కొనడంతో జల సంఘం చివరకు దానికే మొగ్గుచూపింది. కాగా.. అంతర్జాతీయ నిపుణులు పోలవరంపై ఇప్పటిదాకా ఇచ్చిన సలహాలన్నీ వృథాగా మిగిలిపోయాయని నిపుణులు అంటున్నారు. వారి అభిప్రాయం తప్పనిసరని చెబుతూ ఈ నెల 2న ప్రారంభం కావలసిన పనులకు జల సంఘం అనవసరంగా మోకాలడ్డి జాప్యం చేసిందని చెబుతున్నారు. అయితే పనులు ఇప్పుడు రెండు వారాలు ఆలస్యమైనప్పటికీ ఈ ఏడాది చివరిలోగా డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తిచేసి తీరాలని బావర్‌కు జల వనరుల శాఖ లక్ష్యం విధించింది.

## హంద్రీ-నీవా విస్తరణకు పచ్చజెండా

- గండికోట నుంచి సీబీఆర్‌కు అదనపు లిఫ్టుతో జలాల ఎత్తిపోత
- అంచనా వ్యయం రూ.3,240 కోట్లు.. యుద్ధప్రాతిపదికన పనుల పూర్తి
- కార్యాచరణ కోసం చంద్రబాబు ఆదేశం

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి విస్తరణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గురువారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో ఈ ప్రాజెక్టుపై జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో ఆయన సమీక్ష జరిపారు. గండికోట రిజర్వాయరు నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు(సీబీఆర్)కు అదనపు లిఫ్ట్ ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు ప్రస్తుత ధరల ప్రకారం రూ.3,240 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. 17.25 కిలోమీటర్ల మేర గ్రావిటీ కెనాల్, 15.835 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాల్సి ఉంటుంది. ఈ పనులకు టెండర్లను పిలిచి ప్రారంభిస్తే రెండున్నరేళ్లలో పూర్తవుతాయని జల వనరుల శాఖ వర్గాలు వెల్లడించాయి. విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. భూసేకరణకు తావులేకుండా ప్రస్తుతం ఉన్న కాలువల వెడల్పు, పొడవు పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రూ.2,657 కోట్లతో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి హంద్రీ-నీవాకు రెండో దశ ఎత్తిపోతల పనులను 24 నెలల్లో పూర్తి చేసే పథకంపైనా ఆయన సమీక్షించారు. 28.75 కిలోమీటర్ల పొడవున గ్రావిటీ కెనాల్, 1.25 కిలో మీటర్ల మేర ప్రెషర్ మెయిన్ తవ్వాల్సి వస్తుందని అధికారులు చెప్పారు. ఆరు స్టేజ్‌లలో పంప్ హౌస్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. వాస్తవానికి 2021 ఎస్ఎస్ఆర్ ధర ప్రకారం గండికోట రిజర్వాయరు నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు ఎత్తిపోతల ద్వారా అదనపు జలాలు తరలించేందుకు రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను అప్పట్లో మేఘా ఇంజనీరింగ్‌కు వైసీపీ ప్రభుత్వం అప్పగించింది. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో ఇన్వెస్టిగేషన్ దశలోనే మేఘా ఇంజనీరింగ్ సంస్థ ఈ ఎత్తిపోతల పనులు నిలిపివేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ జలవనరుల శాఖ ఆ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు సిద్ధమైంది.

## 20న ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు

- వీఐపీ బ్రేక్, శ్రీవాణి దర్శనాలు కూడా

తిరుమల, (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీపై టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం సాయంత్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు. 19వ తేదీతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగుస్తున్న క్రమంలో 20వ తేదీకి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజు నేరుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు చేరుకుని శ్రీవారిని దర్శించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 20న ప్రొటోకాల్ మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను, శ్రీవాణి దర్శనాలను కూడా రద్దు చేశారు.

## రాకాసి అలలు మింగేశాయి!

**సముద్ర స్నానానికెళ్లి ముగ్గురు మృతి.. ఒకరు గల్లంతు**

- మృతులంతా బంధువులే.. ప్రకాశం జిల్లా పాకల బీచ్‌లో ఘటన



మృతులు మాధవ, జెస్సికా, యామిని | గల్లంతైన పవన్

సింగరాయకొండ/పొన్నలూరు/కందుకూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం మిగిల్చింది. మూడ్రోజులపాటు కుటుంబసభ్యులు, సమీప బంధువులంతా కలిసి ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకొని, నాల్గవ రోజు సముద్ర స్నానానికి వెళ్లగా అక్కడ వారి ఆనందం ఆవిరైంది. కుటుంబసభ్యులంతా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానం చేస్తున్న సమయంలో భారీగా అలలు రావటంతో నలుగురు గల్లంతయ్యారు. దీంతో స్థానిక మత్స్యకారులు, సముద్రస్నానాలకు వెళ్లిన ఇతర ప్రాంతాల యువకులు అప్రమత్తమై వారిలో ఒకరిని కాపాడగా, ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో గురువారం జరిగింది. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామపంచాయతీలోని శివన్నపాలేనికి చెందిన 20 మంది బంధువులు సముద్ర స్నానానికి గురువారం ఉదయం పాకల బీచ్‌కు వచ్చారు. వారంతా సముద్రంలో స్నానానికి దిగిన సమయంలో అలల ఉధృతి తీవ్రంగా ఉంది. ఆ తాకిడికి అకస్మాత్తుగా ఐదుగురు కొట్టుకుపోయారు. దీంతో మిగిలిన వారు కేకలు వేయడంతో మెరైన్ సిబ్బంది అక్కడకు చేరుకుని వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వారిలో నోసిన మాధవ(26), నోసిన జెస్సికా(16), కొల్లగుంటకు చెందిన కొండాబత్తిన యామిని(19) మృతిచెందారు. మాధవ భార్య నవ్యను మెరైన్ సిబ్బంది కాపాడారు. ఊహించని ప్రమాదంతో పాకల బీచ్‌లో విషాదం నెలకొంది. మృతుల బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగింది. కాగా.. ఇదే బీచ్‌లో స్నానానికి దిగిన సింగరాయకొండకు చెందిన తమ్మిశెట్టి పవన్ కుమార్ (22) కూడా అలల తాకిడికి గల్లంతయ్యాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలించాలని సిబ్బందిని ఆదేశించారు. సమాచారం అందుకున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పాకల బీచ్‌కు చేరుకుని గాలింపు చర్యలను సమీక్షించారు. కందుకూరు ఏరియా ఆసుపత్రిలో మంత్రి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


**రేషన్ బియ్యం మాయం కేసులో..**

## పేర్ని గోదాం మేనేజర్ సహా ముగ్గురికి బెయిల్

- మంజూరుచేసిన స్పెషల్ మొబైల్ కోర్టు

మచిలీపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని గోదాం నుంచి రేషన్ బియ్యం మాయమైన కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులకు స్పెషల్ మొబైల్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఏ-2గా ఉన్న గోదాం మేనేజర్ మానస తేజ, ఏ-4గా ఉన్న మిల్లు యజమాని బాల ఆంజనేయులు, ఏ-5 లారీడ్రైవర్ మంగారావును మచిలీపట్నం తాలూకా పోలీసులు గత నెల 30న అరెస్టు చేశారు. అప్పటినుంచి వీరు మచిలీపట్నం స్పెషల్ సబ్‌జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. రెండు విడతలుగా వీరిని కోర్టు అనుమతితో పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. వీరికి కోర్టు రెండు సార్లు బెయిల్ తిరస్కరించింది. వారి బెయిల్ పిటిషన్లు గురువారం మరోసారి విచారణకు రాగా.. న్యాయాధికారి బెయిల్ మంజూరు చేశారు. మరోవైపు... ఈ కేసులో ఏ-1గా గోదాం యజమాని, పేర్ని నాని భార్య పేర్ని జయసుధకు జిల్లా కోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఏ-3గా ఉన్న పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డికి వారం క్రితం బెయిల్ లభించింది. నిందితులను విచారించిన సమయంలో పేర్ని నాని సూచనలతోనే బియ్యం విక్రయించామని వారు చెప్పడంతో ఆయన్ను పోలీసులు ఏ-6గా చేర్చి కేసు నమోదుచేశారు. ఆయన ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేయగా.. ఈ నెల 20వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కాగా.. పేర్ని నాని గోదాం నుంచి మచిలీపట్నంకు చెందిన మాతా వెంకటసుబ్బారావు, పి నాగేశ్వరరావు, గోపిశెట్టి నాంచారయ్య, కందుల బాపూజీ.. 1,600 బస్తాల రేషన్ బియ్యం కొనుగోలు చేసినట్లు తేలడంతో ఈ నెల 12వ తేదీన వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ నలుగురిని తమ కస్టడీకి ఇవ్వాలని తాలూకా పోలీసులు గురువారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## దుర్గమ్మను దర్శించుకున్న డీజీపీ



డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఈవో కె.రామచంద్రమోహన్

విజయవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఈవో ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందచేశారు. సంక్రాంతి సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, తదితర కళాకృతులను ద్వారకా తిరుమలరావు దంపతులు తిలకించారు.

## మహా కుంభమేళాలో శ్రీవారికి స్నపన తిరుమంజనం



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో ప్రయాగ్‌రాజ్‌లోని దశాశ్వమేధ ఘాట్‌వద్ద గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం గంగా నది ఒడ్డున ఈ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించింది. అనంతరం శ్రీచక్రత్తాళ్వార్‌ను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ గంగా నదిలోకి తీసుకువెళ్లి చక్రస్నాన మహోత్సవాన్ని నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ఆశారేఖ...!

తాను గద్దెదిగేలోగానే ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వారం క్రితం ఆశాభావం వెలిబుచ్చినప్పుడు ఎవరూ దానిని పట్టించుకోలేదు. బందీల అప్పగింతలకు సంబంధించి ఇరుపక్షాలూ తీవ్రమైన అడ్డంకులను అధిగమించాయని బైడెన్ అప్పట్లో సూచన ప్రాయంగా అన్నారు. చర్చలు కొలిక్కిరాకుండా హమాస్ అడ్డుపడుతోందని బైడెన్ అనగానే, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఖతార్, ఈజిప్ట్ అధికారులు మాత్రం అందుకు నెతన్యాహూ కారకుడన్నారు. వారం క్రితం బైడెన్ చెప్పింది ఇప్పుడు నిజమైందనీ, అడ్డంకులూ అభ్యంతరాలూ తొలగి ఎట్టకేలకు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని వార్తలు వింటున్నాం. ఈ శుభవార్తతో పాటుగానే, ఇజ్రాయెల్ మంత్రివర్గం ఇంకా సదరు ఒప్పందాన్ని ఆమోదించవలసి ఉందని, నెతన్యాహూ పలు వక్రీలూ కొర్రీలతో మంత్రివర్గ సమావేశాన్ని వాయిదావేస్తూ కొత్తకుట్రలకు తెరదీస్తున్నారన్న అనుమానాలు కూడా జోరుగా ప్రచారమవుతున్నాయి.

ఆదివారంనుంచి ఈ ఒప్పందం అమలులోకి వస్తుందని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అల్‌థానీ సగర్వంగా ప్రకటించిన కొద్ది గంటల్లోనే గాజామీద తీవ్రస్థాయిలో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఒప్పందం అమల్లోకి వచ్చేలోగా మరిన్ని ఊచకోతలు, కూల్చివేతలతో నెతన్యాహూ కక్షతీర్చుకుంటున్నారు. పదిహేను నెలల్లో యాభైవేలమందిని హతమార్చి, గాజాను శ్మశానంగా తయారుచేసినా ఆయనకు ఇంకా తృప్తికలగలేదు. అనుకున్నట్టుగా ఆదివారంనుంచి ఒప్పందం అమల్లోకి వచ్చినపక్షంలో ఈ ఊచకోతలకు తాత్కాలికంగానైనా విరామం దక్కుతుంది. ప్రతి దశ ఆరువారాలచొప్పున మూడుదశల్లో అమలయ్యే ఈ ఒప్పందానికి గత ఏడాది మేనెలలో తాను చేసిన ప్రతిపాదనలే ప్రాతిపదికలని బైడెన్ అంటున్నారు. తొలి ఆరువారాలు ఇది గనుక సవ్యంగా అమలు జరిగితే, ఇజ్రాయెల్ బలగాలు గాజాను కనీసం కొంతమేరకు ఖాళీచేయడం, బందీల అప్పగింత గాడినపడటం మొదలవుతుంది. ప్రతీ ఏడురోజులకూ ఏ పక్షం ఎంతమందిని ఇచ్చిపుచ్చుకోవాలన్నది ఈ ఒప్పందంలో నిర్దిష్టంగా ఉంది. ఒప్పదం అమలులోకి రాగానే సహాయకచర్యలు ఊపందుకుంటాయి, నీరు, ఆహారం, విద్యుత్ ఇతరత్రా అవసరాలు తీరడానికి ప్రత్యేక ప్రయత్నాలు జరుగుతాయి.

గత ఏడాదికాలంలో హమాస్ పలుమార్లు కాల్పుల విరమణకు దిగిరావడం, దానికి పూర్తి భిన్నంగా నియమనిబంధనల విషయంలో ఇజ్రాయెల్ ఏవో అడ్డంకులు పెడుతూండటం తెలిసిందే. బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను విడిపించుకోవడంకంటే హమాస్‌ను దుంపనాశనం చేయడమే తన ప్రథమకర్తవ్యమని ప్రకటించి, యుద్ధాన్ని నెతన్యాహూ ఏడాదిన్నరపాటు కొనసాగించడంతో ఈ సంస్థ పూర్తిగా దెబ్బతినిపోయింది. సర్వశక్తిసంపన్నులనుకున్న దాని నాయకులంతా ఒక్కరొక్కరుగా రాలిపోయి, దాని సమస్తవ్యవస్థలూ కూలిపోయాయి. అప్పట్లో హమాస్ అపహరించుకుపోయినవారిలో ఓ అరవైమంది మాత్రమే ఇంకా దానివద్ద మిగిలి ఉన్నారని, వీరికి బదులుగా వందలాదిమంది పాలస్తీనియన్ ఖైదీలు విడుదలకాబోతున్నారని వార్తలు వెలువడుతున్నాయి. మొదటి ఆరువారాల అనంతరం కూడా కాల్పుల విరమణ కచ్చితంగా కొనసాగించాలన్న లిఖితపూర్వకమైన అవగాహన ఏదీ ఈ ఒప్పందంలో ఇప్పటికైతే లేదట. ఒప్పందం అమలులోకి వచ్చిన పదహారోరోజున తిరిగి చర్చలకు కూచొని, సమీక్షలతో మలిదశకు పురోగమించాల్సి ఉంటుంది. గత ఏడాది నవంబరులో స్వల్పకాలిక విరామం ఇస్తున్నట్టే ఇచ్చి, నెతన్యాహూ తిరిగి దాడులకు దిగిన విషయం తెలిసిందే. ఒప్పందాన్ని వమ్ముచేసేందుకు ఆయన దగ్గర సవాలక్ష కారణాలు సిద్ధంగా ఉంటాయి. కాల్పుల విరమణ అన్న మాటకే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆదినుంచీ బద్ధవ్యతిరేకి. యుద్ధం పూర్తిగా నిలిచిపోయిన పక్షంలో తాను గద్దెదిగాల్సివస్తుందని, తన కూటమి ప్రభుత్వం అధికారంనుంచి తప్పుకొని ఎన్నికలకు పోవాల్సి ఉంటుందని ఆయన తెలుసు.

ప్రస్తుతానికి యుద్ధం ముగిసిపోలేదు కానీ, తొలి ఆరువారాలూ ఈ ఒప్పందం సవ్యంగా అమలైనపక్షంలో అందుకు అవకాశమైతే ఏర్పడుతుంది. ఈ ఒప్పందాన్ని కుదిర్చింది బైడెన్ కాదు, మరో ఐదు రోజుల్లో అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిరోహించబోతున్న ట్రంప్ హెచ్చరికలతోనే నెతన్యాహూ ఎట్టకేలకు దిగివచ్చాడన్నది నిజమైతే మరీ మంచిది.

# అపురూప కవులకు లోక్‌నాయక్ పురస్కారం

గత 20 సంవత్సరాలుగా ఎన్.టి. రామారావు గారి పుణ్యతిథి రోజున లోక్‌నాయక్ ఫౌండేషన్ (విశాఖపట్నం) రెండు లక్షల రూపాయల నగదు ప్రదానం చేసే సాహిత్య పురస్కారాన్ని ఈ సంవత్సరానికి గాను అందెశ్రీ, ఖాదర్ మొహియుద్దీన్ స్వీకరిస్తారు. మనిషితనానికై పరితపించిన పాట అందెశ్రీది. ముస్లిం అస్తిత్వ వేదనను పలికించిన కవనం ఖాదర్ మొహియుద్దీన్‌ది.

అక్షర జ్ఞానం లేని రత్నాకరుడనే బోయవాడు సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని రచించి వాల్మీకి అయ్యాడని చదువుకున్నాం. మన కాలపు వాల్మీకి అందెశ్రీ. పాండిత్యం పండితుల కుటుంబాల్లో, ప్రతిభ పెట్టుబడిదారుల కుటుంబాల్లో మాత్రమే పుట్టదు అని నిరూపించారు.

అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జూలై 18వ తేదీన వరంగల్ జిల్లా మద్దూర్ మండలం రేబర్తి గ్రామంలో జన్మించారు. పదేళ్ళు కూలీగా, ఇరవై రెండేళ్ళు తాపీ మేస్త్రిగా పనిచేశారు. అక్షర జ్ఞానం లేదు. చదవడం, రాయడం రాదు. "నేను పుట్టిన దేశంలో కులమే ప్రామాణికమైనప్పటికీ నా ఊరిలో నాకు కులమనే మరకే అంటలేదు. నా ఊరిలోని ప్రజలందరూ మానవ కులంగా బ్రతుకుతారు. నా ఊరు నాకు చెక్కుచెదరని నేపథ్యంగా మారింది" అని చెప్పిన అందెశ్రీ, హైదరాబాద్ వచ్చి ఐదేళ్ల పాటు కాలినడకనే నగరంలో తిరిగాడు. భార్య మెడ లోని తాళిబొట్టు కూడా అమ్ముకోవాల్సిన దుర్భర పరిస్థితులు. తినడానికి ఒక్క రూపాయి లేక ఆకలితో ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. అప్పుడే ఆయన లోంచి కవి పుట్టుకొచ్చాడు. జీవించాలి అనే తలంపు ఉంటే అన్నీ నేర్పుతుంది జీవితం. ఇందుకు అందెశ్రీ నిలువెత్తు నిదర్శనం. నిజామాబాద్ లోని శృంగేరి మఠంలో శంకర్ మహారాజ్ అందెశ్రీ అని పేరు పెట్టి, వెన్నుతట్టి ప్రోత్సహించారు. చదువుకుంటేనే భాష వస్తుంది అనేది అపోహనని నిరూపించారు అందెశ్రీ. వినడం ద్వారానే పురాణ, ఇతిహాసాలు, వేద వాఙ్మయ, ఉపనిషత్తుల ధర్మాలు అన్నీ అవగాహన చేసుకున్నారు. భక్తి పాటలు రాశారు. ప్రజా ఉద్యమాలకు బాటలు వేసే గొప్ప గీతాలు రచించారు. "మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు/ నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు/ ఏడ ఉన్నడో కానీ కంటికీ కానరాడు" – అంటూ మనిషితనం కోసం తపించాడు.

"మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు/ నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు/ ఏడ ఉన్నడో కానీ కంటికీ కానరాడు" – అంటూ మనిషితనం కోసం తపించిన కవి అందెశ్రీ, స్వాతంత్ర్యానంతర కాలంలో భారత ముస్లింల అస్తిత్వ వేదనను 'పుట్టుమచ్చ' కవిత రూపేణా శక్తిమంతంగా అభివ్యక్తం చేసిన కవి ఖాదర్ మొహియుద్దీన్ ఈ ఏడాది 'లోక్‌నాయక్ ఫౌండేషన్' వార్షిక సాహిత్య పురస్కారాన్ని స్వీకరించనున్నారు.

'జయజయహే తెలంగాణ' ఇప్పుడు రాష్ట్ర గీతంగా ధ్వనిస్తోంది. ఆయన రచనలు పాఠ్యపుస్తకాల్లో భాగాలయ్యాయి. భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారాన్ని, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్న అందెశ్రీ 'లోక కవి' బిరుదును సొంతం చేసుకున్నారు. ఈ సంవత్సరం 'లోక్‌నాయక్ ఫౌండేషన్' అందెశ్రీని తమ వార్షిక సాహిత్య పురస్కారం రెండు లక్షల రూపాయల నగదుతో సత్కరిస్తున్నది.

స్వాతంత్ర్యానంతర కాలంలో భారత ముస్లింల అస్తిత్వ వేదనను శక్తివంతంగా అభివ్యక్తం చేసిన కవిత ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ'. రామచంద్ర గుహ వంటి చరిత్రకారుడు తన 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' పుస్తకంలో 'పుట్టుమచ్చ' కవిత నుంచి కొన్ని పంక్తులను ఉటంకించారు. ప్రఖ్యాత హిందీ కవి అశోక్ వాజపేయి సంపాదకత్వంలో వెలువడిన 'ఇండియా డిసెంట్స్: 3000 ఇయర్స్ ఆఫ్ డిఫరెన్స్, డౌట్ అండ్ ఆర్గ్యుమెంట్' బృహత్ సంకలనం కోసం తెలుగు నుంచి మూడు కవితలను ఎంపిక చేశారు. అందులో ఒకటి ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' కాగా, మిగతా రెండిటిలో ఒకటి అన్నమయ్యది, రెండవది గద్దర్‌ది!


"నేను పుట్టకముందే దేశద్రోహుల జాబితాలో నమోదైవుంది నా పేరు" అన్న ఖాదర్– 1955 ఆగస్టు 10న కృష్ణాజిల్లాలోని ఒక మారుమూల కుగ్రామంలో జన్మించారు. పుట్టి పెరిగిన దేశంలోనే వలస జీవనాన్ని ఈడ్వాల్సిన కాందిశీకుని యాతన ఖాదర్ మొహియుద్దీన్ కవిత్వంలో వినిపించే వేదన. అమాయకంగా దెబ్బతింటున్న భారత ముస్లింల స్వరానికి ఇచ్చిన కొన్ని లక్షల కోట్ల డెసిబిల్స్ శబ్దం ఖాదర్ మొహియుద్దీన్ కవిత్వం.

నిజానికి పుట్టుమచ్చ దీర్ఘకవిత ఖాదర్ మొహియుద్దీన్ ఇతర కవితలను కనుమరుగయ్యేలా చేసిందని పలువురు విమర్శకులు, కవులు గుర్తించారు. ఉదాహరణకు మొదటి కవిత 'సంధ్య' నుంచి రెండు చరణాలు– "ఎవరో చచ్చిన ఆవును మోసుకుపోతున్నారు/ దాని తోక నేల మీద ఎలిజీ రాస్తోంది.../ వెలుగు చీకట్ల పల్టీలు వేస్తూ/ ఎర్ర లంగోటా చుట్టుకుని/ కాలం వేసిన శీర్షాసనం ఈ సంధ్యా సమయం" – ఇటువంటి అద్భుతమైన వాక్యాలతో పాటు, "చినిగిపోతున్న క్యాలెండర్ చివరి పేజీ వెనుక నా నీడంటే భయం...", "గోడల్ని నిలువునా కూల్చితే తప్ప నీడలు నిజాల్ని విప్పవు/ బహుశా దిక్కులు లేవనెత్తితే ఉషస్సు శవపేటికలా పైకి లేస్తుంది" వంటి మహా వాక్యాలు ఖాదర్ మొహియుద్దీన్ కవిత్వంలో అనేకం. 'ఆజైవిక' శీర్షికతో కరోనా వైరస్‌పై రాసిన కవిత ఇటీవలి సంచలనం. అనువాద రంగంలో ఖాదర్ మొహియుద్దీన్‌ది అందె వేసిన చెయ్యి. టి.ఎస్. ఎలియట్ 'ద వేస్ట్ లేండ్'కు 'చవిటిపత్ర' శీర్షికతో చేసిన అనువాదం ఒక ఉదాహరణ మాత్రమే. 'పుట్టుమచ్చ' ఇంటి పేరుగా మారిపోయిన ఖాదర్ మొహియుద్దీన్‌కు 'లోక్‌నాయక్ ఫౌండేషన్' విశాఖపట్నం రెండు లక్షల రూపాయల నగదుతో తమ వార్షిక సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నది.

లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం రేపు సాయంత్రం 5 గంటలకు డా. బి.ఆర్. అంబేడ్కర్ అసెంబ్లీ హాల్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నంలో జరుగుతుంది. పై పురస్కారాలతో పాటు లక్షరూపాయల జీవన సాఫల్య పురస్కారాన్ని ఇమ్మణ్ణి దీపావెంకట్, డి.ఆర్.కె. ప్రసాద్, పద్మావతి దంపతులు స్వీకరిస్తారు. సభలో ముఖ్య అతిథిగా నల్లు ఇంద్రసేనారెడ్డి, సభాధ్యక్షులుగా గంటా శ్రీనివాసరావు, గౌరవ అతిథిగా నటుడు కన్నెగంటి బ్రహ్మానందం, ఆత్మీయ అతిథులుగా– చలసాని అశ్వనీదత్, వై.వి.యస్. చౌదరి, వల్లేపల్లి శశికాంత్, లావు రాణి రుద్రమదేవి పాల్గొంటారు.

◆ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

# చరిత్రలోకి జారిపోతున్న 'ఇండియా'!





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'ప్రధాని మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఒక మహాకూటమి ఏర్పాటు చేయాలన్న ఆలోచన యుక్తమైనదే, అయితే అదెంత వరకు సుసాధ్యమవుతుందో నేను కచ్చితంగా చెప్పలేను'– జూన్ 2023లో ఇండియా కూటమి సీనియర్ నాయకుడు ఒకరు అన్న మాట అది. ఆ రాజకీయ దురంధరుడు చాలా జాగ్రత్తగా చెప్పిన ఆ మాటలు ఇప్పుడు దాదాపుగా రుజువయ్యాయి. పద్దెనిమిది నెలల క్రితం రోహిణీ కార్తె రోజుల్లో పాట్నాలో విభిన్న రాజకీయ స్వభావాలతో వ్యవహరించే వివిధ రాజకీయ పక్షాలు అసంభవమనుకున్న బీజేపీ వ్యతిరేక రాజకీయ కూటమి నేర్పాటు చేశాయి. సార్వత్రక ఎన్నికల అనంతరం ఆ కూటమి చీలిపోవడం ప్రాంభమయింది. ఆ చీలిక ప్రక్రియ ఇప్పుడు దాదాపుగా పూర్తయిందని చెప్పవచ్చు. ఇండియా కూటమి దాదాపుగా అస్తమించింది. దానికి అంత్యక్రియలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన పిమ్మట తప్పక జరుగుతాయి.

గత సార్వత్రక ఎన్నికలలో మోదీ నేతృత్వంలో బీజేపీ 400 లోక్‌సభ సీట్లను సాధించాలని మోదీ నేతృత్వంలోని బీజేపీ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అడ్డుకునేందుకు ప్రభవించిన ఇండియా కూటమి లక్ష్య పరిపూర్తి అనంతరం ఎంతో కాలం సమైక్యంగా ఉండలేక పోయింది. తగ్గిన మెజారిటీతో నరేంద్ర మోదీ మళ్లీ ప్రధానమంత్రి అయ్యారు. ఆ తరువాత జాతీయ ప్రాథమ్యాల కంటే రాష్ట్ర స్థాయి రాజకీయ అవసరాలు, ఒత్తిళ్లే ఇండియా కూటమి రాజకీయాలను ప్రభావితం చేయడం ప్రారంభమయింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ, వామపక్షాలు సమైక్యంగా పనిచేసేందుకు ఆమోదయోగ్యమైన ప్రాతిపదిక ఏమైనా ఉన్నదా? పోనీ, అటువంటి ప్రాతిపదికను కనుగొనేందుకు మమత, వామక్షాలు ప్రయత్నించగలవని ఎవరూ భావించలేరు. బిహార్‌లో శత్రువులుగా మారిన స్నేహితులు, తిరిగి స్నేహపూరిత శత్రువులుగా మారిన నితీశ్ కుమార్, లాలూప్రసాద్ యాదవ్‌ల మధ్య ఎప్పుడైనా పరస్పర విశ్వాసమున్నదా? కశ్మీర్ లోయలో ఆధిపత్యానికి తీవ్రంగా పోటీపడే ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తి ఇంకా ఎంతకాలం ఒకే కూటమి(ఇండియా)లో ఉండగలుగుతారు? మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్) తన మిలిటెంట్ హిందుత్వ గతాన్ని తన ఇప్పటి అస్పష్ట వర్తమానంతో ఇంకెంత కాలం సామరస్యంగా ఉంచగలుగుతుంది? జాతీయ ఎన్నికలలో నరేంద్ర మోదీ, బీజేపీ ఉమ్మడి శత్రువులే అయినప్పటికీ రాష్ట్ర స్థాయిలో సమీకరణాలు తప్పక మారతాయి. మారాయి కూడా.

ఢిల్లీలోనే ఈ వాస్తవం తేటతెల్లంగా కనిపిస్తోంది. ఎనిమిది నెలల క్రితం దేశ రాజధానిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలుగా కలిసికట్టుగా పోరాడాయి. అదే సమయంలో పంజాబ్‌లో ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచాయి. ఒకే కూటమిలో ఉన్నా ఇరు పార్టీల మధ్య సఖ్యత లోపించింది. రాజకీయ అంకగణితం నుంచి లబ్ధి పొందడానికి ఎంతగా ప్రయత్నించినా కాంగ్రెస్, ఆప్‌ల మధ్య దృఢ అనుబంధం లేనేలేదు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ శిథిలాల నుంచే రాజకీయ అంకుర పక్షమైన ఆప్ ప్రభవించిందనే సత్యం విస్మరించరానిది 2011లో అవినీతికి వ్యతిరేకంగా అరవింద్ కేజ్రీవాల్ నిర్వహించిన ఉద్యమమే మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని బలహీనపరిచింది. ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించింది. ఈ పరిస్థితిని 2014 సార్వత్రక ఎన్నికలలో తన ప్రయోజనాలకు బీజేపీ పూర్తిగా వినియోగించుకున్నది. ఢిల్లీకి వరుసగా 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్‌ను మట్టి కరిపించారు. అయితే అంతిమంగా కాంగ్రెస్ బయట నుంచి ఇచ్చిన మద్దతుతో ఢిల్లీలో ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ ఏర్పాటు చేశారు. దేశ పురాతన రాజకీయ పక్షానికి కొత్తగా రాజకీయాలలోకి వచ్చిన కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌కు మద్దతునివ్వడం తప్పనిసరి అయింది. దరిమిలా దేశ రాజధానిలో కాంగ్రెస్ వైభవం క్షీణించిపోయింది. ఒక దశాబ్ద కాలంగా ఢిల్లీ నుంచి లోక్‌సభకు గెలిచిన కాంగ్రెస్ నేత ఎవరూ లేరు.

కనుకనే ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయడం ద్వారా తన మనుగడను కాపాడుకునేందుకు, తన సత్తాను నిరూపించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. గత సార్వత్రక ఎన్నికలలో వలే కలిసికట్టుగా పోటీ చేసేందుకు అటు ఆప్ గానీ, ఇటు కాంగ్రెస్ గానీ ప్రయత్నించనే లేదు. పైగా ఇరు పార్టీలు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నాయి. వాటి మధ్య మాటల యుద్ధం అదుపు తప్పుతోంది. ఈ పరిస్థితి బీజేపీకి తన గెలుపుపై భరోసానిస్తోంది. గత ఏడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఆప్‌తో పొత్తు పెట్టుకునేందుకు రాహుల్ గాంధీ అంగీకరించారు. అయితే తమ విజయంపై మితిమీరిన విశ్వాసంతో హర్యానా పీసీసీ నాయకులు ఆప్‌తో పొత్తుకు అంగీకరించలేదు. పొత్తు ప్రయత్నాలను విఫలం చేసేందుకు చేయవలసినదంతా చేశారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయవలసిన అగత్యంలోకి పడిపోయింది. ఇప్పుడు కేజ్రీవాల్ కాంగ్రెస్‌తో పొత్తుకు ససేమిరా అన్నారు. అంతేకాకుండా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను గెంటివేయాలని కూడా ఘోషించారు!

ఇండియా కూటమి ఆవిర్భావం నుంచి దాని ప్రస్థానాన్ని సింహావలోకనం చేస్తే నాయకుల అహమికలు, ఆకాంక్షలు ఎంత పరస్పర విరుద్ధంగా ఉన్నాయో ఆశ్చర్యం గొలుపుతుంది. ఆ మాటకొస్తే ఆ నాయకులు అసలు ఆ మహా కూటమి నిర్మాణానికి ఎలా పూనుకున్నారా అని అంతులేని విస్మయమూ కలుగుతుంది. మోదీ వ్యతిరేక ప్రతిపక్ష కూటమిని తొట్ట తొలుత ప్రతిపాదించిన నితీశ్ కుమార్ 'ఇండియా' నుంచి వైదొలిగిన మొట్టమొదటి నేత కావడం గమనార్హం. ఇండియా కూటమికి కన్వీనర్‌గా ఉండాలన్నది ఆయన ప్రగాఢ ఆకాంక్ష. అయితే ఇతర భాగస్వామ్య పక్షాలు అందుకు ససేమిరా అనడంతో నితీశ్ ముందుగానే ఇండియా కూటమి నుంచి నిష్క్రమించి తన కొక భద్ర బాటను ఎంచుకున్నారు. బెంగాల్‌లో వామపక్షాలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడాన్ని మమతా బెనర్జీ క్షమించరుగాక క్షమించరు. పైగా అన్ని విధాల తనకు జూనియర్ అయిన రాహుల్ గాంధీ కంటే తాను తక్కువ స్థానంలో ఉండవలసిరావడాన్ని ఆమె అంగీకరించలేక పోయారు. కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ఆమె ప్రశ్నించారు, వ్యతిరేకించారు. ఇక కాంగ్రెస్ నాయకత్వంలో ఒక బలమైన వర్గం లోక్‌సభలో తమకు 99 స్థానాలు దక్కడాన్ని ఒక మహా విజయంగా పరిగణించింది. తమ పార్టీ పునరుజ్జీవితమవుతున్నదని విశ్వసించింది. క్షేత్ర స్థాయి వాస్తవాలను విస్మరించింది. ప్రజల మద్దతు ఇక పూర్తిగా ఉంటుందని భ్రమ పడింది. అధికార కైవసానికి తాము చేరువవుతున్నామని నమ్మింది. కూటమిని పటిష్ఠం చేయగల బాధ్యతను సమర్థంగా నిర్వర్తించగల నేత శరద్ పవార్. ఇప్పుడు అష్టపదులు పైబడిన వయసులో ఉన్న వృద్ధ నేత. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఆయన పార్టీ అనూహ్య పరాజయం పాలయింది. ఖిన్నుడైన పవార్ నిస్సహాయుడుగా మిగిలిపోయారు. ఈ పరాజయ అవమానంతో ఇండియా కూటమి అంతర్గత కలహాలను తీర్చ గల సంకల్పం, సామర్థ్యం ఆయనలో లేకుండా పోయాయి.

అయితే ఇండియా కూటమి పతనంలో దాని నాయకులకు మాత్రమే పరిమితం కాని ఒక పాఠం ఉన్నది. గత దశాబ్దంలో మోదీ ఉత్థానం ఒక రాజకీయ భూతాన్ని సృష్టించింది: ఏక పార్టీ, ఏక నాయకుడు ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నిరంకుశ పాలన' వైపు దేశం నెట్టబడుతుందనే భీతి సర్వత్రా వ్యాపించింది. ఈ కారణంగానే తాము పూర్తిగా ప్రాధాన్యం కోల్పోతామనే భయమే ప్రతిపక్షాలను ఏకం చేసింది. అయితే మోదీ, మోదిత్వ పట్ల తీవ్ర వ్యతిరేకత మినహా ఆ ఏకీకరణకు మరెలాంటి ఉమ్మడి ప్రాతిపదిక లేదు. 1970ల్లో ఇందిరాగాంధీని ఎట్టి పరిస్థితులలోను అధికారం నుంచి దించివేయాలనే ప్రతిపక్షాల కోరిక నుంచి జనతా పార్టీ ఆవిర్భవించినట్టుగా ఇప్పుడు మోదీ పట్ల తీవ్ర వ్యతిరేకతే ఇండియా కూటమి ప్రభవించడానికి దారితీసింది. అయితే సైద్ధాంతిక ప్రాతిపదికలు లోపించిన ప్రతిపక్ష రాజకీయాలు స్వల్పకాలిక లక్ష్యాలపై ఆధారపడి మనుగడ సాగించలేవు. కనుకనే జనతా పార్టీ కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉండగా, ఇండియా కూటమి అధికారాన్ని కైవసం చేసుకోలేక పోగా అంతకంటే తక్కువ వ్యవధిలోనే చీలి పోవడం ప్రారంభమయింది. జనతా పార్టీకి కనీసం మహోన్నతుడైన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కొంత కాలం మార్గదర్శిగా ఉన్నారు; ఇండియా కూటమికి అటువంటి వివేకశీలి అయిన నాయకుడు లేకపోవడమే కాకుండా దాని ప్రస్థానాన్ని తీర్చి దిద్దగల ఒక కనీస ఉమ్మడి కార్యక్రమం కూడా లేకపోయింది.

ఇండియా కూటమి పతనం, 2024 ఆరంభంలో బీజేపీ ఎంత బలీయశక్తిగా ఉన్నదో మళ్లీ అంత బలమైనశక్తిగా పునరావిర్భవించడాన్ని సూచిస్తుంది. గత సార్వత్రక ఎన్నికలకు ముందు తనకు అడ్డుగా ఉన్న ఏ ప్రతిపక్షాన్ని అయినా కూల్చివేయగల శక్తి సామర్థ్యాలు మోదీ పార్టీకి పుష్కలంగా ఉన్నాయన్న వాస్తవం విస్మరించరానిది. మోదీ ప్రభుత్వం తనను వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాలను ఆత్మరక్షణలో పడవేసేందుకు రాజ్యాంగ సంస్థలు, వ్యవస్థలను నిస్సంకోచంగా ఉపయోగించుకుంటున్న తరుణంలో ప్రతిపక్షాలు వేటికవి వేరుపడిపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిగల పౌరులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వం దాని రాజకీయ ప్రత్యర్థులు పార్లమెంటు లోపల, బయట సమస్థాయిలో పోటీ పడే రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయనే ఆశాభావాన్ని 2024 సార్వత్రక ఎన్నికల ఫలితాలు కలిగించాయి. అంతర్గత విభేదాలతో ఇండియా కూటమి శీఘ్రగతిన కూలిపోవడం మరింత గందరగోళ, నిరాశా జనక రాజకీయాలు మళ్లీ నెలకొనవచ్చని సూచిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో మోదీ ప్రభుత్వం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వారినందరినీ నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు వెనుకాడదు. భారత్‌కు ఇప్పుడు అవసరమయింది ప్రతిపక్షాలు లేని రాజకీయాలు ఎంత మాత్రం కాదు కదా.

> ఎన్డీఏ, దాని రాజకీయ ప్రత్యర్థులు పార్లమెంటు లోపల, బయట సమస్థాయిలో పోటీ పడే రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయనే ఆశాభావాన్ని 2024 సార్వత్రక ఎన్నికల ఫలితాలు కలిగించాయి. అంతర్గత విభేదాలతో ఇండియా కూటమి శీఘ్ర పతనం మరింత గందరగోళ, నిరాశా జనక రాజకీయాలు మళ్లీ నెలకొనవచ్చని సూచిస్తోంది. అదే జరిగితే మోదీ సర్కార్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వారినందరినీ నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు వెనుకాడదు. భారత్‌కు ఇప్పుడు అవసరమయింది ప్రతిపక్షాలు లేని రాజకీయాలు ఎంత మాత్రం కాదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

# మనిషిని యంత్రుడుగా మారుస్తారా?

జనవరి తొమ్మిదిన రెండు వార్తలు ఉద్యోగ, శ్రామిక రంగాల్లో పెద్ద దుమారాన్ని రేపాయి. మొదటిది, కృత్రిమ మేధ (ఏఐ) తదితర ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వల్ల దాదాపు 93 మిలియన్ల మంది ఉద్యోగులు సామూహిక స్థానభ్రంశానికి గురి కాబోతున్నారనేది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్లుఇఎఫ్) 'ఉద్యోగుల భవిష్యత్తు' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ హెచ్చరికను చేసింది. రెండోది, లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) చైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ 90 గంటల పని వారాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు అనేది.

సుబ్రమణ్యన్ ఒక ఆంతరంగిక సమావేశంలో యథాలాపంగా అన్న మాటల్ని పట్టించుకోవాల్సిన పనిలేదని ఆ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. సుబ్రమణ్యన్ మాట్లాడింది ఒక విధానానికి సంబంధించిన అంశం కనుక ఎక్కడ అన్నారూ అనేదానికన్నా ఏమన్నారూ అనేదే ప్రధానం. సుబ్రమణ్యన్ ప్రతిపాదన ప్రకారం వారానికి ఏడు పనిదినాలయితే రోజుకు 13 గంటలు పనిచేయాలి. ఆరు పనిదినాలయితే రోజుకు 15 గంటలు పనిచేయాలి. ఐదు పనిదినాలయితే రోజుకు 18 గంటలు పనిచేయాలి. గతంలో ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి కూడ 70 గంటల పనివారాన్ని ప్రతిపాదించారు. వారి ఉద్దేశ్యం కూడా సిబ్బందితో రోజుకు 14 గంటలు పని చేయించాలనే.

కార్మిక సంఘాలు, సామ్యవాదులు మాత్రమే గాక మానవతావాదులు, సామాన్యులు సహితం ఇలాంటి ప్రతిపాదనల్ని సహజంగానే తీవ్రంగా వ్యతిరేకిస్తారు. నిజానికి ఈ రెండు వార్తలూ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మొదటిది– ఉన్న ఉద్యోగాలే ఊడిపోతాయి అంటుంటే, రెండోది, శ్రామికులు మరిన్ని అదనపు గంటలు పనిచేయాలంటున్నది.

ప్రత్యర్థుల నోరు మూయించడానికి మన ఏలినవారు ఇటీవలి కాలంలో దేశభక్తిని తిరుగులేని ఆయుధంగా వాడుతున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీలు విడుదల చేసే కాలుష్యానికి వ్యతిరేకంగా స్థానికులు ఆందోళన చేస్తుంటే, వాళ్ళ నోళ్ల మూయించడానికి కూడా దేశభక్తిని ముందుకు తెస్తున్నారు. శిలాజ ఇంధనమైన ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని చెల్లించి దేశం అప్పుల పాలవుతున్నదనీ, ఇథనాల్ వంటి జీవ ఇంధనాలను ఇక్కడే తయారు చేస్తే దేశం మీద రుణభారం తగ్గుతుందనీ ఆ వాదన సారాంశం. పని గంటల విషయం లోనూ ఇదే వాదన. మన దేశం చైనాను అధిగమించాలంటే భారత ఉద్యోగులు, శ్రామికులు అధికంగా శ్రమించాలంటున్నారు. భారతదేశ భవిష్యత్తు ఇప్పుడు శ్రామికుల చేతుల్లోనే ఉంది అనే మాటలూ వినిపిస్తున్నాయి.

భూమి, ఆకాశం, సముద్రాలు, అడవులు, కొండలు, గనుల తోపాటు దేశ శ్రామికుల్ని కూడా ప్రభుత్వం మెగా కార్పొరేట్లకు అప్పచెపుతోంది. శ్రామికులు మారు మాట్లాడకుండా దేశభక్తి పారవశ్యంతో రోజుకు 24 గంటలు పని చేస్తే భారతదేశం చైనాను ఏమిటీ, ఏకంగా అమెరికాను సహితం అధిగమిస్తుంది అనేది ఏలినవారు చెప్పదలచుకున్న సిద్ధాంతం.

> కృత్రిమ మేధ (ఏఐ) వచ్చాక లెక్క ప్రకారం మనిషికి పనిభారం తగ్గాలి. విడ్డూరం కాకపోతే ఈ పని గంటలు పెంచడం ఏమిటీ? కృత్రిమ మేధను ఒక బూచిగా చూపించి ఉద్యోగ, శ్రామిక వర్గాలను మరింతగా లొంగదీసుకోవడానికి మెగా కార్పొరేట్లు కుట్రలు పన్నుతున్నాయా?

16వ శతాబ్దంలో ఆధునిక యంత్రాల మీద ఉత్పత్తి విధానం మొదలయినప్పుడే మనిషి ఒక రోజులో ఎంత సమయం శ్రమించాలి అనే చర్చ కూడా మొదలయింది. ఇందులో తాత్విక, ధార్మిక, సాంస్కృతిక దృక్పథాలు ఉన్నాయి. శ్రమించడం దైవారాధనకు మరో రూపం, సాతాను ప్రభావంలో ఉన్నవాళ్ళు శ్రమించరు – వంటి భావనని జాన్ కాల్విన్ వంటివాళ్ళు ముందుకు తెచ్చారు. అంతకుముందే సెయింట్ బెనెడిక్ట్ రులే వంటివారు ప్రార్థన, శ్రమ, విశ్రాంతుల మధ్య సమయ విభజన చేయడానికి ప్రయత్నించారు. 18వ శతాబ్దపు బెంజామిన్ ఫ్రాంక్లిన్ Early to bed and early to rise అంటూ మనందరికీ బాగా తెలిసిన నీతిని చెపుతూ త్వరగా పడుకొని త్వరగా లేచే మనిషిని ఆరోగ్యం, ధనం, జ్ఞానం వరిస్తాయి అని ఆశపెట్టాడు. ఇస్లాం ప్రబోధించే ఉపవాసాల్లోనూ ఎప్పుడు లేవాలి, ఎప్పుడు పడుకోవాలి అనే అంశాలతో పాటు మనిషి తన జీవితాన్ని, ఆర్థిక సామాజిక కర్తవ్యాలని సూర్యోదయ సూర్యాస్తమయాలతో అనుసంధానం చేయాలనే సూచనలు ఉంటాయి. తరువాత ఆడమ్ స్మిత్, మాక్స్ వేబర్ వంటి అర్థశాస్త్ర, సమాజశాస్త్ర ఆదిపురుషులు వచ్చారు. సమయం అంటే డబ్బు అనే మాట అప్పుడే పుట్టింది. అయితే, వీళ్ళందరూ తమకు తెలిసో తెలియకో పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాదనలు చేశారు.




దానికి విరుద్ధమైన వాదనలు కూడా అప్పట్లోనే వచ్చాయి. మనందరం ఏ తొమ్మిదో తరగతిలోనో న్యూటన్ చలన సూత్రాలను చదివి ఉంటాం. అందులో బాగా గుర్తుండిపోయేది: ప్రతి చర్యకు తత్సమానమైన వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది అనేది. మనం తరచూ అక్కడితో ఆగిపోతాం. ఆ ప్రతిచర్య కూడా ఒక చర్య అయినప్పుడు దానికీ ఒక ప్రతిచర్య ఉంటుందని గుర్తించం. ఇలాంటి చర్య ప్రతిచర్యల నిరంతర కొనసాగింపే గతితర్కం.

ఆహార సేకరణ కాలంలో మనిషి కూడా దాదాపు జంతువుల్లానే జీవించాడు. అయితే, మనిషి పరికరాలు, యంత్రాలను సృష్టించి వాటిని విస్తృతంగా వాడడం మొదలు పెట్టాక సమయ పాలన అతన్ని జంతు ప్రపంచం నుంచి పూర్తిగా విడగొట్టేసింది. ఆహార నిద్రా మైథునాలనే శరీర ధర్మాలు, మతం, వాణిజ్యం వంటి సాంస్కృతిక, సామాజిక ధర్మాలతో పాటు శ్రమకు ఎంత సమయాన్ని కేటాయించాలనే అంశం చర్చకు వచ్చింది.

రోజుకు 24 గంటలు అనుకుంటే దాన్ని మూడు భాగాలు చేసి మొదటిదాన్ని శ్రమకు, రెండోదాన్ని సమాజానికీ, మూడోదాన్ని విశ్రాంతికీ కేటాయించాలనే అభిప్రాయం క్రమంగా బలపడింది. ఒక్కోదానికి చెరో ఎనిమిది గంటలు అన్నమాట. 19వ శతాబ్ద ఆరంభ కాలపు సమాజశాస్త్రవేత్త రాబర్ట్ ఒవెన్ ఈ సమాన సమయ విభజనను సిద్ధాంతీకరించాడు అంటారు. ఇందులో సమాజం అనే మాటకు చాలా అర్థాలున్నాయి. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, మిత్రులు, కళా సాహిత్య అభిరుచులు, రాజకీయ ఆసక్తులు, ప్రేమ, ద్వేషాలు వగైరాలన్నీ ఇందులో ఉంటాయి. అవన్నీ ఉన్నప్పుడే మనిషి సంఘజీవి అవుతాడు.

ఎనిమిది గంటల పని దినాన్ని ఫ్యాక్టరీ యజమానులు ఆమోదించలేదు. ఇప్పటి సుబ్రహ్మణ్యన్, నారాయణ మూర్తిల్లా 16 గంటల పనిదినం అమలు కావల్సిందేనని పట్టుబట్టారు. 1886లో అమెరికా అంతటా ఎనిమిది గంటల పనిదినం డిమాండు చాలా బలంగా ముందుకు వచ్చింది. ఆ ఏడాది మే ఒకటిన ఆల్బర్ట్ పార్సన్స్, ఆగస్టు స్పయిస్ తదితరుల నాయకత్వంలో చికాగో నగరంలో జరిగిన ఉద్యమాన్ని రక్తపాతంతో ముంచెత్తారు. అయినప్పటికీ అది విజయం సాధించింది. ఇప్పుడు ఆ విజయాన్ని బలహీనపరిచి 18 గంటల పనిదినాన్ని పునరుద్ధరించాలన్న వాదనలు మొదలయ్యాయి.

చైనాతో మనం ఏ విధంగానూ పోల్చుకోలేము. పని స్థలానికి సమీపంలోనే అక్కడి ప్రభుత్వం కార్మికులకు నివాసాన్ని ఏర్పాటు చేస్తుంది. దానివల్ల మూడు లాభాలుంటాయి. ప్రయాణ సమయం, వాహనాల ఇంధన ఖర్చు, దేశంలో కాలుష్యం మూడూ తగ్గుతాయి. భారతదేశంలో అలాంటి ఏర్పాటు లేదు.

ఉదాహరణకు హైదరాబాద్‌లో పనిచేయడానికి కొందరు ఇప్పటికీ ప్రతిరోజూ వరంగల్, భూదాన్ పోచంపల్లి నుంచి వస్తుంటారు. కార్యాలయంలో ఎనిమిది గంటల పనిదినం ఎలాగూ తప్పదు. అది మారదు. ప్రయాణ సమయం సులువుగా 6–7 గంటలు ఉంటుంది. దీని కోసం వాళ్ళు సామాజిక జీవితాన్నయినా కోల్పోవాలి, లేదా విశ్రాంతి సమయాన్ని అయినా కోల్పోవాలి. వెరసి మనిషి ఒక యంత్రంగా మారిపోవాలి. ఇవి ఆ శ్రామికుల జీవితాల్లో అనేక కొత్త సంక్షోభాలను సృష్టిస్తాయి. మనిషిని యంత్రుడుగా మార్చే కపటం కొనసాగుతుంది.

సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర రావు 1947లో రాసిన 'మాభూమి' నాటకంలో, నెలల పసిబిడ్డ అయిన తన కొడుకు నిద్రలేవడానికి ముందే ఓ వెట్టి కూలీ పనికి పోతుంటాడు. రాత్రి ఆ పిల్లవాడు నిద్రపోయాక ఇంటికి చేరుతుంటాడు. మెలకువగా ఉండగా తన కొడుకును చూడలేదని నెలల తరబడి వాపోతాడతడు. వర్తమాన ఉద్యోగ సమూహాలు అంతకన్నా దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు దీనికి మినహాయింపు కావచ్చు.

కృత్రిమ మేధ (ఏఐ) వచ్చాక లెక్క ప్రకారం మనిషికి పని భారం తగ్గాలి. విడ్డూరం కాకపోతే ఈ పని గంటలు పెంచడం ఏమిటీ? కృత్రిమ మేధను ఒక బూచిగా చూపించి ఉద్యోగ, శ్రామిక వర్గాలను మరింతగా లొంగదీసుకోవడానికి మెగా కార్పొరేట్లు కుట్రలు పన్నుతున్నారా? అనే సందేహం ఎవరికయినా రావాలి.

● డానీ
సమాజ విశ్లేషకులు





తిరుగు ప్రయాణం.. తంటాలు : పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సులో సీటు కోసం పాట్లు





పీఎన్‌బీఎస్‌లో..



రైల్వేస్టేషన్‌లో రద్దీ



## కటకటా.. కిటకిట..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరుగు ప్రయాణాలతో పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్ గురువారం కిటకిటలాడాయి. బస్సులు, రైళ్ల కోసం పెద్దసంఖ్యలో ప్రయాణికులు ఎగబడ్డారు. పీఎన్‌బీఎస్ నుంచి హైదరాబాద్ సెక్టార్‌లోనే సాయంత్రం వరకు 80 ప్రత్యేక బస్సులను నడిపారు. రాత్రికి అదనంగా నడపాల్సి వచ్చింది. రిజర్వేషన్ లేకుండా అప్పటికప్పుడు మరో 25 బస్సులను దూరప్రాంతాలకు నడిపారు. బెంగళూరుకు 4, చెన్నైకు 3 స్పెషల్స్ నడిచాయి. రైల్వేస్టేషన్‌లో కూడా రద్దీ పెరిగింది. స్పెషల్ రైళ్లలో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించారు.

# సరికొత్తగా..

## కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవనాలు

- 19న అమిత్‌షా చేతులమీదుగా ప్రారంభం
- ప్రకృతి విపత్తుల నిర్వహణకు ఎంతో కీలకం
- గతంలో టీడీపీ హయాంలోనే శంకుస్థాపన
- వైసీపీ హయాంలో అడ్డుకునేందుకు కుట్ర
- రోడ్డు బాగు చేయకుండా ఐదేళ్లపాటు ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వం రాకతో పూర్తయిన పనులు

### సీఎం చంద్రబాబు ఆకాంక్ష.. వెంకయ్యనాయుడి సహకారంతో పూర్తి







కొండపావులూరులో అందంగా సిద్ధమైన ఎన్డీఆర్ఎఫ్ బ్లాక్ (ఇన్‌సెట్‌లో) ఎన్డీఆర్ఎఫ్ క్వార్టర్లు, ఎన్ఐడీఎం క్యాంపస్ →

ఆశల ఉషోదయం వైపు అడుగులు పడుతున్నాయి. ఎన్నేళ్ల నుంచి కన్న కలలో ఒక్కొక్కటిగా వాస్తవంలోకి వస్తున్నాయి. కొండపావులూరులో ఏర్పాటుచేసిన కేంద్ర సంస్థలు ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవనాలు ఈనెల 19న ప్రారంభంకానున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షల మేరకు, అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో మంజూరైన ఈ భవనాలు వైసీపీ హయాంలో చతికిలపడ్డాయి. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో పనులు పూర్తిచేసుకుని 19న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతులమీదుగా ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొండపావులూరు సమీపంలోని సూరంపల్లిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులను అందించే 'సీపెట్' సంస్థ ఇప్పటికే కొలువుతీరింది. కాగా, రాష్ట్ర భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే నేషనల్ డిజాస్టర్స్ రెస్క్యూ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం) వంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే ఫోర్స్‌ను ఎన్‌డీఆర్ఎఫ్ అందిస్తుండగా, వాటిని అధ్యయనం చేయటంతో పాటు ధీటుగా ఎదుర్కొనే విధానాలపై శిక్షణ కల్పించటం వంటివి ఎన్ఐడీఎం చేస్తుంది. ఈ రెండు ప్రతిష్ఠాత్మక సంస్థలు కొండపావులూరులో ఏర్పాటయ్యాయి.

### గతంలో టీడీపీ హయాంలో..

దాదాపు 1,000 కిలోమీటర్ల సువిశాల సముద్రతీరం కలిగిన మన రాష్ట్రానికి విపత్తులను ఎదుర్కొనే సంస్థల అవసరం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రెండు సంస్థలకు బీజం పడింది. వాస్తవానికి ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌ను 2012లోనే కేంద్రం మంజూరు చేసింది. అప్పట్లో తగిన స్థలం చూపించకపోవటం వల్ల క్యాంపస్ ఏర్పాటు చేయలేదు. దీంతో నాగార్జున యూనివర్సిటీలో తాత్కాలికంగా దీనిని నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వ హయాంలో భూములు ఇవ్వటానికి ముందుకొచ్చారు. కొండపావులూరును ఎంపిక చేసి 50 ఎకరాలు కేటాయించారు. 2017లో అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా ఎన్డీఆర్ఎఫ్ భవన సముదాయానికి శంకుస్థాపన జరిగింది. అలాగే, ఎన్ఐడీఎంకు అప్పటి టీడీపీ ప్రభుత్వం 10 ఎకరాలను కేటాయించింది. ఎన్డీఆర్ఎఫ్‌కు శంకుస్థాపన చేసిన సరిగ్గా ఏడాదికి అంటే.. 2018లో ఎన్ఐడీఎం భవనానికి వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేశారు. విపత్తు నిర్వహణలకు సంబంధించిన శిక్షణే ఇక్కడ ప్రధానమైనప్పటికీ పరిశోధనలు కూడా జరుగుతుంటాయి. దేశ రాజధాని ఢిల్లీ తర్వాత రెండోస్థానంలో కొండపావులూరులోని ఎన్ఐడీఎం కావడం విశేషం. ఈ భవన సముదాయాలు పూర్తయ్యాక ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ చాలాకాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తోంది. కొండపావులూరులో 11 బృందాలు పనిచేస్తున్నాయి. కర్ణాటకలో మరో 4 బృందాలు పనిచేస్తున్నాయి. పొరుగున ఉన్న హైదరాబాద్‌లో 1 బెటాలియన్, విశాఖలో మరో 2 బెటాలియన్లు పనిచేస్తున్నాయి.

### వైసీపీ హయాంలో..

ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలు ఏర్పాటవుతున్న ప్రాంతంలో సరైన రహదారులు కూడా లేకపోవటంతో భూములు సేకరించారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి ఎలాంటి సహకారం అందించలేదు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలు పదేపదే వైసీపీ ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోలేదు. సరైన దారి లేకపోతే పనులు జరగవని వైసీపీ భావించింది. అయితే, దారులు బాగోకపోయినా ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవనాల పనులు జరిగాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ రహదారులను అభివృద్ధి చేసింది. దీంతో ప్రతిష్ఠాత్మక సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు కేంద్ర సంస్థలను ప్రారంభించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈనెల 18న నగరానికి చేరుకుంటారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా సీఎం చంద్రబాబు నివాసంలో విందుకు హాజరవుతారు. ఆ తర్వాత నగరంలోని నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. 19వ తేదీ ఉదయాన్నే కొండపావులూరు బయల్దేరతారు. హోంమంత్రి అమిత్‌షాతో పాటు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర హోంమంత్రి అనిత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో అమిత్‌షా ప్రసంగిస్తారు.

# తప్పు కోడానికా?

## ఆర్‌డబ్ల్యూఎస్‌లో మరో అవినీతి మరక

- మచిలీపట్నం సబ్ డివిజన్ పనుల్లో అవకతవకలు
- చేయని పనులకు ఎంబుక్‌లో రికార్డు, చెక్‌మెజర్‌మెంట్
- క్వాలిటీ కంట్రోల్ విభాగ తనిఖీల్లో బయటపడిన బండారం
- క్వాలిటీ కంట్రోల్ నివేదిక సరికాదని తాజాగా అభియోగం
- కృష్ణా కలెక్టర్‌కు నోట్‌ఫైల్.. రికార్డుల్లో సవరణకు ఆమోదం

తిమ్మిని బమ్మిని చేసి.. తప్పును ఒప్పుగా మార్చేసి.. చేసిన దొంగపని నుంచి బయటపడటానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇన్‌చార్జి ఈఈ ప్రయత్నం చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో జరిగిన ఫిల్టర్ మీడియా పనుల్లో జరిగిన అవకతవకలను సరిచేయడానికి అప్పటి డీఈ.. ఇప్పటి ఇన్‌చార్జి ఈఈ తెగ ప్రయత్నం చేస్తున్నారు. తప్పులను క్వాలిటీ కంట్రోల్ విభాగం రెండుసార్లు నిర్ధారించినా.. 'కృష్ణా' కలెక్టర్‌ను ఏమార్చి, సవరణకు ఆదేశాలు పొంది, తప్పును కప్పిపుచ్చుకునేందుకు తంటాలు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సామూహిక రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్)లో భాగంగా మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని చోరంపూడి గ్రామంలో 0.5 ఎంఎల్‌డీ మైక్రోఫిల్టర్‌లో కొత్త ఫిల్టర్ మీడియా మార్పించటానికి జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనిని అప్పట్లో వైసీపీ అనుకూల కాంట్రాక్టర్‌తో చేయించారు. ఈ పని పూర్తికాకుండానే గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో బిల్లులు పెట్టినట్టు అప్పట్లోనే ఆరోపణలొచ్చాయి. మైక్రోఫిల్టర్‌లో నింపాల్సిన ఫిల్టర్ మీడియా పరిమాణంలో చాలా వ్యత్యాసం ఉన్నట్టు వెలుగుచూసింది. 600 కేజీల కార్బన్ వేయాల్సి ఉండగా, 1,200 కేజీలు వేసినట్టు బిల్లులు పెట్టారు. ఎంబుక్‌లోనూ ఇదే నమోదు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లు సంతకం కూడా చేసి జడ్పీకి బిల్లులు పంపారు. ఆ తర్వాత ఈఈకి అనుమానం వచ్చి ఆ పనిని తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఆదేశించారు. పూర్తిగా పనులు చేయకుండానే ఎంబుక్‌తో పాటు ఇతర రికార్డుల్లో నమోదు చేశారని గుర్తించారు. దాదాపు రూ.2.3 లక్షల మేర చేయని పనులకు బిల్లులు పెట్టినట్టు నిర్ధారించారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులో 50 శాతం మేర రికవరీ చేయాల్సిందిగా ప్రతిపాదిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు నివేదిక ఇచ్చారు. ఇదే సబ్ డివిజన్ పరిధిలోని మల్లేశ్వరం సామూహిక రక్షిత మంచినీటి పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్‌లోని ఫిల్టర్ మీడియాను మార్చటానికి రూ.50 లక్షల జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను కూడా అడ్డగోలుగా చేశారన్న అనుమానంతో అప్పటి ఈఈ.. క్వాలిటీ కంట్రోల్ తనిఖీలకు ఆదేశించారు. ఇక్కడ కూడా ఫిల్టర్ మీడియా పనులు పూర్తిస్థాయిలో జరగలేదని నిర్ధారించారు. పనులు సక్రమంగా పూర్తి చేయనందున కాంట్రాక్టర్‌కు చెల్లించే బిల్లులో 30 నుంచి 50 శాతం వరకు రికవరీ చేయాలని ప్రతిపాదిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

### అప్పుడు డీఈ.. ఇప్పుడు ఇన్‌చార్జి ఈఈ

ఈ పనులు చేసినపుడు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారిగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ప్రస్తుతం లేరు. నాడు అడ్డగోలుగా చెక్‌మెజర్‌మెంట్ చేసిన డీఈ ప్రస్తుతం కృష్ణాజిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఈఈగా వ్యవహరిస్తున్నారు. తాను చేసిన దొంగపనిని ఇప్పుడు ఆయన సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. వి జిలెన్స్ మిగతా 6లో..

## గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు వెల్లడి 6లో

జనసేన పెనమలూరు ఇన్‌చార్జి

## సస్పెన్షన్

- బరుల్లో అధిక మొత్తంలో పార్కింగ్
- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం..
- పార్టీ నుంచి తొలగిస్తూ వేటు

విజయవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పా రాజాపై అధిష్ఠానం వేటు వేసింది. ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తూ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం ఆదేశాలిచ్చారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో కోడిపందేలు, గుండాట, పేకాట జోరుగా సాగాయి. ముప్పా రాజా ఆధ్వర్యంలో కంకిపాడులో బరులు ఏర్పాటు చేశారు. ఈ బరుల చుట్టూ జనసేన పార్టీ జెండాలు, పవన్ కల్యాణ్ చిత్రాలతో ఫ్లెక్సీలు కట్టారు. పందేలను వీక్షించడానికి, ఆడటానికి వచ్చిన వాహదారుల నుంచి భారీగా రుసుము వసూలు చేశారు. కారుకు పార్కింగ్ రూ.200 నిర్ణయించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్‌చల్ చేశాయి. నెటిజన్లు, రాజకీయ ప్రత్యర్థులు.. జనసేనపై కామెంట్లు చేశారు. దీనిని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. రాజాను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలిచ్చింది. పార్టీ నిర్వహించే ఏ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఆయనకు స్పష్టం చేసింది.



ముప్పా రాజా

## పేకప్..!



సంక్రాంతి మూడు రోజుల బరులేమో కానీ.. ఆ బరులు నిర్వహించిన స్థలాలు, ప్రాంగణాలు మాత్రం ఘోరంగా మారిపోయాయి. పేక ముక్కలు, మందు బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, తిని పడేసిన ప్లేట్లు, మాంసపు ముక్కలతో అస్తవ్యస్తంగా మారాయి. ఈ ఏడాది కొత్తగా పటమటలో ఏర్పాటుచేసిన బరిలో చెత్తాచెదారం మరీ ఎక్కువగా ఉండగా, ఎనికేపాడు బరిలోనూ ఇదే దుస్థితి కనిపించింది.







## ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలకు చెక్

- సమష్టి కృషితో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
- రహదారి భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- కలెక్టర్ లక్ష్మీశ సూచన

## సొసైటీ పాలకవర్గంలో చోటు కల్పించండి

- తిరువూరు తెలుగుయువత డిమాండ్
- రిజర్వేషన్లలో మార్పుతో పెరుగుతున్న ఆశావహులు

## పోర్టు పనులు వేగవంతం చేయాలి

- అధికారులతో మంత్రి కొల్లు సమీక్ష

## వృద్ధుడి ఉసురు తీసిన ధూమపానం

6లో


కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మలతో సమీక్షిస్తున్న మంత్రి రవీంద్ర

## పోర్టు పనులు వేగవంతం చేయాలి

» మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. గురువారం ఆర్అండ్బీ అతిథి గృహంలో మచిలీపట్నం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతిలతో సమీక్షించారు. బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతున్న దృష్ట్యా మచిలీపట్నంను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు, ఉపాధి అవకాశాలు లభించేందుకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. గిలకలదిండి ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి చేస్తే బాగుంటుందని, అందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. ఇందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. చేతి వృత్తుల వారికి జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన శిక్షణతో పాటు యూనిట్ల స్థాపనకు ప్రణాళిక రూపొందించాలన్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోల్పోకుండా క్లస్టర్ రూపొందించి పడవల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు శిక్షణా కార్యక్రమాలు కల్పించాలన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరిచేందుకు, బీచ్‌లో తాగునీటి అవసరాల కోసం డిశాలినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బందరుకోటలో పురాతన కట్టడాలను పరిరక్షించి హెరిటేజ్ పార్కుగా అభివృద్ధి చేసే అవకాశాలు కల్పించాలన్నారు. నగరంలో పార్కుల సుందరీకరణ చేయాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలన్నారు. పది డివిజన్లకు ఒక జిల్లా అధికారిని శానిటేషన్ పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.


క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డిని వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న ఎంపీలు కేశినేని శివనాథ్, సానా సతీష్, తదితరులు

## ఎంపీ శివనాథ్‌ను కలిసిన టీమ్ ఇండియా క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి

**వన్‌టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని విశాఖకు చెందిన టీమ్ ఇండియా క్రికెటర్ కె.నితీష్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని ఎంపీ నివాసంలో నితీష్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. శివనాథ్ (చిన్ని)తో పాటు ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌లు నితీష్ కుమార్‌రెడ్డికి సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డితో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విశేషాలను పంచుకున్నారు. తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించిన నితీష్‌ను అభినందించారు. ఎంతోమంది క్రీడాకారులకు నితీష్ కుమార్ రెడ్డి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. ఏపీ నుంచి ఏసీఏ తరపున మరింత మంది క్రీడాకారులు ఇండియన్ క్రికెట్, ఐపీఎల్‌లో ఆడేందుకు యంగ్ క్రికెటర్స్‌కి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకట రామ ప్రశాంత్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ దంతు గౌరు విష్ణుతేజ్, కె.ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

### నితీష్‌కుమార్ రెడ్డికి లోకేశ్ అభినందన



టీమ్ ఇండియా క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను గురువారం కలిశారు. ఆయన వెంట కేశినేని శివనాథ్, సానా సతీష్, తదితరులు పాల్గొన్నారు. నితీష్ కుమార్ రెడ్డిని అభినందించిన నారా లోకేష్ శాలువాతో సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. క్రికెట్ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో యువ క్రీడాకారులకు సహకారం ఉంటుందని తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని లోకేష్ ఆకాంక్షించారు.

## ద.మ.రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా రమేశ్ బాధ్యతలు



**వన్‌టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** దక్షిణ మధ్య రైల్వేకి ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా ఎన్.రమేష్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1992 బ్యాచ్‌కు చెందిన రమేష్ నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 30 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో బెంగుళూరు డివిజన్‌లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, రైల్వేమంత్రి వద్ద కో-ఆర్డినేషన్ పబ్లిక్ గ్రీవెన్స్ డైరెక్టర్‌గా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. పలు ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు.

### చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పద్మజ..



ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా కె.పద్మజ బాధ్యతలు స్వీకరించారు. తొలి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా ఆమె గుర్తింపు పొందారు. ఐఆర్‌టీఎస్ 1991 బ్యాచ్‌కు చెందిన ఈమె రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. 30 సంవత్సరాలుగా రైల్వేలో వివిధ విభాగాల్లో వివిధ హోదాల్లో పద్మజ పనిచేశారు. కిందటేడాది జులై నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పనిచేసిన ఆమె ప్రయాణికులు, సరుకు రవాణా సేవలను సమర్థవంతంగా నిర్వహించారు. రైల్వే ఆదాయాన్ని పెంచటానికి కృషి చేశారు.

## ఆర్టీసీ ఎండీకి జన్మదిన శుభాకాంక్షలు


డీజీపీ ద్వారకా తిరుమలరావుకు మొక్క బహూకరిస్తున్న ఆర్టీసీ కార్మిక నేతలు

**బస్ స్టేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):** ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమల రావు పుట్టినరోజు సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ ఆయనను గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, మరికొందరు ఆర్టీసీ ఎండీకి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ రాష్ట్ర కోశాధికారి, సీసీఎస్ పాలకవర్గ సభ్యుడు కోసూరి సురేంద్ర, తదితరులు ఉన్నారు.


పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న రహదారి

# పల్లెగూటికి పండగొచ్చె..

### కూటమి పాలనలో రహదారులకు మోక్షం.. రూ.24కోట్లతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం

(ఆంధ్రజ్యోతి-పామర్రు)

కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతోనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో పల్లెగూటికి పండగ వచ్చినట్టుగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం కేవలం బటన్ నొక్కడంతోనే సరిపెట్టి అభివృద్ధిని విస్మరించిందనే అపవాదును మూటగట్టుకుంటే.. కూటమి సర్కారు సంక్రాంతి నాటికి గుంతలులేని రహదారులే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రజల మన్ననలు పొందుతుంది. దానిలో భాగంగానే పామర్రు నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో 'పల్లెపండుగ' పథకం ద్వారా రూ.24 కోట్లు వెచ్చించి ప్రతి గ్రామంలో 398 సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టి శరవేగంగా పనులు పూర్తి చేసింది. సంతబజారు నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వెళ్లే దారితో పాటు పలు నూతన రోడ్లు వేశారు. అత్యంత అధ్వానస్థితిలో ఉన్న రోడ్లకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి శరవేగంగా పనులు పూర్తిచేయడంతో స్థానిక ప్రజలు ఎన్నాళ్ల కెన్నాళ్లకు రోడ్డుకు మోక్షం.. అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### చాల ఆనందంగా ఉంది

\- కమ్మిలి నాగ అనిల్ కుమార్



దశాబ్ద కాలం నుంచి పట్టించుకోకుండా ఉన్న ఈ రహదారిని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వడం నిజంగా చాల ఆనందంగా ఉంది. ఈ రహదారిలోనే నాలుగు ఆసుపత్రులు, పచారీ దుకాణాలతో పాటు ఇతర వ్యాపారాలు ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోక పోవడవం దురదృష్టకరం. రోడ్ల పక్కన మార్జిన్లలో రబ్బిసు తోలాలి.

### రైతుల ఇబ్బందులు తొలగినట్టే

మురళి, కౌలు రైతు

రైతులు తమ ఉత్పత్తులను పొలాలనుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. గోతుల రోడ్డులో చాల కాలం ఇబ్బందులు చూసాం. కొత్త ప్రభుత్వం చొరవతో రైతులఇబ్బందులు తొలగాయి. ప్రజల సమస్యలు పట్టించుకునే ప్రభుత్వం రావడం చాల సంతోషంగా ఉంది.

# గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

» సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు వెల్లడి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

**కృష్ణలంక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 26న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిపబ్లిక్ డే పరేడ్ చీఫ్ కో-ఆర్డినేటర్ సంబంధిత విభాగాల సంస్థల సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తదితర ప్రముఖులు పాల్గొంటారని, ఇందుకు మినిట్ టు మినిట్‌ను అనుసరించి ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొంటామన్నారు. ప్రధాన వేదికను ప్రొటోకాల్ నిబంధనలకు అనుగుణంగా రూపొందించి, స్టేడియంలో పోర్ట్ వాల్ డిజైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొంటామన్నారు. పోలీసు కమిషనర్ పి.రాజశేఖరబాబు మాట్లాడుతూ, వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసే వీఐపీ వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వేడుకల రిహార్సల్స్ నిర్వహించాలని, ఫుల్ డ్రస్ రిహార్సల్స్‌తో పరేడ్‌ను సిద్ధం చేస్తామన్నారు. వీవీఐపీ, వీఐపీలు ఇతర ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సీట్లను కేటాయించేలా చర్యలు తీసుకొంటామన్నారు. వేడుకల్లో ఆర్మీ కంటింజెంట్ రాష్ట్ర పోలీసు బెటాలియన్స్, ఎన్‌సీసీ స్కౌట్ అండ్ గైడ్స్, పోలీసు బ్యాండ్ వంటి విభాగాలు కవాతులో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు.

# ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలకు చెక్

» సమష్టి కృషితో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

» రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, డీటీసీ మోహన్

**కృష్ణలంక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం.. సమష్టి కృషితో ప్రజల్లో అవగాహన కల్పించి ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం.. రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసేందుకు కృషి చేద్దాం.. అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ పి.రాజశేఖరబాబులు తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నెలరోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు, బుక్‌లెట్స్ బ్యానర్లను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, డీటీసీ ఎ.మోహన్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతీ ఏడాది కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నెలరోజుల పాటు జిల్లావ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేలా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. నగర పోలీసు కమిషనర్ పి.రాజశేఖరబాబు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి ఎ.మోహన్ మాట్లాడుతూ, రోడ్డుభద్రతపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో పోలీసు, వైద్య ఆరోగ్య, ట్రాన్స్‌పోర్టు, ఆర్అండ్బీ, జాతీయ రహదారులు తదితర శాఖల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థలు ప్రజలను భాగస్వాములను చేసి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, కె.శివరాంగౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ రమణ, ఎస్ఎఎస్ వర్మ, కేడీవీ రవికుమార్, బి.శ్రావణి, సత్యనారాయణ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.ఇందుమతి పాల్గొన్నారు.

## వృద్ధుడి ఉసురు తీసిన ధూమపానం!


తీవ్రగాయాలతో వెంకటేశ్వరరావు

**గుడివాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** ధుమపానానికి బానిసైన వృద్ధుడు చివరకు సిగరెట్ మంటలకే ఆహుతయ్యాడు. ఈ ఘటన గుడివాడలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ద్రోణాదుల వారి వీధికి చెందిన చల్లా వెంకటేశ్వరరావు(71)కు ధూమపానం అలవాటుంది. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. బుధవారం ఉదయం సిగరెట్ వెలిగించి నిద్రలోకి జారుకున్నాడు. టిఫిన్ నిమిత్తం వెంకటేశ్వరరావు భార్య బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి భర్త మంటల్లో చిక్కుకుని ఉండటాన్ని గమనించింది. అప్పటికే తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వరరావును స్థానికుల సహాయంతో ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించాలని వైద్యులు సూచించగా, అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ తెలిపారు.

## యువకుడి మృతిపై రాజకీయం!


» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

**చందర్లపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :** సంచలనం కలిగించిన నల్లాని వీరమణితేజ మృతి రాజకీయ రంగు పులుముకుంది. ముప్పాళ్ల గ్రామానికి చెందిన వైసీపీ నేత నల్లాని సాయి కుమారుడు వీరమణితేజ బుధవారం అనుమానాస్పద స్థితిలో మరణించిన సంగతి విదితమే. గురువారం వీరమణితేజ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే పలువురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు ఆయన తెలిపారు. గురువారం మృతదేహాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఇంటూరి చిన్న తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వీరమణితేజ తలపై రాడ్డుతో కొట్టినట్టు బలమైన గాయాలు ఉన్నాయని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు విచారణ జరపాలని వారు కోరారు. చందర్లపాడులో కోడిపందేల వద్ద ఘర్షణే హత్యకు కారణమని వారు ఆరోపించారు.

### శవరాజకీయాలు మానుకోవాలి..

వైసీపీ శవ రాజకీయాలకు పాల్పడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు మేకల సుధాకర్ మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చుపెట్టాలని వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారన్నారు. జరిగిన ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారని, నిజాలు నిగ్గ తేలుతాయన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోక పోతే ప్రజలు మరో మారు బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

## దివ్యాంగుడి దారుణ హత్య


యర్రంశెట్టి ఆంజనేయులు

**జగ్గయ్యపేట :** పట్టణంలో సత్యనారాయణపురం పురపాలకసంఘ కాంట్రాక్ట్ కార్మికుడు, దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులు (45) గురువారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. సీఐ పి.వెంకటేశ్వర్లు తెలిపిన సమాచారం ప్రకారం.. రాత్రి 10గంటల సమయంలో యర్రంశెట్టి తననివాసంలో ఉండగా, అదే ప్రాంతానికి చెందిన బెల్లంకొండ నరేష్ గొడ్డలితో తలపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు అతడ్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. యర్రంశెట్టి అవివాహితుడు కాగా వివాహేతర సంబంధమే హత్యకు కారణమని భావిస్తున్నారు. గతంలో జిల్లా వైసీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా, సోషల్ మీడియాలో చురుకుగా పని చేశాడు. అదే సమయంలో పురపాలకసంఘ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా ఉద్యోగం సంపాదించాడు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

## సొసైటీ పాలకవర్గంలో చోటు కల్పించండి

» నియోజకవర్గ తెలుగుయువత డిమాండ్

» రిజర్వేషన్లలో మార్పుతో పెరుగుతున్న ఆశావహులు

**(ఆంధ్రజ్యోతి-తిరువూరు) :** నియోజకవర్గ పరిధిలోని మొత్తం 34 సహకార సంఘాల్లో తొలుత కేటాయించిన రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకోవడంతో సొసైటీ పాలకవర్గంలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. వివిధ సొసైటీలకు సంబంధించి ఇటీవల స్థానికంగా ఏఏ సొసైటీలు ఏ సామాజికవర్గానికి కేటాయించాలనే విషయంపై డ్రా తీశారు. తిరువూరు కేడీసీసీ బ్యాంక్ పరిధిలోని ఎనిమిది సహకార సంఘాల్లో లక్ష్మీపురం సొసైటీ జనరల్ మహిళ, నడింతిరువూరు, వావిలాల, ముష్టికుంట్ల, టేకులపల్లి జనరల్‌కు, మునుకుళ్ల బీసీ జనరల్, మల్లేల, చింతలపాడు, సొసైటిలలో ఒక సొసైటీని ఎస్సీ, ఒకటి బీసీ లేదా జనరల్‌కు కేటాయించేలా స్థానిక నాయకత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఆయా సొసైటీలకు ఎంపిక చేసిన అభ్యర్థుల మార్పు అనివార్యమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో తిరువూరు కేడీసీసీ బ్యాంక్ పరిధిలో ఎనిమిది సహకార సంఘాలు, కంభంపాడు పరిధిలో ఏడు సొసైటీలు, గంపలగూడెం పరిధిలో 12 సొసైటీలు, విస్సన్నపేట పరిధిలో ఏడు సహకార సంఘాలు ఉండగా మొత్తం 34 సహకార సంఘాల్లో కొన్ని మినహా మిగిలిన సొసైటీల్లో అభ్యర్థుల్ని మార్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

### తెలుగుయువతకు ప్రాధాన్యత కల్పించండి..

నియోజకవర్గంలోని నామినేటెడ్ పోస్టుల్లో తెలుగుయువతకు ప్రాధాన్యత ఇవ్వాలనే నినాదం బలంగా వినిపిస్తున్నది. పార్టీ కష్టకాలంలో వెన్నుదన్నుగా నిలిచిన తెలుగుయువతకు నామినేటెడ్ పోస్టుల్లో సముచితస్థానం కల్పించాలని, నియోజకవర్గ తెలుగుయువత డిమాండ్ చేస్తున్నది. పార్టీ అధిష్ఠానం తెలుగుయువతకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తున్నది.

## దివిసీమను ఎన్నటికీ మరిచిపోను

● నా సేవాజీవితానికి నాంది అక్కడే: హరియాణ గవర్నర్ దత్తాత్రేయ


హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కుటుంబసభ్యులు

**అవనిగడ్డ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):** దివిసీమను ఎన్నటికీ మరిచిపోలేనని, తన సేవా జీవితానికి నాంది పలికింది అక్కడేనని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం చండీఘర్ రాజ్‌భవన్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబసమేతంగా దత్తాత్రేయను కలిశారు. దివిసీమ ఉప్పెన సమయంలో పనిచేసిన వారందరినీ దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. పేరుపేరునా వారి గురించి అడిగారు. నాటి ఉప్పెనలో మండలి వెంకట కృష్ణారావు ఎనలేని సేవ చేశారని అన్నారు. కాళ్లలో ముళ్లు గుచ్చుకుని పుండ్లు పడినా లెక్కచేయకుండా అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. మండలి కృష్ణారావు-ప్రభావతి దంపతులు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలు మరచిపోలేనన్నారు. తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు మిమ్మల్ని సోదరుడిగా భావించేవారని, తామూ తమ కుటుంబసభ్యుడిగానే భావిస్తామని దత్తాత్రేయతో బుద్ధప్రసాద్ అన్నారు. బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులను దత్తాత్రేయ సత్కరించారు.దత్తాత్రేయను బుద్ధప్రసాద్, వెంకట్రామ్ సత్కరించారు. బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ, తనయుడు- కోడలు మండలి వెంకట్రామ్- సాయి సుప్రియ పాల్గొన్నారు.

## తప్పుకోడానికా..?

(5వ పేజీ తరువాయి)

నివేదికనే తప్పుబట్టారు. ఏఈ లేని సమయంలో అప్పట్లో తనిఖీలు జరిగాయని ఆరోపిస్తూ.. మళ్లీ తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులకు లేఖ రాశారు. అయితే, క్వాలిటీ కంట్రోల్ అధికారులు రాజీ పడలేదు. గతంలో ఏవైతే నిర్ధారించారో అవే అంశాలను పొందుపరుస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయానికి నివేదిక ఇచ్చారు.

### అదో కట్టుకథ

విజిలెన్స్ రిపోర్టు వ్యతిరేకంగా రావటంతో ఇన్‌చార్జి ఈఈ కంగుతిన్నారు. అప్పట్లో అడ్డగోలుగా చెక్‌మెజర్‌మెంట్ చేసిన తన బండారం బయట పడుతుందన్న ఉద్దేశంతో కట్టుకథ అల్లారు. డ్యామేజీ అయిన టేపులను వాడటం వల్ల ఎంబుక్‌లో చేయని పనులను నమోదు చేయాల్సి వచ్చిందన్న వాదన తీసుకొచ్చారు. ఎంబుక్‌లో నమోదు చేసిన వివరాలను మార్చటానికి వీలుగా కృష్ణాజిల్లా కలెక్టర్‌కు ఏకంగా నోట్‌ఫైల్ పెట్టారు. ఇక్కడే ఇన్‌చార్జి ఈఈ బండారం బయటపడింది. ఎంబుక్‌లో తప్పుగా నమోదైతే.. రీ రికార్డింగ్ చేయటానికి ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ)కు లేదా ఈఎన్‌సీకు నోట్‌ఫైల్ పెట్టాలి. ఇవేమీ చేయకుండా కలెక్టర్‌కు నోట్‌ఫైల్ పెట్టారు. తమ ఉన్నతాధికారులకు పెడితే అసలు విషయం తెలుస్తుందనే తెలివిగా కలెక్టర్‌కు పెట్టారు. కలెక్టర్ కూడా ఆ నోట్‌ఫైల్‌ను ఆమోదించారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఇన్‌చార్జి ఈఈ హోదాలో తనకు తానుగా ఎంబుక్‌లో ఎంట్రీలను రీరికార్డింగ్ చేయటానికి వీలుగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిప్రకారం ఎంబుక్, ఇతర రికార్డుల్లో నమోదు చేసిన వాటన్నింటినీ సరిచేస్తారు. దీంతో తాను చేసిన తప్పును సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ఈఈ ఆలోచన.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 140,149, 160 |
| చికెన్ విత్ స్కిన్ | 270 |
| చికెన్ స్కిన్‌లెస్ | 280 |

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

## దుర్గగుడి నిత్యాన్నదానానికి విరాళం

వన్‌టౌన్: తూర్పు గోదావరి జిల్లా, సామర్లకోట మండలం, వేట్లపాలెం గ్రామానికి చెందిన అమతం శైలేంద్రనాథ్, పద్మావతి తమ కుటుంబ సభ్యులతో గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. అన్న వితరణకు డిప్యూటీ ఈవో రత్నరాజుకు రూ.లక్ష చెక్కును అందజేశారు. దాతలకు రత్నరాజు ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


దాత శైలేంద్రనాథ్, పద్మావతి కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో

## 26న వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ మహాజనసభ

వన్‌టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభను నిర్వహిస్తున్నట్లు సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ (ఆదివారం) ఉదయం 11 గంటలకు విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన ఆర్‌ఎస్ నెం.751/1, 2, 752/6 స్థలంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులందరూ సకాలంలో తప్పక హాజరు కావాల్సిందిగా కోరారు.

# ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

### తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని ఈనెల 18న నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఘనంగా నిర్వహించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. పటమట అశోక్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ఈనెల నుంచి అభివృద్ధి పరుగులు పెడుతుందని, సమాంతరంగా విజయవాడ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. నగరంలోని ప్రధాన సమస్యలు అన్నింటిని పరిష్కరించేందుకు సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రూ.లక్ష చొప్పున చెల్లించి 30 మంది టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారన్నారు. ఇక నుంచి ప్రతి నెలా 9న డివిజన్ కమిటీ, 14న నియోజకవర్గ సమన్వయ కమిటీల సమావేశాలు నిర్వహించాలన్నారు. కూటమి నాయకులంతా సమన్వయంతో పని చేసి మేయర్ పీఠాన్ని కైవశం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీను, గద్దె క్రాంతి కుమార్, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరి సాయి బాబు, చెన్నుపాటి క్రాంతి శ్రీ, జి.నామేశ్వర రావు, పాల్గొన్నారు.


సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

● సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీలను లబ్ధిదారులకు ఆయన అందించారు. పేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు అండగా ఉంటున్నారన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న నటులు

వన్‌టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రి పై కనకదుర్గమ్మను యాంకర్ శ్రీముఖి, నటుడు ముక్కు అవినాష్‌ల బృందం దర్శించుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని టీమ్ దుర్గమ్మను దర్శించుకోవటానికి తరలివచ్చింది. ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలు అందచేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. కనకదుర్గమ్మవారిని దర్శించుకోవటం తమకు ఎంతో ఆనందంగా ఉందని, తరచూ విజయవాడ వచ్చి అమ్మను దర్శించుకుంటామని ఈ సందర్భంగా శ్రీముఖి, అవినాష్, తదితరులు తెలిపారు.


దుర్గమ్మను దర్శించుకున్న యాంకర్ శ్రీముఖి, నటుడు అవినాష్‌ల బృందం

# ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు వీఎంసీలో రెండు ప్రత్యేక కౌంటర్లు

● రిజిస్ట్రేషన్‌కు గడువు ఈ నెల 28 వరకే

చిట్టినగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వీఎంసీ పరిధిలోని పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో బి-ఫామ్ పట్టాల రిజిస్ట్రేషన్(వీఎంసీ) ఈ నెల 28 వరకు జరుగుతాయని, ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకొని వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్‌ల కోసం నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో నూతన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.. ఆయా ప్రాంతాల్లో మొత్తం వెయ్యి వరకు రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉన్నందున వారంతా త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయని పేర్కొన్నారు. 10 సంవత్సరాలుగా యజమానులుగా ఉంటున్న వారికి గజం రూ. 100లు రిజిస్ట్రేషన్ చేయటానికి తీసుకుంటామని, ఈ నెల 28 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు.


వీఎంసీ నూతన భవనంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్లు

### ప్రమాదకరంగా ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లు తొలగించండి

ప్రమాదకరంగా, నిరుపయోగంగా ఉన్న కేబుల్ ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతున్న కేబుల్, ఇంటర్నెట్, ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని వెంటనే తొలగించి, అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి, వారం రోజుల్లోగా తొలగించాలని పేర్కొన్నారు. ఈ నిబంధనను అమలు చేయకపోతే, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరులు, కేబుల్ ఆపరేటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు జరిమానా

రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10వేలు జరిమానా విధించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, ప్రమాదాలు సంభవించడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్. రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## దానయ్య వీధిలో డ్రెయినేజీలు శుభ్రం

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పటమట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పటమట దానయ్య వీధిలోని డ్రెయినేజీలను పారిశుధ్య సిబ్బంది గురువారం శుభ్రం చేశారు. పొంగుతున్న డ్రెయినేజీ అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య సిబ్బందిని పంపి డ్రెయినేజీలను శుభ్రం చేయించారు.







కనుల పండువగా మకరజ్యోతి దర్శనం ... అయ్యప్పనగర్‌లో మకరజ్యోతి వేడుకలు

## కనుల పండువగా మకరజ్యోతి దర్శనం

పటమట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో భాస్కరా హోమ్స్ సౌజన్యంతో అయ్యప్పస్వామి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం అన్నదానం చేశారు. అయ్యప్పనగర్ పుర వీధుల్లో గ్రామోత్సవం చేశారు. అయ్యప్ప ఆర్చి వద్ద మకర జ్యోతి దర్శనం చేశారు. గురుస్వామి సాయన బుజ్జి, చనుమోలు భాను ప్రసాద్ - విజయలక్ష్మి, కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, యుగంధర్, జోగి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన సంగీత ఉత్సవాలు


చింతలపాటి మంజుల గాత్రం


గండూరి నాగేశ్వరశర్మ గాత్రం

విజయవాడ కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంగీత సన్మండలి సంస్థ అధ్వర్యంలో నిర్వహిస్తున్న సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన సంగీత ఉత్సవాలలో భాగంగా సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల ఆవరణలో నాల్గవ రోజు గురువారం 18 బృందాలు తమ కచేరీలు చేశాయి. దాదాపు 50 మందికి పైగా కళాకారులు పాల్గొని ప్రేక్షకుల్ని రూపక తాళం అఠాణ రాగంలో 'ఏల నీ దయరాదు ఓ రాఘవ నీల మేఘ శ్యామలా'...కాలగతిలో నాపై కరుణలేదా...కళ్యాణ గుణశీల'...అంటూ చింతలపాటి హరిత, ఎం.అనురాధ గాత్ర యుగళంలో ఈ కృతి గానంతో సంగీతాభిమానుల ప్రశంసలు అందుకున్నారు. బెంగళూరుకు చెందిన సురవరపు విద్య వందనము, ఎవరికై, కీర్తనల గానంలో భక్తిరసాన్ని ఆస్వాదిస్తూ రామభక్తిలో ప్రేక్షకులు పరవశించారు. హైదరాబాద్‌కు చెందిన బీవీ శిరోమణిరావు, బెంగళూరుకు చెందిన సురవరపు ఉమా, వీవీ రఘురామప్రసాద్, కె.మాధవి, రాగంపూడి అమూల్య, లొల్లా జయరాం, హైదరాబాద్‌కు చెందిన మంగళంపల్లి స్వర్ణ, చింతలపాటి మంజుల, బుర్ర నీలకంఠ శాస్త్రి, పసుపర్తి పావని, కేవీ బ్రహ్మానందం సరస్వతీ కృష్ణవేణి గాత్రయుగళం, హైదరాబాద్‌కు చెందిన డీవీ మోహన్ కృష్ణ గాత్ర కచేరీలు అలరించాయి. ఎస్.దుర్గేష్ నందిని వీణ, కె.శశిధర్ వీణ వాదన కచేరీలు, గూడురుకు చెందిన జి.ద్రోణేంద్ర ఫణికుమార్, వేణు వాద్య కచేరీలు శ్రోతలను కట్టిపడేశాయి. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.

# మురుగునీటి విడుదలపై చర్యలు తీసుకోండి

### వెంకటేశ్వరనగర్ కాలనీ అధ్యక్షుడు ఆర్.కృష్ణారావు వినతి

భారతీనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల నుంచి శుద్ధి చేయని మురుగునీరు నేరుగా ఓపెన్ డ్రెయినేజీ వ్యవస్థలోకి విడుదల చేస్తున్నారని, మురుగునీటి విడుదల పై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర నగర్ కాలనీ అధ్యక్షులు ఆర్.కృష్ణారావు గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గవ డివిజన్‌లోని వెంకటేశ్వర నగర్ కాలనీ సమీపంలోని ఆంధ్రా లయోలా కళాశాల నుంచి ఎటువంటి శుద్ధి చేయ కుండానే మురుగునీటిని విడుదల చేస్తున్నారని తెలిపారు. అన్‌కవర్డ్ డ్రెయినేజీ సిస్టమ్ ద్వారా శుద్ధి చేయని వ్యర్థ జలాలు నిరంతరం పారుదలతో ఆ ప్రాంతం దోమల ఉత్పత్తి కేంద్రంగా మార్చేశాయన్నారు. మురుగు నీటి విడుదల పద్ధతులపై తక్షణమే తనిఖీని నిర్వహించాలని, తక్షణ ప్రాతిపదికన మురుగు నీటి శుద్ధి వ్యవస్థను (కర్మాగారాన్ని) ఏర్పాటు చేయమని కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని ఆ వినతి పత్రంలో కోరినట్టు ఆయన తెలిపారు.









## ఘనంగా త్రిపురనేని రామస్వామి వర్ధంతి

ధర్నాచౌక్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురనేని రామస్వామి వర్ధంతి గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ జోన్ సి కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, వైసీపీలు బీజేపీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా అంటకాగడం సిగ్గుచేటన్నారు. రామస్వామి స్ఫూర్తితో దళితులు, రైతులు, ముస్లింలు ఐక్యంగా మనువాద బీజేపీని ఎదుర్కొనేందుకు కార్యాచరణ రూపొందించాల్సిన అవశ్యకత ఉందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ అధికార ప్రతినిధి కొండలరావు పిలుపునిచ్చారు.

ప్రొఫెసర్ వసుంధర, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, చింతా మోహన్ తదితరులు పాల్గొని రామస్వామికి ఘనంగా నివాళులర్పించారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గన్నవరం ఎస్సై శివప్రసాద్ వివరాల ప్రకారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో సుమారు 50ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరువైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొని గాయపడ్డాడు. బాధితుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్సకు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సమాచారం తెలిసిన వారు గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.














ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● శుక్రవారం 17 జనవరి 2025

## సినిమాలో నా లుక్ తృప్తినిచ్చింది

- జగపతిబాబు




రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్). నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో తన లుక్ గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సినిమా కోసం సన్నద్ధమవుతున్న వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "చాలా కాలం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సీ 16' కోసం మంచి పాత్రను ఇచ్చాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా ఉంది" అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.



## షాక్‌కు గురయ్యాం

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై టాలీవుడ్ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి షాక్‌కు గురయ్యామన్నారు. 'సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి నన్నెంతగానో కలచి వేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'సైఫ్ సర్‌పై జరిగిన దాడి గురించి విని షాక్‌కు గురయ్యాను. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. కాగా, ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించారు సైఫ్ అలీఖాన్. గతేడాది విడుదలైన ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర-2' ప్రారంభం కావాల్సి ఉంది. సైఫ్ దాడికి గురికావడంతో ఇది మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

## అందుకే సినిమాలు తగ్గించా



బ్రహ్మానందం

'సినిమాలు ఎందుకు తగ్గించేశానని చాలా మంది అడుగుతున్నారు. నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని కాపాడుకోవాలి. బ్రహ్మానందం బాగానే చేస్తున్నాడు కానీ.. ఒకప్పటిలా బాగా నవ్వించలేకపోతున్నాడు. ఆయన ఒకప్పుడు నటిస్తే వచ్చినంత నవ్వు ఇప్పుడు రావట్లేదు' అని కొందరు కమెడియన్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఎంత జాగ్రత్తగా చేసినా ఇలా దొరికిపోతుంటాం. ఇలాంటివి అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమాలు సెలక్టివ్‌గా చేస్తున్నాను. దర్శకులు కూడా నేను ఇదివరకు చేసిన పాత్రలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. నన్ను ప్రేక్షకులు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే రిపీట్ పాత్రలు చేయకూడదు. మరో కారణం, పెరుగుతున్న నా వయసు. ఒకప్పుడు చేసినంత ఉత్సాహంగా చేయలేకపోతున్నాను. అందుకే సినిమాలు తగ్గించేయాలని నిర్ణయం తీసుకున్నాను. నాకు సినిమాల్లో అవకాశాలు రాకా కాదు. దర్శకులు నాకు పాత్రలు ఇవ్వకా కాదు. నేను యాక్టింగ్ చేయలేకా కాదు" అని 'బ్రహ్మ ఆనందం' టీజర్ లాంచ్ కార్యక్రమంలో బ్రహ్మానందం చెప్పారు. తన తనయుడు రాజా గౌతమ్‌తో కలసి ఆయన నటించిన చిత్రమిది. ఆర్.వీ.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్‌యాదవ్ నక్కిన నిర్మించారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.



## నిజ జీవిత ఘటనల ఆధారంగా...

అక్షయ్ హీరోగా దినేశ్ బాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య కీలకపాత్రల్లో నటించారు. పి.ఎన్.బలరామ్ నిర్మాత. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ప్రతీ షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది' అని అన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం' అని అన్నారు. కాగా, మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ని ఎంపిక చేసి రూ.10,000 క్యాష్ బాక్ బహుమతిగా అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## సంక్రాంతి సినిమా ఫిబ్రవరిలో వస్తోంది



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్ నటించిన 62వ చిత్రం 'విడాముయర్చి' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించిన మేకర్స్ గురువారం సాయంత్రం ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజ్ చేయనున్నారు. మగిళ్ తిరుమేని దర్శకుడు. త్రిష హీరోయిన్. సీనియర్ నటుడు అర్జున్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా, రెజీనా కెసాండ్రా మరో ముఖ్య పాత్రలో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ మూవీని లైకా ప్రొడక్షన్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇక ఈ ట్రైలర్‌లో 'అజిత్, త్రిష ప్రేమని చూపించి, ఆ తర్వాత వీళ్ళకు ఒక సమస్య ఉత్పన్నం కాగా దానిపై హీరో ఎలా పోరాడాడు అన్నది 2 నిమిషాల 22 సెకన్లతో ఈ ట్రైలర్‌ను కట్ చేశారు. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు ఇది రీమేక్‌గా చెబుతున్నారు. నిజానికి సంక్రాంతి పండుగకు రిలీజ్ కావాల్సి ఉండగా, హాలీవుడ్ రీమేక్ హక్కులు పొందడంలో తలెత్తిన సమస్యల కారణంగా వాయిదా వేశారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



## మా కుటుంబంలో గొడవలు దురదృష్టకరం



తమ కుటుంబంలో గొడవలు జరగడం దురదృష్టకరమని మంచు మనోజ్ అన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తన భార్య భూమా మౌనికతో కలసి మనోజ్ వచ్చారు. బుధవారం ఎంబీయూ విద్యాసంస్థల వద్ద జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సినిమాలకు 8 సంవత్సరాలు దూరంగా ఉన్నానని, ఇప్పటికీ తనకు అభిమానులు ఉండటం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తనపై అభిమానంతో ఉన్న వారిని బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఉంటే తనను పిలిపించి మాట్లాడుకోవాలే గానీ, తన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడం పద్ధతి కాదన్నారు. తన అభిమాని పళణి, వినాయకన్‌ను పిలిచి, తనతో తిరగకూడదని బెదిరించారని, పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొంటే గొడవలు సద్దుమణుగుతాయన్నారు. ఎంబీయూలో జరిగే క్యాంపస్ గురించి చర్చించుకొంటే సరిపోతుందన్నారు. మంచు విష్ణు అనుచరులైన హేమాద్రి, కిరణ్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)

## దబిడి దిబిడి.. కళలో ఓ భాగమే

- ఊర్వశీ రౌతేలా



'బాలకృష్ణ గారు ఓ లెజెండ్. ఆయనతో కలసి పనిచేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తా' అని అన్నారు నటి ఊర్వశీ రౌతేలా. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ - ఊర్వశీ రౌతేలా 'దబిడి దిబిడి' పాట బాగా పాపులర్ అయ్యింది. అయితే ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ గారితో పని చేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో గౌరవం ఇస్తారు. ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను' అని అన్నారు. కాగా, ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్‌పై కూడా ఊర్వశీ స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్‌కు ఘాటుగా బదులిచ్చారు.



కుంభమేళా

త్రివేణీ సంగమ స్థలి ప్రయాగ (అలహాబాద్)లో 45 రోజుల కుంభమేళా వైభవంగా ప్రారంభమయింది. కోట్లాది ప్రజలు పవిత్ర స్నానాలకోసం తరలివచ్చే ఈ మహోన్నతమైన కార్యక్రమం ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక. మరి కుంభమేళా సందర్భంగా... ప్రయాగలో దర్శించుకోవాల్సిన ప్రధాన ఆలయాలేమిటో తెలుసుకుందామా?

## పవిత్ర స్నానం

# పరిపూర్ణం కావాలంటే...

**మాధవం దృష్ట్వా...**

'కాశీక్షేత్ర నివాసం చ కాలభైరవ దర్శనమ్
ప్రయాగే మాధవం దృష్ట్వా ఏకబిల్వం శివార్పణం' అంటోంది బిల్వాష్టకం. కాశీలో కొన్నాళ్ళు నివసించి, ఆయనను బిల్వపత్రాలతో అర్చించి, కాలభైరవుడి దర్శనం చేసుకున్నవారు ప్రయాగలో మాధవస్వామిని దర్శనం చేసుకున్న తరువాతే ఆ యాత్ర పరిపూర్ణం అవుతుందన్నారు పూర్వులు. ప్రయాగ క్షేత్రానికి అధిదేవత శ్రీ వేణీ మాధవుడు. ఈ స్వామిని 'ప్రయాగకు మహారాజు'గా 'రామచరితమానస్'లో తులసీదాసు



ప్రస్తుతించాడు. అత్యంత పురాతనమైన వేణీమాధవ ఆలయాన్ని 'ప్రాచీన శ్రీ వేణీ మాధవ్ మందిర్'గా వ్యవహరిస్తారు.

స్థలపురాణం ప్రకారం... త్రేతాయుగంలో గజకర్ణుడు అనే రాక్షసుడు ముల్లోకాలను పీడిస్తూ ఉండేవాడు. అతని హింసను భరించలేక దేవతలు మహా విష్ణువును శరణు వేడారు. అప్పుడు నారద మహర్షిని గజకర్ణుడి దగ్గరకు మహా విష్ణువు పంపాడు. గజకర్ణుడికి కొన్ని వ్యాధులు ఉండేవి. వాటి నివారణ మార్గాన్ని చెప్పాలని నారదుణ్ణి గజకర్ణుడు కోరాడు. త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే ఫలితం ఉంటుందని నారదుడు చెప్పాడు. ఆ ప్రకారం స్నానం చేసిన గజకర్ణుడి వ్యాధులు నయమయ్యాయి. ఇంత పవిత్రమైన జలాలు తనకే సొంతం కావాలనే దురాశతో... అక్కడ సంగమించే గంగ, యమున, సరస్వతి నదులను గజకర్ణుడు తాగేశాడు. ఆ పరీవాహక ప్రాంతాల్లో తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజల పరిస్థితి దుర్భరంగా మారింది. వారి ప్రార్థనను ఆలకించిన మహా విష్ణువు ప్రయాగ ప్రాంతానికి వచ్చి, మూడు రోజులు యుద్ధం చేసి, గజకర్ణుణ్ణి వధించాడు. అప్పుడు ఆ నదులు మళ్ళీ వాటి స్థానాల్లో తిరిగి ప్రవహించడం ప్రారంభించాయి. త్రివేణీ సంగమాన్ని కాపాడవలసిన అవసరాన్ని గుర్తించిన మహా విష్ణువు... పవిత్ర సంగమానికి నిరంతర రక్షకుడిగా... వేణీ మాధవుడి రూపంలో... శ్రీ మహాలక్ష్మీ సమేతంగా కొలువయ్యాడు. అందుకే ఈ ఆలయాన్ని లక్ష్మీ నారాయణ మందిరంగా కూడా పిలుస్తారు. పద్మ, వరాహ, మత్స్య, స్కాంద పురాణాల్లో, రామాయణ, మహా భారతాల్లో ఈ స్వామి ప్రస్తావన ఉంది. జనన మరణ చక్రం నుంచి మానవులకు విముక్తి కలిగించే దైవంగా వేణీ మాధవుణ్ణి పురాణాలు వర్ణించాయి.

**ప్రయాగే మాధవేశ్వరి...**

పరమ శివుడికి జరిగిన అవమానాన్ని తట్టుకోలేని సతీదేవి... దక్ష యజ్ఞంలో ఆత్మాహుతి చేసుకుంది. శివుడు తన భుజాన సతీదేవి దేహాన్ని వేసుకొని, చీకటిలోకి వెళ్తూ ఉండగా... లోక క్షేమం కోసం ఆ దేహాన్ని తన సుదర్శన చక్రంతో మహా విష్ణువు ఛేదించాడు. ఆ శరీర ఖండాలు భూమిపై పలు ప్రదేశాల్లో





పడ్డాయి. ఇవి అష్టాదశ శక్తి పీఠాలుగా ప్రసిద్ధి చెందాయి. వాటిలో ప్రయాగ ఒకటి. ఇది సతీదేవి కుడి చేతి వేళ్ళు పడిన ప్రదేశంగా పురాణాలు పేర్కొంటున్నాయి. ఇక్కడ మాధవేశ్వరిగా అమ్మవారు ఆరాధనలు అందుకుంటోంది. ఆమెను స్థానికులు 'అలోపీదేవి' అని పిలుస్తారు. ఈ ఆలయంలో యంత్రమే కాని విగ్రహం లేదు. యంత్రంపై ఉన్న ఊయలకు (డోలీకి) భక్తులు పూజలు చేస్తారు. కుంభమేళాలో స్నానం చేసి, ఆ తీరంలో కొలువైన వేణీ మాధవస్వామిని, మాధవేశ్వరీ దేవిని దర్శనం చేసుకున్నవారు సంపూర్ణ యాత్రా ఫలాన్ని పొందుతారనే విశ్వాసం ఉంది.

సహజయోగ

# సర్వమత సారమే విశ్వ నిర్మల ధర్మం

'ధర్మమే సర్వ జగత్తుకు ఆధారం' అని 'నారాయణ ఉపనిషతు' చెబుతోంది. 'ధైర్యం, క్షమ, సంయమనం, అస్తేయం (దొంగతనం చెయ్యకపోవడం), శౌచం, ఇంద్రియ నిగ్రహం, విద్య, సత్యం, క్రోధరాహిత్యం, సంశయం లేకుండా ఉండడం... ఈ పది జీవితంలో పాటించడమే ధర్మం' అని 'మనుస్మృతి' చెబుతోంది. మాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన 'విశ్వ నిర్మల ధర్మా'నికి ఈ సూత్రమే పునాది. 'విశ్వ' అంటే విశ్వజనీనమైనది. ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని కుల, మత, వర్గ, ప్రాంత, లింగ, వయో భేదాలు లేకుండా ఆచరించవచ్చు. 'నిర్మల' అంటే 'ఎలాంటి మలినం లేనిది, పరిపూర్ణమైన స్వచ్ఛత కలిగినది' అని అర్థం. మనిషి ధర్మబద్ధమైన జీవితంతో మనసును శుద్ధి చేసుకోవాలని ప్రాచీన కాలం నుంచి అన్ని మతాలు చెబుతున్నాయి. సాధకుడి ఆధ్యాత్మిక ఉత్థానానికి మార్గాన్ని సుగమం చేసి, జీవితంలో అన్ని విధాలా సమతుల్యతను నెలకొల్పడమే ప్రతి మతం తాలూకు లక్ష్యం. అన్ని మతాల మధ్యా సామరస్యాన్ని తీసుకువచ్చి, వాటి నిజమైన అర్థాన్ని బోధించి, అవన్నీ ఒకే వృక్షానికి పూసిన పూవులని నిరూపించేవారు ఒకరు ఉండాలి. ఆ పని కోసమే భగవంతుడు పంపినట్టు మాతాజీ నిర్మలాదేవి జన్మించారు.



**అప్పుడే మనది వసుధైక కుటుంబం**

సహజయోగం ఏ మతానికో చెందినది కాదు. ఇది సర్వ మత సమ్మేళనం, సర్వ మతాల సారం. అవతార పురుషులు, సద్గురువులు, మత ప్రవక్తల ప్రబోధాల సారాంశాన్ని సమ్మిళితం చేసి ఆచరిస్తున్న ధార్మిక సంగమం. అన్ని మతాలు వాటిని ప్రారంభించిన అవతారమూర్తుల పేరుతో ప్రసిద్ధి చెందాయి. అదే విధంగా ఈ ఆధ్యాత్మిక మార్గం కూడా శ్రీమాతాజీ నిర్మలాదేవి పేరిట 'విశ్వ నిర్మల ధర్మం'గా ఏర్పడింది. సహజయోగులు దీన్ని ఆచరిస్తారు. ఇది అన్ని మతాల సారాంశం. ఇందులో అన్ని మతాల నిజమైన అర్థాన్ని, వాటి మధ్య సంబంధాన్ని తెలుసుకుంటాం. 'విశ్వ నిర్మల ధర్మం' అనే మాట వినగానే 'కొత్త మతం తీసుకోవాలేమో? సహజయోగ సాధన చేయాలంటే మతానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, నియమ నిష్ఠలు అనుసరించాలేమో?' అనే అపోహ మొదట్లో కొందరికి కలుగుతుంది. కానీ ఇందులో ప్రత్యేకంగా పాటించే నియమం ఏదీ లేదు. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఉపయోగపడే మార్గం మాత్రమే. మన అందరిదీ ఒకే మతం, ఒకే రంగు, ఒకే జాతి కాకపోవచ్చు... కానీ అందరినీ సృష్టించిన ఆది దంపతులు ఒక్కరే. ఇది అంగీకరిస్తే అందరిదీ ఒకే మతం. ఒకే అభిమతం, ఒకే కుటుంబం. అదే విశ్వ నిర్మల ధర్మం చెబుతోంది. దీన్ని అర్థం చేసుకోవడానికి, ఆచరించి చూపడానికి సహజయోగ సాధనే సాధనం. దీన్ని అనుసరించినప్పుడు మన ప్రపంచం భూతల స్వర్గం, వసుధైక కుటుంబం అవుతుంది.

**మానవ జన్మకు పరమార్థం**

సహజ యోగ సాధకులు... హిందూ దేవతలను, అల్లాహ్‌ను, క్రీస్తును, బుద్ధుణ్ణి, మహావీరుణ్ణి, గురునానక్‌ను ఆయా పర్వదినాలలో ఆరాధిస్తారు. అందరూ ఒక్కటే అనే భావనతో మెలుగుతారు. '.నిన్ను నీవు తెలుసుకో... అనేది అన్ని మతాల సారాంశం. అదే సత్యం. భగవంతుడు ఎక్కడో లేడు. నీ ఆత్మలో ఉన్నాడు. కాబట్టి నువ్వు ఆత్మ స్వరూపుడిగా పరిణామం చెందాలి. ఎన్నో ఏళ్ళ, జన్మల ఈ సత్యాన్వేషణ... సహజ యోగంలో ఆత్మ సాక్షాత్కారంతో ముగుస్తుంది అదే మానవ జన్మకు పరమార్థం" అంటారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. ఆమె కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు. సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, సర్వమత, సర్వ ధర్మ సంస్థాపనను కేవలం ప్రచారానికో, ప్రవచనాలకో పరిమితం కాకుండా మనసా, వాచా, కర్మణా ఆచరించి చూపించారు. అలా చేయగలిగే అవకాశం సహజయోగంలోనే ఉందని చాటిచెప్పారు. అదే విశ్వ నిర్మల ధర్మం.

*(ప్రపంచవ్యాప్తంగా ఉన్న సహజయోగులు ప్రతి ఏటా జనవరి 19వ తేదీని 'విశ్వ నిర్మల ధర్మ సంస్థాపన దినోత్సవం'గా జరుపుకొంటారు)*



డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ


ఇస్రో.. డాకింగ్

# రోదసిలో కరచాలనం

**స్పేడెక్స్ చేజర్, టార్గెట్ ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ సక్సెస్**

- ఇప్పటికే ఆ ఘనత సాధించిన మూడు దేశాల సరసన భారత్
- సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు దిశగా మరో కీలక అడుగు
- 7, 9 తేదీల్లో డాకింగ్‌కు యత్నం.. పలు కారణాలతో వాయిదా
- జనవరి 12వ తేదీ నాటికి 15 మీటర్ల దూరానికి ఉపగ్రహాలు
- గురువారం ఉదయం 9 గంటల సమయంలో డాకింగ్ పూర్తి
- రెండు ఉపగ్రహాలూ నియంత్రణలోనే ఉన్నాయని ఇస్రో వెల్లడి
- శాస్త్రజ్ఞులను అభినందించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

'ఉపగ్రహాల స్పేస్ డాకింగ్‌ను విజయవంతంగా పూర్తిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు, అంతరిక్ష రంగానికి అభినందనలు. రాబోయే రోజుల్లో భారత్ చేపట్టబోయే ముఖ్యమైన అంతరిక్ష యాత్రలకు ఇదొక ముఖ్యమైన మైలురాయి'
-ప్రధాని నరేంద్ర మోదీ



'గుడ్ మార్నింగ్ ఇండియా. అంతరిక్ష చరిత్రలో భారత్ తన పేరును చిరస్థాయిగా డాక్ చేసింది. ఇస్రో స్పేడెక్స్ మిషన్ చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ క్షణాన్ని చూస్తున్నందుకు గర్వంగా ఉంది'
- ఇస్రో

సూళ్లూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పదిహేడు రోజుల ఉత్కంఠభరిత నిరీక్షణకు తెరపడింది! భారతీయులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది! స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్)లో భాగంగా గత నెల 30న భారత అంతరిక్ష పరిశోధనల సంస్థ (ఇస్రో) రోదసిలోకి ప్రవేశపెట్టిన ఎస్‌డీఎక్స్-01 (చేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) ఉపగ్రహాలను..

బెంగళూరులోని ఇస్ట్రాక్ ట్రాకింగ్ సెంటర్ శాస్త్రవేత్తలు గురువారం ఉదయం 9 గంటల సమయంలో విజయవంతంగా అనుసంధానించారు. డిసెంబరు 30న శ్రీహరికోటలోని షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ ద్వారా జంట ఉపగ్రహాలను రోదసిలోకి పంపిన సంగతి తెలిసిందే. ఈ ఉపగ్రహాలు అప్పటి నుంచీ కక్ష్యలో తిరుగుతూ ఉన్నాయి. ఒక్కొక్కటీ 220 కేజీల బరువుండే ఈ రెండు శాటిలైట్ల మధ్య దూరం 20 కిలోమీటర్లు ఉండేలా లాంచింగ్ సమయంలోనే జాగ్రత్తలు తీసుకున్నారు. తర్వాత క్రమంగా వీటి మధ్య దూరాన్ని తగ్గించుకుంటూ వచ్చి 7వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో అనుసంధానం చేయాలని భావించారు. ఈ మేరకు ఇస్రో చైర్మన్ ఒక ప్రకటన కూడా చేశారు. అయితే చేజర్ ఉపగ్రహంలోని అనుసంధాన లింకు తెరుచుకోకపోవడంతో ఆ ప్రక్రియను జనవరి 9కి వాయిదా వేశారు. ఆ సమయంలో ఆ రెండు ఉపగ్రహాలు 1.5 కి.మీ దూరంలో ప్రయాణిస్తున్నాయి. వాటిని ఆ రోజు 1.3 కి.మీ దగ్గరికి తీసుకొచ్చారు. రెండింటిమధ్య దూరాన్ని 225 మీటర్లకు తగ్గించేందుకు ప్రయత్నించి.. వాటి వేగం అదుపులోకి రాకపోవడంతో అనుసంధాన ప్రక్రియను జనవరి 11కి వాయిదా వేశారు. ఆ రోజున రెండు ఉపగ్రహాలనూ 230 మీటర్ల దగ్గరకు తీసుకొచ్చారు. జనవరి 12న ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్లకు తీసుకొచ్చారు. కొంత సమయం తర్వాత ఉపగ్రహాల వేగాన్ని నియంత్రించుకుంటూ రెండింటినీ 10 అడుగుల (3 మీటర్లు) దగ్గరకు చేర్చారు. ఎట్టకేలకు గురువారం ఉదయం 9 గంటలకు నెమ్మదిగా రెండింటినీ అనుసంధానించారు. అవి నియంత్రణలోనే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత.. డాకింగ్ విజయవంతమైనట్టు ఇస్రో వెల్లడించింది. దీన్నో చరిత్రాత్మక విజయంగా అభివర్ణించింది. ఏకమైన రెండు ఉపగ్రహాలూ నియంత్రణలోనే ఉన్నాయని.. ఇకపై అన్‌డాకింగ్, విద్యుత్తు బదిలీ తదితర ప్రక్రియలు చేపడతామని పేర్కొంది. డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్టు తెలియగానే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే.. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష కార్యక్రమం చరిత్రాత్మక మైలురాయిని అధిగమించిందని కొనియాడారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఇస్రోను అభినందించారు. 'నమ్మశక్యం కాని విజయం ఇది. స్పేడెక్స్.. డాకింగ్ పూర్తయింది. ఇది ఇప్పుడు స్వదేశీ భారతీయ డాకింగ్ వ్యవస్థ' అన్నారు. ఈ విజయం.. భవిష్యత్తులో చేపట్టబోయే భారతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రయాన్ 4, గగన్‌యాన్ ప్రయోగాలను ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించేందుకు బాటలు వేసిందని కొనియాడారు. ఇస్రో చైర్మన్ వి నారాయణన్ కూడా.. మిషన్‌ను విజయవంతం చేసిన బృందాన్ని అభినందించారు. ఈ ప్రయోగంలో కీలక భాగస్వామి అయిన అనంత్ టెక్నాలజీస్ కూడా ఇస్రో శాస్త్రజ్ఞులకు హృదయపూర్వక అభినందనలు తెలిపింది. భారత అంతరిక్ష ప్రయోగాల ప్రస్థానంలో అత్యంత కీలకమైన ప్రాజెక్టులో ప్రధాన భూమిక పోషించడం తమకు గర్వకారణమని ఆ సంస్థ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు పేర్కొన్నారు.

### డాకింగ్ విజయ సారథులు వీరే

డాకింగ్ ప్రక్రియలో బెంగళూరు యూఆర్‌రావు ఉపగ్రహ తయారీ కేంద్రం శాస్త్రవేత్తల పాత్ర కీలకమైనది. స్పేడెక్స్ ఉపగ్రహాల రూపకల్పన నుంచీ.. వీరు ఈ ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. శాటిలైట్ డైరెక్టర్ ఎం.శంకరన్, మరో డైరెక్టర్ ఎన్.సురేంద్రన్, మిషన్ డైరెక్టర్ జయకుమార్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం మూడేళ్ల కృషికి ఫలితం ఈ విజయం. అలాగే.. బెంగళూరుకు చెందిన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ సహకారం కూడా ఈ విజయానికి ఎంతో ఉపకరించింది.

### డాకింగ్ వీరుడు శంకరన్

డాకింగ్ సాంకేతికత సాధించడంలో ప్రధాన భూమిక పోషించిన వారిలో బెంగళూరులోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ ఎం.శంకరన్ ఒకరు. గతంలో ఇస్రో చేపట్టిన పలు భారీ ప్రయోగాల్లో శంకరన్ కీలక పాత్ర పోషించారు. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సాఫ్ట్‌గా ల్యాండింగ్ కావడంలో ఈయన పాత్ర ఎంతో ఉంది. తమిళనాడులోని తిరువాయూరుకు చెందిన శంకరన్.. నావిగేషన్, కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వాతావరణ పరిశోధనల ఉపగ్రహ ప్రయోగాల్లో కీలకంగా వ్యవహరించారు.

### చరిత్రలో తొలి డాకింగ్.. 1966లో!

రోదసిలో డాకింగ్ చేసిన నాలుగో దేశంగా భారత దేశం గురువారం చరిత్ర సృష్టించింది సరే.. మరి ఆ ఘనత సాధించిన మొదటి దేశమేది? అంటే.. అమెరికా. 1966 మార్చి 16న.. అమెరికాకు చెందిన ఇద్దరు వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, డేవిడ్ స్కాట్ నడుపుతున్న జెమిని 8 క్యాప్సూల్.. ఏజెనా టార్గెట్ వెహికల్ అనే చోదక రహిత వ్యోమనౌకతో డాక్ అయ్యింది. అదే మానవాళి చరిత్రలో తొలి డాకింగ్. రోదసిలో రెండు వ్యోమనౌకలూ విజయవంతంగా డాక్ అయ్యాయి. కానీ.. క్షణాల వ్యవధిలోనే జెమినీ 8 అదుపులో లేకుండా పోయింది. అప్రమత్తమైన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జెమిని 8ను అన్‌డాక్ చేసినా.. అది అదుపులోకి రాలేదు. దీంతో.. నాసా శాస్త్రజ్ఞులు ఆ వ్యోమనౌకను షెడ్యూలుకు భిన్నంగా పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయేలా చేసి, వ్యోమగాములను కాపాడుకున్నారు.



### ఎన్నో ఉపయోగాలు..

ఉపగ్రహాల డాకింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో.. భారత్ సొంత అంతరిక్ష కేంద్ర ఏర్పాటుకు మార్గం సుగమమైందని చెప్పవచ్చు. అలాగే.. భారత్ చేపట్టబోయే గగన్‌యాన్‌కు కూడా డాకింగ్ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక, చంద్రయాన్-4లో భాగంగా.. చంద్రుడి నమూనాలను తేవడమే లక్ష్యంగా పెట్టుకొన్న ఇస్రో అందుకోసం రెండు రాకెట్ల ద్వారా విభిన్న మాడ్యూళ్లను రోదసిలోకి పంపనుంది. ఈ అనుభవంతో.. చంద్రుడి కక్ష్యలో ఆ మాడ్యూళ్లను అనుసంధానం చేయడం ఇస్రోకు సులభం అవుతుంది. అందుకే ఇస్రో ఈ ప్రయోగాన్ని ఇంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ విజయంతో.. ఆ ప్రయోగాలు మరింత వేగవంతమవుతాయి.

# ఇక అంతరిక్ష కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

2 ఉపగ్రహాలను డాక్ చేసినట్టుగానే.. భవిష్యత్తులో ఐదు మాడ్యూళ్లను డాక్ చేయడం ద్వారా బీఏఎస్‌ను నిర్మించాలన్నది ఇస్రో లక్ష్యం. 2019లో.. అప్పటి ఇస్రో చీఫ్ కె.శివన్ బీఏఎస్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను ప్రపంచానికి తొలిసారి వెల్లడించారు. 2030 నాటికి బీఏఎస్‌ను 20 టన్నుల బరువుతో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ.. కొవిడ్ కారణంగా ఆలస్యం జరిగింది. ఇప్పుడు.. మొత్తం ఐదు మాడ్యూళ్లతో బీఏఎస్‌ను నిర్మించాలన్నది ఇస్రో ప్రణాళిక. దాని బరువు దాదాపు 52 టన్నుల దాకా ఉంటుందని అంచనా. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలాగానే.. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తూ ఉండే ఈ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టే యోచన ఉంది. బీఏఎస్‌లోకి వెళ్లే భారతీయ వ్యోమగాములు.. అక్కడే 3 నుంచి 6 నెలలపాటు పరిశోధనలు నిర్వహించేలా అందులో ఏర్పాట్లు చేయనున్నారు. 2028 డిసెంబరు నాటికి ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్ ద్వారా.. 10 టన్నుల బరువుండే మొదటి మాడ్యూల్‌ను లాంచ్ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. మిగతా మాడ్యూళ్లను.. తదుపరి తరం లాంచ్ వెహికల్ సూర్య ద్వారా రోదసిలోకి పంపి, ఒకదానికొకటి అనుసంధానం చేసి 2035 నాటికి పూర్తి చేయాలని ఇస్రో శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. భారతీయ అంతరిక్ష కేంద్రం తాలూకా డిజైన్లను పరిశీలిస్తున్నట్టు.. 2024లో జరిగిన 'ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్'లో ఇస్రో అప్పటి చీఫ్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. ఈ స్పేస్‌స్టేషన్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలను బెంగళూరులోని యూఆర్ రావ్ ఉపగ్రహ కేంద్రం, హార్డ్‌వేర్‌ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అందించనున్నట్టు తెలిపారు.




**ఏం చేస్తారంటే..**

ఇస్రో ప్రతిపాదనల ప్రకారం.. భారతీయ అంతరిక్ష కేంద్రం కొలతలు 27 మీటర్ల పొడుగు, 20 మీటర్ల వెడల్పు మేర ఉండనున్నాయి. అందులో గరిష్ఠంగా ఆరుగురు వ్యోమగాములు ఉండొచ్చు. సాధారణంగా ఇద్దరు నుంచి నలుగురు వ్యోమగాములు ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నారు. భూమికి 400 నుంచి 450 కిలోమీటర్ల ఎత్తున తిరిగే బీఏఎస్.. అమెరికన్, రష్యన్, జపనీస్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ స్పేస్‌పోర్టులకు అందుబాటులో ఉంటుంది. ఈ అంతరిక్ష కేంద్రంలో మన వ్యోమగాములు మైక్రో గ్రావిటీకి సంబంధించిన శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో కూడా డాక్ అయ్యేలా.. దీంట్లో ఒక యూనిక్ డాకింగ్ పోర్టును ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర సమయాల్లో వ్యోమగాముల ప్రాణాలను రక్షించుకునేందుకు.. శాశ్వతంగా డాక్ చేసిన 'సేఫ్టీ క్రూ మాడ్యూల్' కూడా ఇందులో ఉండనుంది. 2028లో లాంచ్ చేయనున్న మొదటి మాడ్యూల్‌లో సిబ్బంది ఉండడానికి అవసరమైన క్వార్టర్లు, ప్రాణాధార వ్యవస్థల వంటివి ఉండనున్నట్టు తెలుస్తోంది. ఆ తర్వాత వరుసగా.. బీఏఎస్-2 (కోర్-డాకింగ్ మాడ్యూల్), బీఏఎస్-03 (సైన్స్ రిసెర్చ్ మాడ్యూల్), బీఏఎస్-04 (లాబొరేటరీ మాడ్యూల్), బీఏఎస్-05 (కామన్ వర్కింగ్ మాడ్యూల్)లను దానికి అనుసంధానం చేస్తారు. అలాగే.. కొత్తగా వచ్చే మాడ్యూళ్ల బెర్తింగ్ కోసం రోబోటిక్ 'ఆర్మ్'ను కూడా ఏర్పాటు చేయనున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాలకు పైబడి సేవలందిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కూడా ఇలాగే దశలవారీగా నిర్మించారు. అదే మన సొంత అంతరిక్ష కేంద్రానికి స్ఫూర్తి.

### అంచెలంచెలుగా..

మానవుడు ఇప్పటిదాకా రోదసిలో నిర్మించిన అతి పెద్ద, అత్యంత బరువైన బాహుబలి కట్టడం.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్). భూమికి దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తున.. భూదిగువ కక్ష్యలో తిరుగుతూ ప్రతి 90 నిమిషాలకొకసారి భూమిచుట్టూ ప్రదక్షిణ చేసే కృత్రిమ ఉపగ్రహం ఈ ఐఎస్ఎస్! స్పేస్ రేసులో నువ్వా నేనా అంటూ పోటీపడిన అమెరికా, రష్యా.. భవిష్యత్తులో ఇతర గ్రహాల మీదకు వెళ్లడానికి, చంద్రుడి మీదకు చేపట్టబోయే యాత్రలకు ఒక బేస్ స్టేషన్‌లా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో వేర్వేరు స్పేస్ స్టేషన్ల నిర్మాణానికి నడుం బిగించాయి. కానీ పదేళ్లయినా అవి కార్యరూపం దాల్చకపోవడంతో అమెరికా తొలుత యూరప్ దేశాలతోపాటు, కెనడా, జపాన్ సహకారం తీసుకుంది. తర్వాత వాటితో రష్యా కూడా జత కలిసింది. అలా ఐఎస్ఎస్ నిర్మాణం 1998లో మొదలైంది. ఇటుకా ఇటుకా పేర్చి ఇల్లు కట్టినట్టు.. 18 మాడ్యూళ్ల సహా 43 ఎలిమెంట్లతో ఐఎస్ఎస్‌ను నిర్మించారు. దాని బరువు దాదాపు 4.2 లక్షల కిలోలు. అది ఆరు పడగ్గదుల ఇల్లంత విశాలంగా ఉంటుంది. అందులో ఆరు స్లీపింగ్ క్వార్టర్లు, రెండు బాత్‌రూమ్‌లు, ఒక జిమ్ ఉంటాయి. రోదసిలో సెకనుకు ఐదు మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. రోజులో దాదాపు 16సార్లు భూమిని చుట్టేస్తుంది. అయితే, అంతరిక్ష కేంద్రాల నిర్మాణానికి సంబంధించి చాలా దేశాలకు సొంత ప్రణాళికలు ఉన్నాయి. ఈ క్రమంలోనే.. 2030లో ఐఎస్ఎస్‌ను విచ్ఛిన్నం చేసేందుకు అమెరికా స్పేస్‌ఎక్స్ సంస్థతో రూ.7 వేల కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది.



# రిలయన్స్ లాభం ₹18,540 కోట్లు

## రూ.2.43 లక్షల కోట్లకు ఆదాయం

### కలిసివచ్చిన జియో టారిఫ్ పెంపు

### మళ్లీ పుంజుకున్న ఓ2సీ వ్యాపారం

### 'రిటైల్' విభాగమూ వృద్ధి పథంలోనే..

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) గాను రిలయన్స్ రూ.18,540 కోట్ల (ఒక్కో షేరుకు రూ.13.70) ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదు చేసిన రూ.17,265 కోట్ల (ఒక్కో షేరుకు రూ.12.76) లాభంతో పోలిస్తే 7.4% వృద్ధి కనబరిచింది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఆర్జించిన రూ.16,563 కోట్ల లాభంతో పోల్చినా గణనీయంగా పెరిగింది. సమీక్షా కాలానికి కంపెనీ నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 8% వృద్ధితో రూ.48,003 కోట్లుగా నమోదైంది. జియో టెలికాం సేవల టారిఫ్‌ల పెంపుతో పాటు చమురు శుద్ధి వ్యాపార మార్జిన్లు పుంజుకోవడం, రిటైల్ వ్యాపారమూ ఆశాజనక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు దోహదపడింది. కాగా, ఈ క్యూ3లో రిలయన్స్ ఆదాయం రూ.2.43 లక్షల కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రెవెన్యూ రూ.2.27 లక్షల కోట్లుగా ఉంది. ఈ డిసెంబరు చివరినాటికి కంపెనీ మొత్తం రుణ భారం రూ.3,50,453 కోట్లుగా నమోదైంది. ఆ సమయానికి కంపెనీ రూ.2,34,988 కోట్ల నగదు, నగదుకు సమానమైన నిల్వలను కలిగి ఉంది. దాంతో కంపెనీ నికర రుణ భారం రూ.1,15,465 కోట్లకు తగ్గింది.

#### ఓ2సీ

రిలయన్స్‌కు చెందిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) వ్యాపార విభాగ ఆదాయం ఈ క్యూ3లో 6 శాతం వృద్ధితో రూ.1,49,595 కోట్లకు చేరుకుంది. నిర్వహణ లాభం 2.4 శాతం పెరిగి రూ.14,402 కోట్లుగా నమోదైంది. నిర్వహణ లాభాల మార్జిన్ 9 శాతంగా నమోదైంది. దేశీయంగా బలమైన గిరాకీతో పాటు ఉత్పత్తి పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది.

#### ఆయిల్ అండ్ గ్యాస్

కంపెనీకి చెందిన ముడిచమురు, సహజ వాయువు అన్వేషణ, ఉత్పత్తి విభాగ ఆదాయం ఈ క్యూ3లో 5.2 శాతం తగ్గి రూ.6,370 కోట్లకు జారుకోగా.. నిర్వహణ లాభం 4.1 శాతం తగ్గుదలతో రూ.5,565 కోట్లకు పరిమితమైంది. ఏపీలోని కేజీ బేసిన్ నుంచి గ్యాస్ ఉత్పత్తి తగ్గడం ఇందుకు కారణమైంది.

#### జియో ప్లాట్‌ఫామ్స్

*టెలికాం సంస్థ రిలయన్స్ జియో సహా డిజిటల్ సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందికి చేర్చడం ద్వారా ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం ఈ క్యూ3లో 26 శాతం వృద్ధి చెంది రూ.6,861 కోట్లకు పెరిగింది. ఆదాయం 19.2 శాతం పెరిగి రూ.38,750 కోట్లకు చేరుకుంది. రిలయన్ జియో టారిఫ్ పెంపు ఇందుకు ప్రధానంగా దోహదపడింది. క్యూ3లో జియోకు ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పు) రూ.203.3కు చేరింది. కంపెనీ ఆర్పు రూ.200 స్థాయిని దాటడం ఇదే తొలి సారి. కాగా, డిసెంబరు చివరినాటికి జియో కస్టమర్ల సంఖ్య 48.2 కోట్లకు పెరిగింది.*

#### రిలయన్స్ రిటైల్

గడిచిన 3 నెలలకు రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లకు చేరుకోగా.. స్థూల ఆదాయం 8.7 శాతం పెరిగి రూ.90,333 కోట్లకు ఎగబాకింది. గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించినట్లు, దాంతో మొత్తం విక్రయ కేంద్రాల సంఖ్య 19,102కు చేరుకుందని సంస్థ తెలిపింది.




# 2025-26లో 20,000 నియామకాలు

### ఇన్ఫోసిస్ క్యాంపస్ హైరింగ్ ప్రణాళిక ఇది..

### ఈ క్యూ3లో రూ.6,806 కోట్లకు కంపెనీ లాభం

### ఆదాయ వృద్ధి అంచనా 4.5-5 శాతానికి పెంపు

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 20,000 మందికి పైగా ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు దేశీయ ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ వెల్లడించింది. కంపెనీ నియామకాల ప్రక్రియ ప్రణాళికకు అనుగుణంగా కొనసాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో 15,000కు పైగా నియామకాలు చేపట్టనున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఫ్రెషర్ల హైరింగ్ 20,000కు మించవచ్చని త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్క తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 5,591 పెరుగుదలతో మొత్తం 3,23,379కి చేరుకుంది. సంస్థలో ఉద్యోగుల సంఖ్య పెరగడం వరుసగా ఇది రెండోసారి. కాగా, క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13.7 శాతానికి పెరిగింది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో అట్రిషన్ రేటు 12.9 శాతంగా నమోదైంది.

#### నికర లాభంలో 11.5 శాతం వృద్ధి

ఈ క్యూ3లో ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 11.46 శాతం వృద్ధి చెంది రూ.6,806 కోట్లకు చేరుకుంది. ఆదాయం 7.58 శాతం పెరిగి రూ.41,764 కోట్లుగా నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను క్యూ2 త్రైమాసిక ఫలితాల సందర్భంగా ప్రకటించిన 3.75-4.5 శాతం నుంచి తాజాగా 4.5-5 శాతానికి పెంచింది. వరుసగా మూడు త్రైమాసికాలుగా కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను పెంచుకుంటూ వస్తోంది. నిర్వహణ లాభాల మార్జిన్‌ను మాత్రం గతంలో అంచనా వేసిన 20-22 శాతంగానే కొనసాగించింది. క్యూ3 ఆదాయంలో ఆర్థిక సేవల రంగం నుంచి సమకూరిన వాటా 27.8 శాతంగా ఉండగా.. మాన్యుఫాక్చరింగ్ రంగ వాటా 15.5 శాతంగా నమోదైంది. రిటైల్, ఎనర్జీ రంగాలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రాంతాలవారీగా చూస్తే.. భారత్, ఐరోపా మార్కెట్ల నుంచి సమకూరిన ఆదాయంలో రెండంకెల వృద్ధి నమోదైంది. కంపెనీకి కీలక మార్కెట్ అయిన ఉత్తర అమెరికా నుంచి ఆదాయం కేవలం 5 శాతం పెరిగింది.

#### హెచ్1బీ వీసాలపై ఆధారం తగ్గింది..

అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక హెచ్1బీ వీసా నిబంధనలను కఠినతరం చేయవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ, తమపై పెద్దగా ప్రభావం ఉండబోదని దేశీయ ఐటీ కంపెనీలంటున్నాయి. గడిచిన కొన్నేళ్లలో హెచ్1బీ వీసాలపై ఆధారపడటం గణనీయంగా తగ్గిందని ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ అన్నారు. అన్నిటికంటే ముందుగా, ఆన్‌సైట్‌లో కంపెనీ హెచ్1బీ వీసాపై పనిచేసే వారి నిష్పత్తి గతంలో 30 శాతంగా ఉండగా.. ఇప్పుడది 24 శాతానికి తగ్గిందన్నారు. ప్రస్తుతం అమెరికా ఆన్‌సైట్ ప్రాజెక్టుల్లో హెచ్1బీ ఇండిపెండెంట్ ఉద్యోగుల వాటా 60 శాతానికి మించిందన్నారు.

# ఆటో ఎక్స్‌పోలో 100 కొత్త కార్లు విడుదల

### నేడే ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో రెండో ఎడిషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. వచ్చే బుధవారం (22వ తేదీ) వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో వివిధ కంపెనీలు 100 కొత్త కార్లను విడుదల చేయవచ్చని అంచనా. ఆటోమొబైల్ తయారీదారుల నుంచి ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, టైర్లు, ఇంధన స్టోరేజీ వ్యవస్థల తయారీదారులు, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మెటీరియల్ రీసైక్లింగ్ చేసే సంస్థల వరకు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. న్యూఢిల్లీలోని భారత మండపం, ద్వారకలోని యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఢిల్లీ అండ్ ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్‌ల్లో సమాంతరంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. 5,100 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటాయని భావిస్తున్న ఈ ప్రదర్శనను భారత్ సహా ప్రపంచ దేశాలకు చెందిన 5 లక్షల మంది సందర్శించే అవకాశం ఉంది. అలాగే జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, తైవాన్, యూకే పెవిలియన్లుంటాయి.

#### ప్రపంచ మార్కెట్లోకి సుజుకీ ఈ-విటారా

జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ చిన్న విద్యుత్ కార్ల విభాగంలోకి ప్రవేశించనున్నట్లు తెలిపింది. కంపెనీకి చెందిన తొలి విద్యుత్ కారు ఎస్‌యూవీ ఈ-విటారాను ఈ ప్రదర్శన ద్వారా ప్రపంచ మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఈ కారు ఉత్పత్తితో సాధించిన అనుభవాన్ని ఆసరా చేసుకుని భారత్‌ను తమ విద్యుత్ కార్ల తయారీ కేంద్రంగా చేయాలనుకుంటున్నట్లు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు. ద్విచక్ర వాహనాల నుంచి కార్ల యజమానులు కావాలనుకుంటున్న వంద కోట్ల మంది జనాభాకు అందుబాటు ధరల్లో చిన్న కార్లు అవసరమన్నారు. అందుకే చిన్న కార్ల విభాగంలో కూడా ఈవీలు తయారుచేయాలన్నది తమ లక్ష్యమని చెప్పారు.

# మళ్లీ 77,000 పైకి సెన్సెక్స్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభపడింది. గురువారం సెన్సెక్స్ 318.74 పాయింట్ల లాభంతో మరోసారి 77,000 పాయింట్ల కన్నా పైన 77,042.82 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.60 పాయింట్ల లాభంతో 23,311.80 వద్ద క్లోజైంది.

**21 పైసలు నష్టపోయిన రూపాయి:** ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరోసారి క్షీణతను నమోదు చేసింది. డాలర్ మారకంలో 21 పైసలు నష్టపోయి 86.61 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 86.37 డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకింది.

#### భారత్‌పై చైనా 'వాణిజ్య' యుద్ధం

న్యూఢిల్లీ: చైనా.. మన దేశంపై వాణిజ్య యుద్ధం ప్రారంభించింది. మన దేశ ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు (ఈవీ), సౌర విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించే సోలార్ మాడ్యూల్స్ తయారీకి అవసరమైన కీలక ముడి పదార్థాలు, యంత్రపరికరాల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. దీంతో ఈ రంగాలకు చెందిన కంపెనీలు ముడి పదార్థాలు, యంత్ర పరికరాలు లభించక ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నాయి. తన పెట్టుబడులపై భారత్ విధించిన ఆంక్షలకు ప్రతిగా చైనా ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు. ఈ చర్యలకు బెదిరిపోకుండా జపాన్, దక్షిణ కొరియా దేశాల నుంచి భారత్ ఈ ముడి పదార్థాలు, యంత్రాలు దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నించాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ సూచించారు.

# రూపాయల్లో విదేశీ చెల్లింపులకు లైన్ క్లియర్

ముంబై: విదేశీ చెల్లింపుల లావాదేవీలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరింత సులభతరం చేసింది. ఇందుకోసం 1999 నాటి విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనలను సవరించింది. దీంతో కొన్ని అంతర్జాతీయ చెల్లింపులు మన రూపాయలు లేదా ఆయా దేశాల కరెన్సీల్లో చెల్లించేందుకు అవకాశం ఏర్పడింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు నేలచూపులు చూస్తున్న సమయంలోనే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. స్థానిక కరెన్సీల్లో చెల్లింపులను అనుమతించేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే యూఏఈ, ఇండోనేషియా, మాల్దీవులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వాణిజ్య లావాదేవీల్లో రూపాయి చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ 2022 జూలైలోనే స్పెషల్ రూపీ వోస్ట్రో అకౌంట్ (ఎస్ఆర్‌వీఏ) పేరుతో ప్రత్యేక ఖాతా తీసుకొచ్చింది. దాంతో అనేక విదేశీ బ్యాంకులు భారత్‌లోని బ్యాంకుల్లో ఈ ఖాతాలు తెరిచాయి.

# క్విక్ కామర్స్‌లోకి స్పెన్సర్స్

కోల్‌కతా: ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్‌నకు చెందిన స్పెన్సర్స్ రిటైల్ సైతం క్విక్ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. వ్యాపార వృద్ధితో పాటు మళ్లీ లాభాల బాట పట్టేందుకు జిఫీ పేరుతో క్విక్ కామర్స్ సేవలను తొలుత పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభించినట్లు స్పెన్సర్స్ తెలిపింది. కస్టమర్లకు స్పెన్సర్స్ స్టోర్ల నుంచి 20-30 నిమిషాల్లో సరుకులను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది.

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 117 | విజయవాడ | 131 |
| వరంగల్ | 117 | గుంటూరు | 130 |
| కరీంనగర్ | 117 | ఒంగోలు | 130 |
| మహబూబ్‌నగర్ | 117 | చిత్తూరు | 102 |
| కర్నూలు | 117 | నెల్లూరు | 107 |
| విశాఖపట్నం | 127 | అనంతపురం | 107 |
| గోదావరి | 131 | | |

**ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)**

| 17వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 470 | విజయవాడ | 500 |
| వరంగల్ | 472 | గోదావరి | 495 |
| చిత్తూరు | 503 | విశాఖపట్నం | 500 |
| | | దజను గుడ్లు రూ. 72 | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80,620 ▲ | 73,900 ▲ | 1,03,000 ▲ |
| విజయవాడ | 81,420 ▲ | 77,000 ▲ | 93,000 ▲ |
| విశాఖపట్నం | 79,220 ▲ | 72,620 ▲ | 93,150 ▲ |
| రాజమండ్రి | 80,620 ▲ | 73,900 ▲ | 91,600 ▲ |
| ప్రొద్దుటూరు | 80,000 ▲ | 74,170 ▲ | 93,800 ▲ |
| ముంబై | 79,184 ▲ | 72,533 ▲ | 91,784 ▲ |

స్పోర్ట్స్

# మెద్వెదెవ్ అవుట్

ఆస్ట్రేలియన్ ఓపెన్





ఎమ్మా రదుకాను

### అమెరికా టీనేజర్ లెర్నర్ టీన్ సంచలన విజయం

### మూడోరౌండ్లో స్వియటెక్‌తో రదుకాను ఢీ ▸సిన్నర్, టేలర్ ముందంజ



టీన్

మెల్‌బోర్న్: సాఫీగా సాగుతున్న ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు పెద్ద ఝలక్. స్టార్లంతా జోరు ప్రదర్శిస్తున్న వేళ ఐదోసీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు షాక్ తగిలింది. అమెరికన్ టీనేజర్, 19 ఏళ్ల లెర్నర్ టీన్ రెండోరౌండ్‌లో నిరుటి రన్నరప్ డానిల్‌ను కంగుతినిపించాడు. ఇక మహిళల 2వ సీడ్ ఇగా స్వియటెక్, 4వ సీడ్ పోలిని, 6వ సీడ్ రిబకినా, 2021 యూఎస్ ఓపెన్ విజేత ఎమ్మా రదుకాను మూడో రౌండ్‌లో ప్రవేశించారు.

**డానిల్ ఐదు సెట్లు పోరాడినా..:** గత ఏడాదేకాదు.. 2021, 2022లోనూ మెల్‌బోర్న్ పార్క్‌లో ఫైనల్లో భంగపడిన మెద్వెదెవ్(రష్యా) ఈసారి ఎలాగైనా టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో బరిలో దిగాడు. కానీ గురువారం జరిగిన దాదాపు ఐదు గంటల పోరులో క్వాలిఫయర్ లెర్నర్ 6-3, 7-6 (4), 6-7 (10), 1-6, 7-6 (7)తో 28 ఏళ్ల మెద్వెదెవ్‌కు షాకిచ్చాడు. ఈ క్రమంలో 1990లో సంప్రాస్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పిన్న వయస్సులో మూడోరౌండ్ చేరిన అమెరికన్‌గా లెర్నర్ రికార్డు సృష్టించాడు. టాప్‌సీడ్ సిన్నర్ 4-6, 6-4, 6-1, 6-3తో ట్రిస్టాన్‌ను, ఫ్రిట్జ్ 6-2, 6-1, 6-0తో క్రిస్టియన్‌ను, డిమినార్ 6-2, 6-4, 6-3తో బోయర్‌ను, 13వ సీడ్ హోల్గర్ రూన్ 7-6, (3), 2-6, 6-3, 7-6 (6)తో బెరెటినిని ఓడించి మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు.

**ఎమ్మాతో ఇగా పోరు:** మహిళల ఫేవరెట్ ఇగా స్వియటెక్ 6-0, 6-2తో రెబెకా స్రంకోవాపై గెలిచింది. తదుపరి రౌండ్‌లో ఎమ్మా రదుకానుతో స్వియటెక్ తలపడుతుంది. 22 ఏళ్ల బ్రిటన్ ప్లేయర్ రదుకాను 6-3, 7-5తో అమండాపై గెలిచింది. 4వ సీడ్ పోలిని 6-2, 6-3తో రెనటాపై, 6వ సీడ్ రిబకినా 6-0, 6-3తో జోవిక్‌పై, 8వ సీడ్ ఎమ్మా నవారో 6-3, 3-6, 6-4తో వాంగ్ షియుపై, 9వ సీడ్ కసట్కినా 6-2, 6-0తో యఫాన్‌పై, కొలిన్స్ 7-6 (4), 4-6, 6-2తో అయావాపై నెగ్గారు.

**బాలాజీ జోడీ శుభారంభం:** పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన శ్రీరామ్ బాలాజీ జోడీ/మిగ్వెల్ ఆంజెల్ (మెక్సికో) ద్వయం 6-4, 6-3తో డచ్, కజక్ జంట రాబిన్/అలెగ్జాండర్‌పై గెలుపొందింది.

# క్వార్టర్స్‌కు కిరణ్, సింధు

▸ డబుల్స్‌లో సాత్విక్ జోడీ

▸ ఇండియా ఓపెన్





న్యూఢిల్లీ: స్టార్ షట్లర్ పీవీ సింధు, యువ ఆటగాడు కిరణ్ జార్జ్ సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్‌లో అదరగొడుతున్నారు. సింగిల్స్‌లో వీరు క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఇక, పురుషుల డబుల్స్‌లో భారత ఏస్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి కూడా ప్రీక్వార్టర్స్‌ను అధిగమించారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-15, 21-13తో మనామి సుయిజు (జపాన్)ను చిత్తుచేయగా.. కిరణ్ 22-20, 21-13తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. హోరాహోరీగా సాగిన పురుషుల డబుల్స్ పోరులో 2022 విజేత సాత్విక్/చిరాగ్ ద్వయం 20-22, 21-14, 21-16తో జపాన్ జంట మిత్సు హషి/ఒకమురను ఓడించింది. మహిళల డబుల్స్‌లో భారత జోడీ అశ్వినీ పొన్నప్ప/తనీషా 9-21, 21-23తో జపాన్ ద్వయం మత్సుమొటొ/ఫకషిమ చేతిలో, అశ్వినీ భట్/శిఖా గౌతమ్ జంట 7-21, 10-21తో చైనా జోడీ యాన్ లి/గ్వా లూవో చేతిలో ఓడారు. క్వార్టర్స్‌లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియాతో సింధు, హాంగ్ యాంగ్ (చైనా)తో కిరణ్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

# బరిలో గుకేష్, అర్జున్, హరికృష్ణ

### నేటినుంచి టాటా చెస్

విక్‌ాన్ జీ (నెదర్లాండ్స్): భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ప్రపంచ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాక తొలి టోర్నమెంట్‌కు సిద్ధమయ్యాడు. శుక్రవారం నుంచి ఇక్కడ జరిగే ప్రతిష్ఠాత్మక టాటా స్టీల్ చెస్ టోర్నీ బరిలో దిగుతున్నాడు. గత డిసెంబరులో సింగపూర్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో డింగ్ లిరెన్‌ను ఓడించి గుకేష్ విశ్వవిజేతగా నిలిచాడు. తదనంతరం న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌కు అతడు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇక, టాటా స్టీల్ చెస్‌లో గుకేష్‌తో పాటు మాస్టర్స్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, హరికృష్ణ తలపడుతున్నారు. చాలెంజర్స్ విభాగంలో గ్రాండ్‌మాస్టర్లు విభాగంలో వైశాలీ, దివ్యా దేశ్‌ముఖ్ పోటీలో ఉన్నారు.

# వచ్చేనెల 14 నుంచి డబ్ల్యూపీఎల్


న్యూఢిల్లీ: మూడో అంచె మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) షెడ్యూల్‌ను బీసీసీఐ గురువారం ప్రకటించింది. వచ్చేనెల 14న లీగ్ మొదలవనుంది. బరోడా, బెంగళూరు, ముంబై, లఖ్‌నవూ స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. బరోడాలో జరిగే ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ తలపడనుంది. మార్చి 15న ఫైనల్ జరగనుంది. లీగ్‌లో చివరి 2 మ్యాచ్‌లతో పాటు ఎలిమినేటర్ (మార్చి 13న), ఫైనల్ పోరుకు ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. గుజరాత్, బెంగళూరుతో పాటు ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ టోర్నీలో పోటీపడుతున్న జట్లు.

#### 'హజారే' టైటిల్‌పోరుకు విదర్భ

వడోదర: విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ జట్టు ఫైనల్ చేరింది. గురువారం ఇక్కడ జరిగిన రెండో సెమీఫైనల్లో విదర్భ 69 పరుగుల తేడాతో మహారాష్ట్రను ఓడించింది. శనివారం జరిగే టైటిల్ పోరులో కర్ణాటకతో విదర్భ తలపడనుంది. ఇక, మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ.. ఓపెనర్లు ధ్రువ్ షోరే (114), యష్ రాథోడ్ (116) సూపర్ సెంచరీలకు తోడు టాపార్డర్ బ్యాటర్లు కరుణ్ నాయర్ (88 నాటౌట్), జితేష్ శర్మ (51) మెరుపు ఇన్నింగ్స్‌తో సత్తా చాటడంతో 50 ఓవర్లలో 3 వికెట్లకు 380 పరుగుల భారీస్కోరు చేసింది. ఛేదనలో మహారాష్ట్ర.. ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (90), మిడిలార్డర్‌లో అంకిత్ బావ్నే (50) అర్ధసెంచరీలతో పోరాడినా 50 ఓవర్లలో 311/7 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. విదర్భ బౌలర్లలో దర్శన్, నచికేత్ చెరో మూడు వికెట్లు తీశారు.

#### ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో భారత్ కెప్టెన్ సచిన్

ముంబై: మాజీ స్టార్లు పోటీపడుతున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో భారత జట్టుకు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సారథ్యం వహించనున్నాడు. సునీల్ గవాస్కర్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఈ టోర్నీ వచ్చేనెల 22 నుంచి మార్చి 16 వరకు భారత్ వేదికగా జరగనుంది.



# శెభాష్.. నితీష్

క్రికెటర్‌కు సీఎం చంద్రబాబు అభినందన

▸ తెలుగోడి సత్తా చాటావన్న మంత్రి లోకేశ్

అమరావతి/మంగళగిరి (ఆంధ్రజ్యోతి): జాతీయ జట్టులో అద్భుతంగా రాణిస్తున్నావంటూ తెలుగు క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్నితో కలిసి నితీష్ సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా నితీష్‌ను సీఎం అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇదేస్థాయి ప్రదర్శన చూపాలని సీఎం తనతో చెప్పారని చంద్రబాబుతో భేటీ అనంతరం నితీష్ మీడియాతో పేర్కొన్నాడు. ఆ తర్వాత మంత్రి నారా లోకేశ్‌తో కూడా నితీష్ భేటీ అయ్యాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో సూపర్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకొని తెలుగోడి సత్తా చాటావని నితీష్‌ను మంత్రి లోకేశ్ కొనియాడారు.

# బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్‌ను నియమించారు. ఇంగ్లండ్‌తో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం ఈ ఎంపిక జరిగింది. 2019 నుంచి తను జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో సేవలందిస్తున్నాడు. అలాగే అనేకసార్లు భారత్ 'ఎ' జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. ఈనెల 22 నుంచి జరిగే ఐదు టీ20ల సిరీస్ కోసం కోటక్ 18న భారత శిబిరంలో చేరనున్నాడు. ప్రస్తుతం ప్రధాన కోచ్‌గా ఉన్న గంభీర్‌కు కోటక్ ఐదో సహాయక కోచ్ కానున్నాడు. ఇప్పటికే అభిషేక్ నాయర్, డస్కటే అసిస్టెంట్ కోచ్‌లుగా ఉండగా, మోర్కెల్ బౌలింగ్ కోచ్, దిలీప్ ఫీల్డింగ్ కోచ్‌లుగా ఉన్నారు. ఆసీస్ టూర్‌లో భారత టెస్టు జట్టు వైఫల్యంపై గత వారం సమీక్ష జరిగింది. ఇందులో గంభీర్ తమకు స్పెషలిస్ట్ బ్యాటింగ్ కోచ్ అవసరం ఉందని బోర్డుకు తెలిపినట్టు సమాచారం.

**బీసీసీఐ అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ అరుణ్ మిశ్రా:** సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రాను బీసీసీఐ అంబుడ్స్‌మన్‌గా నియమించారు. అలాగే ఆయన బోర్డు ఎథిక్స్ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు. ఆరేళ్లపాటు అత్యున్నత కోర్టు జడ్జిగా కొనసాగిన మిశ్రా.. ఆ తర్వాత మూడేళ్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా ఉన్నారు.

#### ఇంగ్లండ్ టూర్‌లో మూడు ప్రాక్టీస్ మ్యాచ్‌లు

వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల చేతిలో భారత జట్టు టెస్టు సిరీస్‌లను కోల్పోయి విమర్శలపాలైంది. ఇక ఐపీఎల్ ముగిశాక 5 టెస్టుల సిరీస్ కోసం టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. జూన్ 20న మొదలయ్యే ఈ సుదీర్ఘ సిరీస్‌కు పక్కా వ్యూహంతో బరిలోకి దిగాలని బీసీసీఐ భావిస్తోంది. ఈనేపథ్యంలో ఇంగ్లండ్ లయన్స్‌తో 3 ప్రాక్టీస్ మ్యాచ్‌లను ఆడించాలనుకుంటోంది. నాలుగేసి రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌ల ద్వారా భారత ఆటగాళ్లకు అక్కడి వాతావరణం, పిచ్‌లపై చక్కటి అవగాహన ఏర్పడగలదని బోర్డు భావిస్తోంది. మే 25 తర్వాతే ఆటగాళ్లు ఇంగ్లండ్ వెళతారు. అయితే వామప్ మ్యాచ్‌ల షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

# ఫ్యామిలీని పక్కనబెట్టండి

### క్రికెటర్లకు బీసీసీఐ ఆంక్షలు?



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో భారత క్రికెట్ జట్టును వరుస ఓటములు వెంటాడుతున్నాయి. స్వదేశంలో కివీస్‌పై వైట్‌వాష్‌తో పాటు ఆసీస్ పర్యటనలో సిరీస్ ఓటమితో అంతటా తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. దీంతో జట్టును గాడిన పెట్టేందుకు బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. దీంట్లో భాగంగా విదేశీ పర్యటనలో క్రికెటర్లు తమ కుటుంబ సభ్యులను వెంట తీసుకురావడంపై ఆంక్షలు విధించనుంది. కోచ్ గంభీర్ ఈ మార్పుల కోసం గట్టిగా పట్టుబట్టినట్టు తెలుస్తోంది. అందుకే కొవిడ్ ముందున్న నిబంధనలను అమల్లోకి తేవాలనుకుంటోంది. ఇప్పటివరకు క్రికెటర్లు సిరీస్ ఆరంభం నుంచి ముగింపు వరకు భార్యా పిల్లలతో గడిపేవారు. కానీ ఇకపై 45 రోజుల పర్యటన ఉంటే కుటుంబ సభ్యులతో రెండు వారాల కంటే ఎక్కువ సమయం గడిపేందుకు ఆటగాళ్లకు అనుమతి ఇవ్వరని సమాచారం. అలాగే టోర్నీ అంతకన్నా తక్కువ రోజుల్లో ముగిస్తే వారం మాత్రమే పర్మిషన్ ఇస్తారు. అంతేకాకుండా జట్టు ఆటగాళ్ల ప్రయాణాలపైనా ఆంక్షలు ఉండబోతున్నాయి. ఆటగాళ్లంతా ఎవరికి వారు కాకుండా టీమ్ బస్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది. ప్రత్యేక వంటవారు, హెయిర్‌డ్రెస్సర్లకు అనుమతి ఉండదు. మరోవైపు దేశవాళీ టోర్నీల్లో ఆడని టీమిండియా ఆటగాళ్ల వేతనాల్లో కూడా కోత విధించాలని ఓ సీనియర్ ప్లేయర్ బోర్డుకు సూచించాడని సమాచారం.





కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్ భవన సముదాయం, సిబ్బంది నివాసాలు. వీటిని ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు.

# రేపు రాష్ట్రానికి అమిత్ షా



అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. ఢిల్లీ నుంచి సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి రాత్రి 8.30కి విజయవాడ విమానాశ్రయంలో దిగుతారు. రోడ్డు మార్గంలో ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి 9 గంటలకు చేరుకుంటారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ముఖ్య నేతలతో కలిసి భోజనం చేస్తారు. కూటమి ప్రభుత్వ పాలన, రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన సహకారం , ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారు. రాత్రి 10.30కు విజయవాడలోని నోవాటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడే రాత్రి బస చేస్తారు. 19వ తేదీ ఉదయం బీజేపీ రాష్ట్ర నేతలతో కాసేపు సమావేశమవుతారు. 11.30కు కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్‌కు చేరుకుంటారు. అక్కడ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్ఐడీఎం) సౌత్ క్యాంపస్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసే సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర హోం మంత్రి అనిత, ఎన్డీఆర్ఎఫ్ డీజీ పీయూష్ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పాల్గొంటారు. విభజన చట్టం ప్రకారం ఎన్ఐడీఎం ప్రాంగణానికి విజయవాడ సమీపంలో 2018 మే 22న అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. పదెకరాల ఈ ప్రాంగణంలో ప్రధాన భవనంతోపాటు శిక్షణా కేంద్రం, ఐటీ విభాగం, ఇతర అనుబంధ కార్యాలయాల నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ఎన్ఐడీఎం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసుకుని పనిచేస్తోంది.

## దళిత యువతతో కలిసి భోంచేయాలి

» 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' విజయవంతం కావాలి: పురందేశ్వరి



అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఆదివాసీ మహిళ దేశ అత్యున్నత పీఠంపై కూర్చున్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన సామాన్యుడు ప్రధాని అయి దేశానికి సేవ చేస్తున్నారు. ఇదంతా డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఫలితమే. అటువంటి రాజ్యాంగ నిర్మాతను కాంగ్రెస్ మోసగించింది. దీనిని రాష్ట్రంలోని ప్రతి ఊరు, వాడలో ప్రజలకు వివరించాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 11 నుంచి 25 వరకూ బీజేపీ నిర్వహిస్తోన్న 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎలా నిర్వహించాలనే అంశంపై గురువారం విజయవాడలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'బీజేపీ కార్యకర్తలు, స్థానిక నేతలు తమ పరిధిలోని హరిజనవాడలకు వెళ్లాలి. దళిత యువతతో సహపంక్తి భోజనాలు చేయాలి. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించి మోసం చేసిన తీరును వివరించాలి' అని సూచించారు.

## 25 వరకు టీడీపీ ప్రజావేదిక షెడ్యూల్

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 17 నుంచి 25 వరకు ప్రజావేదిక కార్యక్రమంలో పలువురు మంత్రులు, పార్టీ నాయకులు పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. శుక్రవారం, 17వ తేదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, 18న మంత్రి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, 20న మంత్రి జనార్ధన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షరీఫ్, పీవీజీ కుమార్, 21న మంత్రి పార్థసారధి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, 22న మంత్రి అనిత, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, 23న మంత్రి రవికుమార్, చీఫ్ విప్ అనురాధ, 24న మంత్రి సవిత, పల్లా శ్రీనివాసరావు, దేవేంద్రప్ప, 25న మంత్రి బాలవీరాంజనేయ స్వామి, పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రామారావు హాజరుకానున్నారు.

### రేపు ఎన్టీఆర్ 28వ వర్ధంతి

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ 28వ వర్ధంతిని 18న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులర్పించాలని సూచించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## భిన్నాభిప్రాయాలున్నా కలిసికట్టుగా సాగాలి: నాదెండ్ల




ఏలూరు రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'కూటమిలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయినా దేశం, రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకొని వెళ్లాలి. కూటమి నేతలతో కలిసికట్టుగా, సమన్వయంతో సాగాలి' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన సభ్యత్వం కలిగి వివిధ కారణాలతో మృతి చెందిన 19 మంది కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం ఏలూరు టుబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'నామినేటెడ్ పోస్టులు రావడం లేదని ఎవరూ అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికీ వస్తాయి. జనసేన నాయకులు, కార్యకర్తలు ఓపిక, సహనంతో ఉండి పవన్ కల్యాణ్ ఆదేశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. త్వరలో కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు అందజేస్తాం. ఎవరికైనా అన్యాయం జరిగితే నా దృష్టికి తీసుకురండి' అని అన్నారు. సమావేశంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల జనసేన నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు విశ్వసనీయత లేదు: దినకర్

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయత కోల్పోయిందని బీజేపీ అధికార ప్రతినిధి, 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. మన దేశ ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం మంచి పాలనను రామరాజ్యంగా పిలుస్తారని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్య రామాలయ నిర్మాణంపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యల స్ఫూర్తి చాలా ముఖ్యమైందన్నారు. హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత రాహుల్ గాంధీ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ మరో అపజయాన్ని చవిచూసేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారన్నారు. తమ వైఫల్యాన్ని పక్కదోవ పట్టించే ఉద్దేశంతో ఆరెస్సెస్, భాగవత్‌లను కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుందని ధ్వజమెత్తారు.

# ఆంధ్ర పిటిషన్లపై విడివిడిగా విచారణ

» బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 నిర్ణయం
» తొలుత 2023 కేంద్ర గెజిట్‌పై వాదనలు
» తర్వాత ప్రాజెక్టులకు నీటి కేటాయింపులపైన..
» ఫిబ్రవరి 19 నుంచి 21 దాకా విచారిస్తామని ట్రైబ్యునల్ స్పష్టీకరణ



అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 వెలువరించింది. రాష్ట్రం కోరుతున్నట్లుగా 2023లో కేంద్రం జారీ చేసిన గెజిట్ పైన.. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీ కేటాయింపులపైన వేర్వేరుగా విచారణ జరుపుతామని వెల్లడించింది. ఈ అంశాలపై వచ్చే నెల 19 నుంచి 21 దాకా మూడ్రోజుల పాటు ఆంధ్ర, తెలంగాణ వాదనలు వింటామని స్పష్టం చేసింది. గురువారం ఢిల్లీలో ట్రైబ్యునల్ విచారణ చేపట్టింది. రెండు రాష్ట్రాల పిటిషన్లను పరిశీలించిన తర్వాత.. తొలుత సెక్షన్ 3 కింద కేంద్రం జారీ చేసిన గెజిట్ మేరకు రాష్ట్రాలవారీ నీటి కేటాయింపులపై విచారణ జరుపుతామని.. తర్వాత విభజన చట్టం సెక్షన్ 89 మేరకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులపై విచారిస్తామని తేల్చిచెప్పింది. ఉమ్మడి రాష్ట్రానికి ట్రైబ్యునల్-1 (బచావత్) కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో.. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించారు. ప్రస్తుతం ఇదే అమలవుతోంది. దీనిని తెలంగాణ వ్యతిరేకిస్తోంది. తనకు సగం వాటా రావాలంటోంది. అలాగే విభజన చట్టం ప్రకారం నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టులకే నీటి కేటాయింపులు చేయాలని ఆంధ్రప్రదేశ్ పట్టుబడుతోంది. దీనినీ తెలంగాణ వ్యతిరేకిస్తోంది. గురువారంనాటి విచారణలో.. తాను వేసిన రెండు పిటిషన్లపై విడివిడిగా విచారణ జరపాలని ఏపీ విజ్ఞప్తి చేయగా.. తెలంగాణ మాత్రం తన పిటిషన్లపై ఒకేసారి వాదనలు వినాలని పట్టుబట్టింది. ఆంధ్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు జయదీప్ గుప్తా, ఉమాపతి వాదనలు వినిపించారు. రెండు రాష్ట్రాలూ వేసిన పిటిషన్లను పరిశీలించి.. రాష్ట్ర విభజన చట్టానికి.. కేంద్రం జారీ చేసిన గెజిట్‌కు మధ్య వ్యత్యాసాన్ని గమనించి.. ఏ కేసుకు ఆ కేసును విడివిడిగా పరిగణించాలని ట్రైబ్యునల్‌ను అభ్యర్థించారు. ఇదే సందర్భంగా తెలంగాణ అదనపు పత్రాలు సమర్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనలు ఇంకా ప్రారంభం కాకముందే.. సరైన సమయం రాకుండానే అదనపు పత్రాలను ప్రవేశపెట్టడాన్ని ఆక్షేపించారు. వాదనలు మొదలయ్యాక మాత్రమే రెండు రాష్ట్రాలూ అవసరమైన పత్రాలను అదనంగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. రెండు రాష్ట్రాల వాదనలు ఆలకించిన ట్రైబ్యునల్.. విభజన చట్టం 89వ సెక్షన్ పరిధిలోని ప్రాజెక్టులకు కేటాయింపులు, 2023లో కేంద్రం జారీ చేసిన గెజిట్ ప్రకారం పంపకాల పునఃసమీక్షపైనా విడివిడిగా వాదనలు వింటామని తెలిపింది. వచ్చే నెల 19 నుంచి 21వ తేదీదాకా మూడు రోజుల పాటు విచారణ జరుపుతామంటూ వాయిదా వేసింది.

### మళ్లీ సుప్రీంకు ఏపీ!

కేంద్రం 2023లో ఇచ్చిన గెజిట్‌లోని విధివిధానాలపై ఆంధ్రప్రదేశ్ ఇదివరకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ట్రైబ్యునల్-2ను కొనసాగిస్తూ.. నీటి కేటాయింపులపై పునఃసమీక్ష చేయాలన్న కేంద్రం ఆదేశాలను సవాల్ చేసింది. ట్రైబ్యునల్-2 కొనసాగింపుపై స్టే ఇవ్వాలని కోరింది. స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ కేసులో తన తుది తీర్పునకు లోబడే ట్రైబ్యునల్-2 తీర్పు అమలవుతుందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఒకవైపు ట్రైబ్యునల్-2లో వాదనలు వినిపిస్తూనే.. ట్రైబ్యునల్-2 కొనసాగింపుపై స్టే ఇవ్వాలంటూ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్రం భావిస్తోంది. కాగా.. కృష్ణా జలాల్లో తన వాటా 512 టీఎంసీలను కొనసాగించాలని ట్రైబ్యునల్ ముందు గట్టిగా వాదించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమవుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే దక్కుతాయని తెలియజేయనుంది. అదేవిధంగా రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నిర్మించిన ప్రాజెక్టులన్నీ ఆమోదం పొందనవి అనేది గుర్తించాలని స్పష్టం చేయనుంది.

## తులసిబాబు పిటిషన్‌లో ప్రతివాదిగా చేర్చుకోండి

» వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వండి
» డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఇంప్లీడ్ పిటిషన్
» బెయిల్ పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ నిందితుడు కామేపల్లి తులసిబాబు దాఖలు చేసిన పిటిషన్‌లో తనను ప్రతివాదిగా చేర్చుకొని వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ కస్టడీలో తనను చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తుల వివరాలు వెల్లడి కావాలంటే తులసిబాబు కస్టోడియల్ విచారణ అవసరమని పేర్కొన్నారు. పోలీసులతో ఆయన దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, తనను లక్ష్యంగా చేసుకొనే ప్రమాదం ఉందని, పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నరసాపురం ఎంపీ అయిన తనను సీఐడీ పోలీసులు కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని రఘురామ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో నిందితుడు కామేపల్లి తులసిబాబును పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా నిందితుడికి 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తులసిబాబు గత శుక్రవారం అత్యవసరంగా హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం హైకోర్టులో విచారణకు రానుంది.

## నాటు ఆవుకు పుంగనూరు జత

### 80 శాతం పోలికలతో పుట్టిన కోడెదూడ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 16: ఒంగోలు జాతి నాటు ఆవుకు పుంగనూరు జాతి ఎద్దు వీర్యంతో జత కట్టించగా.. 80 శాతం పుంగనూరు జాతి పోలికలున్న కోడెదూడ పుట్టింది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని శ్రీపురంధరపురం (శ్రీహరికోట) గ్రామానికి చెందిన రైతు ఆవుల మల్లికార్జునరెడ్డి కుమారుడు మణిదీప్‌రెడ్డి రెండేళ్ల క్రితం రాజమండ్రి నుంచి ఒంగోలు జాతి నాటు ఆవుకు పుంగనూరు జాతి ఎద్దుతో జతకట్టించగా పుట్టిన పెయ్యి దూడను రూ.35 వేలకు కొనుగోలు చేసి గంగ అని పేరుపెట్టారు. దానికి కూడా పుంగనూరు జాతి వీర్యంతో జతకట్టించగా మళ్లీ పెయ్యిదూడ పుట్టింది కానీ, ఆ లక్షణాలు రాలేదు. గతేడాది మార్చిలో పుంగనూరు ఎద్దు వీర్యంతో గర్భం దాల్చగా... ఇటీవల సుమారు 80 శాతం పోలికలున్న పుంగనూరు కోడెదూడకు జన్మనిచ్చిందని రైతు తెలిపారు. ఇది 16.72 అంగుళాలు ఎత్తు, 22 అంగుళాల పొడవు, 8 కిలోల బరువు ఉందని చెప్పారు. మరో రెండు ఈతలకు 100 శాతం లక్షణాలుండే పుంగనూరు దూడ కచ్చితంగా పుడుతుందని మణిదీప్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



నాటు ఆవుకు క్రాస్ చేయగా పుట్టిన పుంగనూరు కోడెదూడ

# హైదరాబాద్ దారిలో ట్రాఫిక్ జామ్



యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు



ద్విచక్ర వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసు సిబ్బంది

» 4.కి.మీ మేర నిలిచిపోయిన వాహనాలు
» ఏపీ నుంచి హైదరాబాద్‌కు ప్రజల రాక
» ప్రధాన రోడ్లపై వాహనాల బారులు

బీబీనగర్, చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, కోదాడ రూరల్, చిట్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పుట్టి పెరిగిన పల్లెల్లో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకొన్న ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ముఖ్యంగా కోడి పందేలను చూసేందుకు ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన నగరవాసులు కనుమ ముగియగానే తిరుగుముఖం పట్టారు. ఫలితంగా ఏపీ నుంచి హైదరాబాద్ వైపు రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, కార్లు ఇతర ప్రైవేటు వాహనాలు, బైక్‌ల వరదతో రద్దీ నెలకొంది. 65వ నంబర్ జాతీయ రహదారి, ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద కంటైనర్ ఇరుక్కుపోయింది. ఫలితంగా రోడ్డుకు ఇరువైపులా 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దాదాపు అరగంటపాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇక ఏపీ నుంచి హైదరాబాద్ వైపు జాతీయ రహదార్లపై రద్దీ నివారణకు టోల్‌గేట్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. నల్లగొండ జిల్లాలోని గూడూరు, పంతంగి, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాల మీదుగా గురువారం లక్ష వాహనాలు హైదరాబాద్‌కు వెళ్లాయి. గూడూరు టోల్‌ప్లాజా వద్ద రద్దీని నివారించేందుకు 100 అడుగుల దూరంలోనే ఫాస్టాగ్ స్కాన్ అయ్యేలా సాంకేతిక చర్యలు తీసుకున్నారు. ఈ టోల్‌ప్లాజాలో మొత్తం 12గేట్లు ఉండగా, హైదరాబాద్ వైపు ఎనిమిది, వరంగల్ వైపు నాలుగు గేట్ల నుంచి వాహనాలను పంపుతున్నారు. సాధారణ రోజుల్లో 20వేల వాహనాలు ప్రయాణిస్తే గురువారం 23వేల వాహనాలు వెళ్లాయి. ఇక్కడ బైక్‌ల మీద వస్తున్నవారికి పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. హైవేపై 200మంది పోలీసులను నియమించినట్లు, రెండు పెట్రోలింగ్ వాహనాలను 24 గంటలు తిప్పుతున్నామని ఏసీపీ తెలిపారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16గేట్లు కాగా హైదరాబాద్ వైపు 12గేట్ల నుంచి విజయవాడ వైపు నాలుగు గేట్ల నుంచి వాహనాలను అనుమతిస్తున్నారు. సాధారణ రోజుల్లో 20వేల వాహనాలు వెళుతుండగా, గురువారం అదనంగా 10వేల వాహనాలు వెళ్లాయి. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలోని 12టోల్ వసూలు కౌంటర్లలో వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఏడు కౌంటర్లు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు 5 కౌంటర్లు కేటాయించారు. ఇక్కడ సాధారణ రోజుల్లో 17వేల వాహనాలు వెళుతుండగా, గురువారం 50వేల వాహనాలు వెళ్లాయి.



ఇస్రో నిర్వహించిన పరీక్షలో ఆలిండియా స్థాయిలో 9వ ర్యాంకు సాధించి సైంటిస్ట్‌గా ఎంపికైన జగడం రమేశ్‌ను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

## సీఎంను కలిసిన ఇస్రో శాస్త్రవేత్త

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇస్రో ఇటీవల నిర్వహించిన పరీక్షలో అఖిల భారత స్థాయిలో 9వ ర్యాంకు సాధించి, శాస్త్రవేత్తగా ఎంపికైన తెలుగు యువకుడు జడగం రమేష్ గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా, తల్లి రామలక్ష్మి టైలర్‌గా పనిచేస్తూ కష్టపడి రమేష్‌ను చదివించారని తెలుసుకున్న సీఎం.. ఈ సందర్భంగా వారిని అభినందించారు. చంద్రయాన్-3 ల్యాండర్ మిషన్ బృందంలో ఒకరిగా పనిచేసిన రమేష్.. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

### ఐఎఫ్ఎస్ రమేశ్ మృతిపై బాబు సంతాపం

సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి రమేశ్‌కుమార్ మృతిపై సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. శిక్షణ నిమిత్తం లక్షద్వీప్ వెళ్లిన రమేశ్ గుండెపోటుతో మరణించారు. దీనిపై లక్షద్వీప్‌లోనే ఉన్న పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరితో సీఎం మాట్లాడారు. ప్రత్యేక విమానంలో భౌతిక కాయాన్ని తెప్పించాలని అధికారులను ఆదేశించారు.

## ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 17 కోట్ల వడ్డీ చెల్లింపు

ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తీసుకున్న రూ.2,170 కోట్ల రుణానికి.. జనవరి నెలకు రూ.17 కోట్ల వడ్డీని ఇంధన శాఖ చెల్లించింది. ఈ మేరకు స్పెషల్ సీఎస్ హోదాలో కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు.

# సంక్రాంతికి ఏరులై పారిన మద్యం

» గతంలో ఎప్పుడూ లేనంతగా వినియోగం
» మూడు రోజుల్లో 400 కోట్ల అమ్మకాలు
» సాధారణం కంటే 160 కోట్లు ఎక్కువ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తగ్గేదే..లే అన్నట్లుగా మందుబాబులు పండగ రోజుల్లో ఫూటుగా తాగేశారు. పండగ మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 400 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. సంక్రాంతి, కనుమ రెండు రోజుల్లో రోజుకు రూ. 150 కోట్ల చొప్పున మద్యం అమ్మినట్లు అంచనా. సాధారణంగా రాష్ట్రంలో రోజుకు రూ. 80 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతాయి. కానీ పండగ మూడు రోజుల్లో అదనంగా రూ.160 కోట్లు అమ్ముడైంది. మద్యం లైసెన్సీలు భోగి రోజున రూ.210 కోట్లు, గురువారం రూ. 220 కోట్ల మద్యాన్ని కొనుగోలు చేశారు. సంక్రాంతి కోసం తెచ్చుకున్న సరుకు దాదాపుగా ఖాళీ అయిపోవడంతోనే షాపుల యజమానులు గురువారం భారీగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు చూస్తే 6,99,464 కేసుల లిక్కర్, 2,29,878 కేసుల బీరు అమ్ముడైంది. ఆరు రోజుల్లో లిక్కర్ అమ్మకాలు సగటు కంటే లక్ష కేసులు, బీరు కూడా దాదాపు 30 వేల కేసులు పెరిగాయి. గతంలో ఎప్పుడూ సంక్రాంతికి ఈ స్థాయి అమ్మకాలు నమోదు కాలేదని ఎక్సైజ్ వర్గాలు చెప్పాయి. ప్రభుత్వం మార్పు, మద్యం ధరలు తగ్గింపు, నాణ్యమైన మద్యం సరఫరా లాంటి అంశాలు మద్యం అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈసారి కోడి పందేల బరులు పెరగడం కూడా మద్యం అమ్మకాలపై ప్రభావం చూపింది. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాకుండా ఎక్సైజ్ శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంది. దీంతో మద్యం అమ్మకాలు పెరిగాయి.

### న్యూ ఇయర్‌తో పోటీపడేలా

సాధారణంగా నూతన సంవత్సరం సమయంలో అత్యధిక స్థాయిలో మద్యం అమ్మకాలు జరుగుతాయి. ఈ సారి నూతన సంవత్సర వేడుకల్లోనూ భారీగా మందు తాగారు. డిసెంబరు 31న ఒక్కరోజే రాష్ట్రంలో రూ.200 కోట్ల మద్యం తాగేశారు. 2.5 లక్షల కేసుల లిక్కర్, 70 వేల కేసుల బీరు అమ్ముడైంది. గతంలో ఎప్పుడూ సంక్రాంతికి న్యూఇయర్ స్థాయిలో అమ్మకాలు ఉండవు. ఈ ఏడాది పోటీపడేలా సంక్రాంతికి మద్యం అమ్ముడైంది. మూడు రోజుల్లో సగటున రోజుకు రూ.133 కోట్ల విక్రమాలు జరిగాయి.

### పెరుగుతున్న అమ్మకాలు

వైసీపీ ప్రభుత్వంలో ఓవైపు జే బ్రాండ్లు, మరోవైపు భారీ ధరల కారణంగా మందుబాబులు నాటు సారా, గంజాయి, ఎన్‌డీపీఎల్ వైపు వెళ్లారు. మద్యం పేరుతో వినియోగదారులను దోపిడీ చేయకూడదని కూటమి ప్రభుత్వం పాలసీలో సమూల మార్పులు చేసింది. క్వార్టర్ రూ. 99కే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఫలితంగా లిక్కర్‌లో 23శాతం, బీరులో 38శాతం అమ్మకాలు పెరిగాయి. కానీ ప్రభుత్వం తక్కువ ధరకే మద్యం తేవడం, కొన్ని బ్రాండ్ల ధరలు తగ్గించడంతో విలువ కేవలం 6శాతం మాత్రమే పెరిగింది. అలాగే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పరిమాణం స్థాయిలో పెరగలేదు. ఒకవేళ పాత ధరలు, పాత బ్రాండ్లే ఉండి ఉంటే ఇప్పుడు సంక్రాంతికి అమ్మిన మద్యం పరిమాణం విలువ మరో రూ. 50 కోట్లు అదనంగా ఉండేది. దానివల్ల ప్రభుత్వానికి సుమారు రూ. 30 అదనంగా ఆదాయం వచ్చేది.





విజయవాడలోని ఎనికేపాడు, పటమటల్లో కోడి పందేల నిర్వహించిన బరుల వద్ద చెత్తా చెదారం, పేక ముక్కలు, తాగి పడేసిన మందు సీసాలు

## త్రిశంకు స్వర్గంలో ఉన్నాం

» 'బిడ్డను కని గాలికి వదిలేసినట్లు' వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది

» గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ నేతల ఆవేదన

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. గత ప్రభుత్వం 'బిడ్డను కని గాలికి వదిలేసినట్లు' వీరిపట్ల వ్యవహరించింది' అని డెమోక్రాటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్.. నేతలు వ్యాఖ్యానించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో గ్రామ, వార్డు సచివాలయ శాఖ ముఖ్య కార్యదర్శిని సంఘం నేతలు కలిసి.. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ జోసెఫ్ కిశోర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు బీ సతీశ్, షేక్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ... 'ఐదేళ్ల సర్వీసు పూర్తయిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరికీ సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని, శాఖాపరమైన పదోన్నతులు కల్పించాలని, అంతర జిల్లా బదిలీలకు అవకాశం కల్పించాలని కోరాం. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సర్దుబాటుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని తెలిపారు.

## నిషాంత్‌కుమార్‌కు పీఎం అవార్డు



అమరావతి, ఏలూరుసిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గతంలో పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా శిశు మరణాల రేటు తగ్గించినందుకు ప్రస్తుత ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్‌కు ప్రధానమంత్రి విశిష్ట పురస్కారం లభించింది. ఈ మేరకు కేంద్ర పరిపాలనా, సంస్కరణల శాఖ నుంచి గురువారం ఆయనకు సమాచారం అందింది. 2022 నుంచి 2024 మధ్య కాలంలో ఆయన పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా పనిచేశారు. మన్యంలో మాతా, శిశు మరణాల రేటు అధికంగా ఉండేది. దీంతో శిశు మరణాల రేటు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రిజమ్ అనే కార్యక్రమాన్ని అమలుచేసింది. దానిని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా మన్యంలో శిశు మరణాల రేటును నిషాంత్‌కుమార్ 24 నుంచి 8కి తగ్గించారు. అలాగే ప్రసూతి మరణాలను కూడా తగ్గించారు. దీంతో ఆయన్ను అవార్డుకు ఎంపిక చేశారు.

### ఏలూరు జిల్లాకు ప్రధాన మంత్రి పురస్కారం

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2023 ఏలూరు జిల్లాకు లభించింది. కేంద్రం నుంచి ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. రాష్ట్ర విభజన తర్వాత కొత్తగా ఏర్పాటైన ఈ జిల్లాకు మొదటి కలెక్టర్‌గా ప్రసన్నవెంకటేశ్ పనిచేసిన సమయంలో జిల్లాలో పౌరసేవలు, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లారు. దీంతో దేశంలో ఉన్న 788 జిల్లాల్లో 16 జిల్లాలను కేంద్రం ఎంపిక చేయగా అందులో ఏలూరు జిల్లాకు స్థానం లభించింది.

## ఆరోగ్యశాఖలో పదోన్నతులు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో పదోన్నతుల కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డీఎంఈ నరసింహం, డీహెచ్ పద్మావతితో కూడిన డీపీసీ గురువారం భేటీ అయ్యింది. 10 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు, జిల్లా మలేరియా అధికారుల పోస్టులు రెండు, సీనియర్ ఎపిడమాలజిస్ట్ పోస్టులు ఆరు, రెండు పారా మెడికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం డీపీసీ పదోన్నతులు కల్పించింది. డీపీసీ ఆమోదం పూర్తి కావడంతో రెండు రోజుల్లో పోస్టింగుల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

## మరో 3.5 కోట్ల ఉపాధి పనిదినాలు కల్పించండి

» కేంద్రానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ప్రతిపాదనలు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన ఉపాధి పనిదినాలు పూర్తి కావొస్తుండటంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు పనిదినాలు కోసం ప్రతిపాదనలు పంపింది. 2024-25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 21.50 కోట్ల పనిదినాలను మన రాష్ట్రానికి కేటాయించింది. వాటిలో ఇప్పటికే 20.45 కోట్ల పనిదినాలను కల్పిస్తూ పనులు చేపట్టడంతో ఇక 1.55 కోట్ల పనిదినాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మార్చి నెలాఖరు వరకు కూలీలకు పనులు కల్పించాలంటే అదనపు పనిదినాలు అవసరమవుతాయి. ఏటా మన రాష్ట్రానికి 25 కోట్ల పనిదినాలతో లేబర్ బడ్జెట్ కేటాయిస్తారు. ఇప్పటికే 21.50 కోట్లు పనిదినాలు కల్పించినందున విగిలిన 3.50 కోట్ల పనిదినాలు కూడా కల్పించాలని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖకు ప్రతిపాదనలు పంపారు.

## పంచాయతీలకు సర్‌చార్జీలు విడుదల చేయాలి

» ప్రభుత్వానికి సర్పంచుల సంఘం విజ్ఞప్తి

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఏపీ సర్పంచుల సంఘం, అఖిలభారత పంచాయతీ పరిషత్ నేతలు చిలకలపూడి పాపారావు, జాస్తి రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను కలిసి ఆ మేరకు వినతిపత్రం అందించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## వర్గీకరణ పూర్తయ్యేవరకు రుణాలు నిలిపివేయాలి

» దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ డిమాండ్

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేవరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరును నిలిపివేయాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను వేసిందని, ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే రూ.340 కోట్లతో ఎస్సీలకు స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేశారని అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ గురువారం తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా చేపట్టనున్నారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాకే ఈ రుణాలను మంజూరు చేయాలని, లేకపోతే మాదిగ, రెల్లి తదితర కులాలవారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు.

## ఏపీ, టీ నుంచి పది మంది ఇంజనీర్ల 'పరస్పర' బదిలీలు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జల వనరుల శాఖ ఏఈఈ, డీఈఈలు పదేసి మంది చొప్పున పరస్పర అంగీకారంతో బదిలీలకు రాష్ట్ర జల వనరుల శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర జల వనరుల శాఖకు చెందిన పది మంది ఇంజనీరింగ్ అధికారులను తెలంగాణకు రిలీవ్ చేస్తూ .. తెలంగాణ నుంచి పది మంది ఇంజనీర్లు ఏపీలోకి తీసుకునేందుకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వు జారీ చేశారు.

## దక్షిణ మధ్య రైల్వే పీసీసీఎంగా ఎన్.రమేశ్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం)గా ఎన్.రమేశ్ నియమితులయ్యారు. గురువారం రైల్ నిలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్(ఐఆర్‌టీఎస్) 1992 బ్యాచ్‌కి చెందిన రమేశ్ ఇంతకు ముందు నైరుతి రైల్వేలో విధులను నిర్వర్తించారు.

## కొల్లేరు ఆక్రమణలపై సుప్రీం విచారణ మార్చి 19కి వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సు ఆక్రమణలపై విచారణను సుప్రీంకోర్టు మార్చి 19కి వాయిదా వేసింది. కొల్లేరు సరిహద్దుల వ్యవహారంపై గురువారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా గత ఏడాది డిసెంబరులో విచారణ తర్వాత చేపట్టిన కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మూడు నెలల్లో కొల్లేరు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని నివేదించింది. వచ్చే మూడు నెలల్లో కొల్లేరు సరిహద్దులను ఖరారు చేయనున్నట్లు కోర్టుకు తెలిపింది. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు సుమారు 5 వేల ఎకరాల్లో ఆక్రమణలు తొలగించినట్లు రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. ప్రభుత్వ అఫిడవిట్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. మార్చి 19 లోపు మిగిలిన వివరాలతో తదుపరి నివేదిక దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

# కియా సిరోస్ ఉత్పత్తి ప్రారంభం

» పెనుకొండ ప్లాంట్‌లో అధునాతన కారును ప్రదర్శించిన సీఈఓ, ఎండీ



పెనుకొండ రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా ప్లాంట్‌లో అత్యాధునిక ఫీచర్లున్న 'సిరోస్' కారు ఉత్పత్తి ప్రారంభమైంది. అన్ని ఫీచర్లతో రూపుదిద్దుకున్న కారును సంస్థ ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. కియా సీఈఓ హోసంగ్, మేనేజింగ్ డైరెక్టర్ వాంగ్‌గులి, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడి పరిశ్రమ నుంచి గతంలో కియా కార్నివాల్, సొనైన్, సెల్టాస్, కారెన్స్ కార్లను ప్రారంభించి, ఎగుమతి చేసింది. భారతీయ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సిరోస్ కారును రూపొందించామని సీఈఓ హోసంగ్ తెలిపారు. సిరోస్‌ను ఇప్పటికే 10,258 మంది బుక్ చేసుకున్నారని చెప్పారు. గత ఏడాది డిసెంబరు 19న ప్రపంచ వ్యాప్తంగా ఆవిష్కరించామని, ఈ నెల 17న ఢిల్లీలో జరిగే గ్లోబల్‌ఎక్స్‌లో సిరోస్ ప్రదర్శన, లాంచింగ్ ఉంటుందని తెలిపారు. కారు ధరను ఫిబ్రవరి 1న నిర్ణయిస్తామని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఈ కారును బుక్ చేసుకోవచ్చన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా ప్లాంట్‌లో సిరోస్ కారును ప్రారంభిస్తున్న సందర్భంగా కియా ప్రతినిధులు, ఉద్యోగుల సంబరం

# గీత కులాలకు 340 మద్యం షాపులు

» జిల్లాల వారీగా జాబితాలు సిద్ధం

» వారంలో నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు



అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మరో ఎన్నికల హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గీత కులాలకు 340 మద్యం షాపులు కేటాయించాలని నిర్ణయించింది. ఉపకులాల వారీగా వారం రోజుల్లో వీటికి నోటిఫికేషన్ జారీ చేయనుంది. తొలుత గీత కార్మికుల ఆధారంగా షాపులు కేటాయించాలని భావించగా, ఆ తర్వాత గీత కులాల వారీగా షాపుల కేటాయింపునకు నిర్ణయం తీసుకుంది. గత అక్టోబరులో అమల్లోకి తీసుకొచ్చిన ప్రైవేటు మద్యం షాపుల పాలసీలో 3,396 షాపులకు లైసెన్సులు జారీచేశారు. అందులో 10శాతం ఇప్పుడు గీత కులాలకు ఇవ్వనున్నారు. అలా వచ్చే 340 షాపుల్లో నాలుగు షాపులు సొండి కులానికి విడిగా కేటాయిస్తారు. గతంలో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన కుటుంబానికి ఒక షాపును కేటాయించనున్నారు. మిగిలిన 335 షాపులకు నోటిఫికేషన్ జారీచేస్తారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. దరఖాస్తు రుసుము రూ.2లక్షలుగా ఉంది. అయితే లైసెన్స్ ఫీజులు సగం చెల్లిస్తే సరిపోతుంది.

జిల్లాల వారీగా గీత కులాల జనాభా ఆధారంగా ఏ జిల్లాకు ఎన్ని షాపులు వస్తాయనే వివరాలు ఎక్సైజ్ శాఖ సేకరించింది. 2016లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వేని కులాల జనాభాకు ప్రామాణికంగా తీసుకున్నారు. గీత కులాలను మూడు కేటగిరీలు చేశారు. ఎ-కేటగిరీలో యాత, బి-కేటగిరీలో గౌడ, ఈడిగ, గౌడ(గమళ్ల), కలాలీ, గౌండ్ల, శ్రీసాయన, సొండి, శెట్టిబలిజ కులాలున్నాయి. మరో కేటగిరీలో సొండి కులాన్ని విడిగా చూపించారు. ఆయా జిల్లాల్లో ఆ కులానికి ఉన్న జనాభా ఆధారంగా షాపులు నిర్ణయించారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా 23 షాపులు గీత కులాలకు కేటాయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక్కటీ లేదు. అనంతపురంలో 14, శ్రీసత్యసాయిలో 9, అన్నమయ్యలో 11, చిత్తూరులో 10, తూర్పుగోదావరిలో 13, కాకినాడలో 16, కోనసీమలో 13, బాపట్లలో 12, గుంటూరులో 13, పల్నాడులో 13, కడపలో 14, కృష్ణాలో 12, ఎన్టీఆర్‌లో 11, కర్నూలులో 10, నంద్యాలలో 11, నెల్లూరులో 18, ప్రకాశంలో 18, పార్వతీపురం మన్యంలో 4, శ్రీకాకుళంలో 18, అనకాపల్లిలో 15, విశాఖపట్నంలో 14, విజయనగరంలో 16, ఏలూరులో 14, పశ్చిమగోదావరిలో 18 షాపులు గీత కులాలకు కేటాయించనున్నారు.

### సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు

గీత కార్మికులు, కులాలకు షాపుల కేటాయింపుపై ఎవరికీ అభ్యంతరాలు లేవు. కానీ లైసెన్స్ ఫీజు సగమే ఉండటంపై మాత్రం ఇతర మద్యం షాపుల లైసెన్సీల నుంచి కొన్ని అభ్యంతరాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. లైసెన్స్ ఫీజు సగమే కావడంతో గీత కులాల వారి వ్యాపారం లాభసాటిగా ఉంటుందనేది సాధారణ లైసెన్సీల అభిప్రాయం. అయితే వ్యాపారుల మధ్య విభేదాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ శాఖ చెబుతోంది.

## పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా నిబంధనల సవరణ సరైనదే

» ఈ విషయంలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

» జీవో 85ను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లుగా చేస్తున్న వారు పీజీ వైద్య విద్యను అభ్యసించేందుకు కేటాయించే ఇన్ సర్వీస్ కోటా నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు సరైనవేనని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇన్ సర్వీస్ కోటా కింద పీజీ సీటు పొందేందుకు నీట్ నిర్వహణ తేదీ నాటికి 50 ఏళ్లు దాటి ఉండకూడదనే నిబంధనను సమర్థించింది. పీజీ పూర్తయ్యాక పదేళ్ల పాటు రాష్ట్రంలోనే పని చేయాలనే నిబంధన సరైనదేనని తెలిపింది. దీన్ని ఉల్లంఘిస్తే రూ.50 లక్షలు జరిమానా విధిస్తామని ప్రభుత్వం నిబంధన విధించడాన్ని సమర్థించింది. పీజీ వైద్య విద్య ఇన్ సర్వీస్ కోటా నిబంధనలు సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 85 విషయంలో తాము జోక్యం చేసుకోలేమని పేర్కొంది. పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. పీజీ వైద్యవిద్య ఇన్‌సర్వీస్ కోటా నిబంధనలు సవరిస్తూ గతేడాది జులై 20న రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 85ను సవాల్ చేస్తూ మేదరమెట్ల ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి చిట్టిబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం నిబంధనలు మార్చడంతో అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. అభ్యర్థుల గరిష్ఠ వయస్సు 50 ఏళ్లుగా నిర్ణయించడంతో పీజీ వైద్య విద్య ఇన్ సర్వీస్ కోటాకు పిటిషనర్ అనర్హులు అవుతున్నారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, ఎన్టీఆర్ హెల్త్ యునివర్సిటీ తరపున న్యాయవాది టీవీ శ్రీదేవి వాదనలు వినిపించారు. పీజీ వైద్య విద్య పూర్తిచేసిన పలువురు అభ్యర్థులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు ఇష్టపడడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే కమిటీ సిఫారసు మేరకు నిబంధనలు సవరించామన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం జీవో 85 విషయంలో తాము జోక్యం చేసుకోలేమని పేర్కొంది. పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

## పంచాయతీరాజ్‌లోనూ 'అంచనాలను' సవరించవచ్చు

» ఆ శాఖ జారీ చేసిన జీవో 72పై సర్వత్రా అభ్యంతరాలు

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మూడు తాగునీటి పథకాల అంచనాలను జల వనరుల ప్రాజెక్టుల తరహాలోనే సవరించుకోవచ్చు అంటూ గత నెల 16న పంచాయతీరాజ్ శాఖ జారీచేసిన జీవో నంబరు 72 విమర్శలకు తావిస్తోంది. ఉద్దానం, పులివెందుల, డోన్... మూడు మంచినీటి పథకాలను 2021 నవంబరు 30లోగా పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ ఒప్పందం చేసుకుంది. కానీ.. ఇప్పటి వరకూ పూర్తి చేయలేదు. ఈ పనులు పూర్తి చేయడానికి తాజా ఎస్ఎస్ఆర్ మేరకు అంచనాలను సవరించాలని కాంట్రాక్టు సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గత నెల 16న జీవో 72ను పంచాయతీరాజ్ శాఖ జారీ చేసింది. జల వనరుల శాఖ తరహాలోనే అంచనాలు సవరించుకోవడానికి పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు ఈ జీవో అనుమతిస్తోంది. దీనిని అమలు చేస్తే ఆ శాఖలోని ఇతర పనులకూ ఇవే ఆదేశాలు వర్తిస్తాయి. ఫలితం... ప్రభుత్వంపై రూ.1,000 కోట్ల ఆర్థిక భారం పడుతుందని ఆ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# గిరిజన సంస్థలకు జగన్ దెబ్బ



» ఐదేళ్ల వైసీపీ పాలనలో ఐటీడీఏలు నిర్వీర్యం

(రంపచోడవరం)




వైసీపీ అడ్డగోలు పాలనతో గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లన్నీ దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. జగన్ అనాలోచిత నిర్ణయంతో ఆ సంస్థలన్నీ నిర్వీర్యమైపోయాయి. నాలుగు దశాబ్దాలు సాఫీగా నడిచిన రాష్ట్రంలోని ఐటీడీఏలు ఆ ఐదేళ్ల పాలన దెబ్బకు కుదేలైపోయాయి. వైసీపీ పాలనలో అడ్డగోలుగా సాగించిన జిల్లాల విభజన పుణ్యమాని ప్రస్తుతం వీటికి ఏ జిల్లాల కలెక్టర్లు చైర్మన్లో తెలియని గందరగోళం నెలకొంది. దేశ వ్యాప్తంగా గిరిజనాభివృద్ధికి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సంస్థలు ఉండాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఐటీడీఏ వంటి సంస్థల ఏర్పాటుకు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలిచ్చింది. ఈ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వయం ప్రతిపత్తి గల సంఘాలుగా 9 ఐటీడీఏలు 1976-1980 మధ్య కాలంలో ఏర్పాటయ్యాయి. రాష్ట్ర పునర్విభజన అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రంపచోడవరం, చింతూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కేఆర్ పురం, ఉమ్మడి విశాఖ జిల్లాలో పాడేరు, ఉమ్మడి విజయనగరం జిల్లాలో పార్వతీపురం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట ఐటీడీఏలతో పాటు కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఐటీడీఏలు నడుస్తున్నాయి.

### ఐటీడీఏలకు శాపంగా జగన్ పాలన

జగన్ పాలన వచ్చాక ఐటీడీఏలు అలంకారప్రాయంగా మారాయి. ఇక్కడ ఏ పథకాలు అమలవుతున్నాయో కూడా గిరిజనులకు తెలియని స్థాయికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా 2022లో ఆయన సాగించిన జిల్లాల విభజన ఈ ఐటీడీఏలకు శాపంగా మారింది. అంతవరకూ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న ఈ ఐటీడీఏలు కొత్త జిల్లాల పరిధిలోకి మారిపోయాయి. కానీ నిబంధలను ప్రభుత్వం మార్చకపోవడంతో కొత్త జిల్లాల కలెక్టర్లు ఆయా ఐటీడీఏల చైర్మన్లుగా కొనసాగలేని దుస్థితి ఏర్పడింది. సొసైటీల చట్టం ప్రకారం ఐటీడీఏలకు అప్పటి జిల్లాల కలెక్టర్లు చైర్మన్లు కాగా వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, ఆయా ఐటీడీఏల పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యేలు, ఎంపీలు, గిరిజన మండలాల ప్రజాప్రతినిధులు సభ్యులు. అయితే జిల్లాల విభజనతో మారిన పరిధి మేరకు సొసైటీ నిబంధనల్లో సవరణలను తెచ్చి ఆయా ఐటీడీఏలకు కొత్త జిల్లాల కలెక్టర్లను చైర్మన్లుగా, కొత్త జిల్లాల్లోని వివిధ శాఖల ఉన్నతాధికారులను సభ్యులుగా మార్చుతూ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ జగన్ పాలనలో అటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా ఆయా పాత జిల్లాల కలెక్టర్లే చైర్మన్లుగా కొనసాగాల్సి వస్తోంది. ఇక కొన్ని ఐటీడీఏల్లో రెండేళ్లకు పైగా పాలక మండళ్ల సమావేశాలు జరగడం లేదు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల్లో అయితే మూడేళ్లుగా పాలక మండళ్ల సమావేశాలు జరగలేదు. దీంతో ఇక్కడ గిరిజనాభివృద్ధి ప్రణాళికలను ఆమోదించి అమలు చేసే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి దీనికొక పరిష్కారం చూపాల్సి ఉందని గిరిజన నేతలు కోరుతున్నారు.

### టీడీపీ పాలనలో సక్రమంగా..

రాష్ట్ర విభజన అనంతరం 2014లో చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వం హయాంలోనూ ఈ ఐటీడీఏలన్నీ ఎంతో ప్రత్యేకత సంతరించుకున్నాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు చైర్మన్లుగా పాలకమండళ్లు నడిచేవి. సొసైటీల చట్టం కింద ఏటా వార్షిక సమావేశాలు, త్రైమాసిక సమావేశాలతో ఆయా ఆర్థిక సంవత్సరాల్లో జరగాల్సిన అభివృద్ధి ప్రణాళికలను ఆమోదించి అమలు చేయడం, జరిగిన ఖర్చును పరిశీలించి ఆమోదించడం కచ్చితంగా జరిగేవి.

## ఏటీఎస్‌ల ఏర్పాటుకు సీఎం ఓకే

» ఫిబ్రవరికి మొత్తం కేంద్రాలు ఏర్పాటు పూర్తి.. నేడో, రేపో జీవో జారీ చేయనున్న రవాణా శాఖ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'టెక్నాలజీకి మనం ప్రాధాన్యం ఇస్తున్నాం. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం. అందుకు అనుగుణంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు(ఏటీఎస్) ఏర్పాటు చేయండి' అంటూ రవాణా శాఖకు సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరు లోపు ఐదు కేంద్రాలు, ఫిబ్రవరి చివరికి మొత్తం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఏటీఎస్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ రాష్ట్ర రవాణా శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేయబోతోంది. రోడ్డు ప్రమాదాల తగ్గింపు చర్యల్లో భాగంగా దేశ వ్యాప్తంగా ఏటీఎస్‌లు ఏర్పాటు చేయాలంటూ కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు దిశా నిర్దేశం చేసింది. సుమారు ఐదేకరాల విస్తీర్ణంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఏటీఎస్‌ల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తులు టెండర్లు దక్కించుకున్నారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా అనంతపురం, నంద్యాలలో ఇప్పటికే రెండు ఏర్పాటయ్యాయి. అయితే పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వ్యవస్థ వెళ్లిపోతే ప్రమాదమని, భవిష్యత్తులో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారంటూ ఎంవీఐలు, రవాణా శాఖ ఉన్నతాధికారుల వద్ద సందేహాన్ని లేవనెత్తారు. దీంతో పూర్తి నిర్ణయం వెలువడే వరకూ ఆగాలంటూ ఆ రెండింటినీ రవాణా శాఖ తాత్కాలికంగా ఆపింది. 'ఎంవీఐల పాత్ర ఉన్నా మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మేం ఒక్కో కేంద్రానికి రూ.5 కోట్లు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెడుతున్నాం. జీఎస్టీ (18 శాతం) రూపంలో సుమారు రూ.25 కోట్లు ఆదాయం రాష్ట్రానికి వస్తుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 1500 మందికి ఉపాధి లభిస్తుంది' అంటూ ఏటీఎస్ టెండర్లు దక్కించుకున్న వారు సీఎంకి వివరించారు. దీనిపై రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన చంద్రబాబు... 'రోడ్డు ప్రమాదాల కట్టడి కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయంపై మనమెందుకు జాప్యం చేయాలి? డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్నెస్‌లో అధునాతన టెక్నాలజీ వస్తే మంచిదే కదా? కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం కానివ్వండి' అంటూ ఆదేశించారు. ఈ నెల 12న సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. అనంతపురం, నంద్యాలలో ఇప్పటికే ఉండగా అనకాపల్లి, కాకినాడ, గుంటూరులో నెలాఖర్లోపు పూర్తి కానున్నాయి. రాజమహేంద్రవరం, చిత్తూరు, కర్నూలులో ఫిబ్రవరిలో పూర్తి అయ్యే అవకాశం ఉంది. విశాఖపట్నంలో ప్రభుత్వమే నిర్వహిస్తుండగా భీమవరంలో సాంకేతిక సమస్యతో టెండర్ రద్దు అయింది. బాపట్ల జిల్లాలో వాహనాలు తక్కువగా ఉన్నందున ఏటీఎస్ టెండర్ల దాఖలుకు ఎవ్వరూ ముందుకు రాలేదు.

## 2 కి.మీ. వేటాడి.. వెంటాడి.. 12 మంది నక్సల్స్ కాల్చివేత

» తెలంగాణ సరిహద్దుల్లో.. మారేడుబాక అడవుల్లో ఘటన

» వెయ్యిమంది బలగాలతో ఆపరేషన్..


చర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దులకు 15 కిలోమీటర్ల దూరంలో.. ఛత్తీస్‌గఢ్‌లోని మారేడుబాక అడవుల్లో తుపాకులు గర్జించాయి. డీఆర్‌జీ, కోబ్రా బలగాలకు చెందిన వెయ్యి మంది నిర్వహించిన ఆపరేషన్‌లో.. తమకు తారసపడ్డ మావోయిస్టులను రెండు కిలోమీటర్ల దూరం వరకు వెంటాడి.. వేటాడి కాల్చిచంపారు. పోలీసుల కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ సమీపంలోని మారేడుబాక అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు బలగాలకు ఉప్పందింది. దీంతో.. గురువారం ఉదయం సుమారు వెయ్యి మంది డీఆర్జీ, కోబ్రా బలగాలు కూంబింగ్‌కు ఉపక్రమించాయి. ఉదయం 9 గంటల సమయంలో బలగాలకు మావోయిస్టులు తారసపడడంతో.. ఇరువైపులా కాల్పులు మొదలయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు కాల్పులు కొనసాగాయి. ఓ దశలో తమవైపు నష్టం జరుగుతున్నట్లు గుర్తించిన మావోయిస్టులు అడవుల్లోకి వెళ్లగా.. బలగాలు వారిని రెండు కిలోమీటర్ల దూరం వరకు వెంటాడాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది మావోయిస్టుల మృతదేహాలను, భారీగా ఆయుధాలు, మందుపాతరలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు. మృతుల్లో తెలుగువారు ఉండిఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారానికి వివరాలు తెలుస్తాయని చెప్పారు. కాగా.. ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 20 మంది నక్సల్స్ మృతిచెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ కార్యాలయం తెలిపింది.

### కమల్‌దాస్ ఉసెండీ లొంగుబాటు

మావోయిస్టు పార్టీలో టెక్నికల్ టీమ్ కమాండర్‌గా పనిచేస్తున్న గింజురాం అలియాస్ కమల్‌దాస్ ఉసెండీ గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 27 ఏళ్లుగా ఇతను నక్సల్‌బరి ఉద్యమం, మావోయిస్టు పార్టీలో పనిచేశాడు. మిలీషియా సభ్యుడుగా కూడా పనిచేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం టెక్నికల్ టీమ్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. కమల్‌దాస్‌పై రూ.25 లక్షల రివార్డు ఉందని, ప్రభుత్వం తరఫున ఇతనికి ప్యాకేజీని అందజేస్తామని పోలీసులు వెల్లడించారు.

## రేపటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

» మూడు రోజులు నిర్వహణ.. ఆరేడు లక్షల మంది హాజరు!



తిరుపతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కేంద్రంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్నారు. సూళ్లూరుపేటతో పాటు పరిసర ప్రాంతాలైన నేలపట్టు, అటకానితిప్ప, బీవీ పాలెం, శ్రీసిటీ తదితర ఐదు చోట్ల కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తొలిరోజున ఉదయం సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభిస్తారు. 2020 జనవరిలో చివరిసారిగా ఫ్లెమింగో ఫెస్టివల్ జరిగింది. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం ఈ ఉత్సవాలను పునఃప్రారంభిస్తోంది. మూడు రోజుల్లో మొత్తం 6-7 లక్షల మంది పర్యాటకులు ఫెస్టివల్‌కు వస్తారని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

# ఇదే మా పథం!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడులు సాధించాను. రూ.లక్షా 85 వేల కోట్ల వ్యయంతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఆర్సెలార్ నిప్పన్ కంపెనీ అనకాపల్లి జిల్లాలో రూ.లక్షా 40 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఆసక్తి చూపుతోంది. 12-14 మిలియన్ టన్నుల ముడి ఇనుము కేటాయించాలని ఆ కంపెనీ కేంద్రాన్ని అడుగుతోంది. కేంద్రం 7-9 మిలియన్ టన్నులు కేటాయించడానికి సుముఖంగా ఉంది. దీనిపై కొంత స్పష్టత వస్తే ఈ స్టీల్ ప్లాంట్ వస్తుంది. జాతీయ రహదారులపై రూ.50 వేల కోట్లు, రైల్వే లైన్లపై రూ.70 వేల కోట్లను కేంద్రం మన రాష్ట్రంలో ఖర్చు చేయబోతోంది. రోడ్లపై రాష్ట్రప్రభుత్వం పెట్టే ఖర్చుకు ఇది అదనం. ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తేవాలని లక్ష్యంగా పనిచేస్తున్నాం. పూర్తిగా నిలిచిపోయిన అమరావతి, పోలవరం ప్రాజెక్టులు మళ్లీ పట్టాలెక్కించాం. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కూడా చేపట్టి పూర్తి చేస్తాం. ఈ 7 నెలల్లో రాష్ట్రంలో వృద్ధి రేటును గత ఏడాదితో పోలిస్తే మూడున్నర శాతం పెంచాం. ఏటా 15% వృద్ధి రేటు సాధించి దానిని కొనసాగించగలిగితే కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి వెసులుబాటు వస్తుంది. రాష్ట్రం సొంత ఆదాయం పెరుగుతుంది. ఆదాయం పెరిగితేనే ప్రజలకు పెట్టగలుగుతాం. ఆ స్థాయిలో వృద్ధి రేటు పెంచుకోవడానికి ప్రణాళిక తయారు చేసుకుని దానికి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ విడుదల చేశాం. కొత్తగా 26 రంగాల్లో ప్రభుత్వ పాలసీలను ఖరారు చేసి పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంచాం. ఎక్కడ ఎటువంటి వ్యక్తి ఉంటే ఫలితం వస్తుందో అక్కడ అటువంటి వారిని పెడుతున్నాం' అని చెప్పారు. అధికారంలోకి రాగానే రోడ్లు వేశామన్నారు. ధాన్యం రైతులకు 24 గంటల్లో డబ్బులు వేస్తున్నామని గుర్తుచేశారు. జిల్లా, మండలం, గ్రామం చొప్పున వృద్ధి రేటు లెక్కగట్టాలనుకుంటున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో విశాఖలో తలసరి ఆదాయం పెరుగుతుందని.. చుట్టూ పారిశ్రామికీకరణ జరుగుతుండడం వల్ల తిరుపతి అతి పెద్ద నగరంగా మారుతుందని చెప్పారు. ఉద్యానవన పంటలు బాగా ఊపందుకుంటే కోస్తా ప్రాంతాన్ని రాయలసీమ దాటేసే అవకాశం ఉందన్నారు.పామాయిల్‌తో పశ్చిమ గోదావరి జిల్లాలోని చింతలపూడి మెట్ట ప్రాంతం.. డెల్టా ప్రాంతమైన భీమవరాన్ని దాటేసే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఇంకా ఏమన్నారంటే..

### మాది రాజకీయ పార్టీ... రాజకీయ పాలన..


మాది రాజకీయ పార్టీ. ఎన్నికల ముందు మేనిఫెస్టో ఇచ్చాం. దానిని ఇంటింటికీ తీసుకెళ్లింది మా కార్యకర్తలే.. అధికారులు కాదు. మావాళ్లు చెప్పింది నమ్మి ప్రజలు మాకు ఓట్లు వేశారు. ఆ మేనిఫెస్టోను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. దానికోసం రాజకీయపరమైన పాలన అందిస్తాం. రాజకీయంగా బలంగా ఉండడానికే ప్రాధాన్యం ఇస్తాం. పనిగట్టుకుని ఎవరినీ వేధించం. అదే సమయంలో తప్పు చేసినవారిని వదిలిపెట్టం. సోషల్ మీడియాలో విశ్రవీగిన వారిపై కఠినంగా వ్యవహరించాం. గంజాయి, డ్రగ్స్ వ్యవహారాల్లో తలదూర్చిన వారిని.. రౌడీయిజం చేస్తున్న వారిని ఊరుకోవడం లేదు. గతంలో తప్పులు చేసిన వారి విషయంలో పక్కాగా ఆధారాలు సేకరిస్తున్నాం. తప్పులు చేసినవారు కొన్ని రోజులు తప్పించుకోవచ్చేమో గానీ ఎల్లకాలం తప్పించుకోలేరు. అన్నీ చూసుకుని వెళ్తాం. ఈ పని నిరంతరం జరుగుతూనే ఉంటుంది. మనది చిన్న రాష్ట్రం కావడంతో చాలినంత మంది అధికారులు లేక ఇబ్బంది వస్తోంది. ఉన్నవారితోనే పని చేయించుకోవడానికి యత్నిస్తున్నాం.

### గ్రామీణ సంప్రదాయాలు కాపాడతాం

గ్రామీణ సంప్రదాయాలు కాపాడేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మా చిన్నతనంలో మా ఊరి చుట్టుపక్కల జల్లికట్టు బాగా జరిగేది. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ఉండేది. జల్లికట్టును తమిళనాడు ప్రభుత్వం నిషేధిస్తే సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. స్పెయిన్‌లో బుల్‌ఫైట్ పేరుతో సంప్రదాయం ఉంది. కొన్ని సంప్రదాయాలను మనం తోసివేయలేం. రైతులు బాగుంటే సంక్రాంతి ఆనందంగా జరుగుతుంది. ఈసారి హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు పది లక్షల మంది వచ్చారు. తమ మూలాలు మరచిపోకుండా రావడం ఆనందదాయకం.

### పీ-4 విజయవంతమవుతుంది..

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఒక ఇల్లు, మరుగు దొడ్డి, విద్యుత్, నీటి కనెక్షన్లు, పైపు ద్వారా గ్యాస్ సరఫరా, ఇంటిపైన సౌర విద్యుత్ తయారీకి పలకలు, ప్రతి వీధిలో వీధిదీపాలు, ప్రతి ఊరిలో ప్రకృతి వ్యవసాయం ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో బాగా పేదరికంలో ఉన్న కుటుంబాలు 12 లక్షలు ఉన్నట్లు గుర్తించాం. కలిగినవారిని ప్రోత్సహించి.. ఈ పేద కుటుంబాలకు వారి ఆసరా అందేలా చూడాలని అనుకుంటున్నాం. గతంలో పీ-3 రాష్ట్రంలో సంపద సృష్టించింది. పైన ఉన్నవారు.. కింద ఉన్నవారికి చేయూతనిచ్చి పైకి తెచ్చేందుకే పీ-4 కార్యక్రమం. దీనిని ఉగాది పండగ రోజు ప్రారంభిస్తున్నాం. ఇది బలవంతం కాదు. ఎవరికి వారు తమకు తాముగా ముందుకొచ్చి సమాజంలో అట్టడుగున ఉన్నవారిని పైకి తేవడానికి చేపట్టాం. దీనికోసం అందరినీ చైతన్యపరుస్తున్నాం. టెక్నాలజీ ద్వారా పేదలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందేలా చూడాలనుకుంటున్నాం. అనేక ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందించబోతున్నాం. రాయలేనివారు నోటి మాటగా చెప్పి రికార్డు చేసి పంపినా అధికారులు చూసే ఏర్పాటు చేస్తున్నాం. పీ-4 విజయవంతం అవుతుందని నాకు నమ్మకం ఉంది. ఇది జరిగితే రాష్ట్రంలో పేదరికం బాగా తగ్గుతుంది. రాబోయే రోజుల్లో కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించాలని అనుకుంటున్నాం. చట్టం చేసిన తర్వాత పిల్లలు కనేవారికే ఇది వర్తిస్తుంది.




జీఎస్‌డీపీపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న సీఎం

# 2047 నాటికి రూ.347 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం

- తలసరి ఆదాయం రూ.58.14 లక్షలకు పెంచడమే లక్ష్యం: చంద్రబాబు
- వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఫ్యామిలీ ధ్యేయంతో ముందుకు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వృద్ధిరేటు రెండింతలు పెరిగితే సంపద నాలుగున్నర రెట్లు పెరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం 15శాతం వృద్ధిరేటు సాధించే దిశగా పనిచేస్తున్నట్టు తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.347 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.58,14,916 కు పెంచడమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర వృద్ధిరేటుపై సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో అమరావతిని భ్రష్టు పట్టించారని, గత ఐదేళ్లలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేయడంతో పాటు పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయేలా ప్రవర్తించారని మండిపడ్డారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును గోదాట్లో కలిపారని ఆరోపించారు. 'మేం సంపద సృష్టిస్తాం.. ప్రజల ఆదాయం పెంచుతాం. అభివృద్ధి వల్ల సంపద వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు పథకాల ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చు. స్వర్ణాంధ్రప్రదేశ్, విజన్-2047 లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రతి ఇంటిని జియో ట్యాగ్ చేసి కుటుంబ సభ్యులను అనుసంధానం చేస్తున్నాం. నేషనల్ పేమెంట్ గేట్‌వే ద్వారా ఎన్‌పీ ఖాతాలు తీసుకుంటున్నాం. విపత్తు సమయాల్లో పరిహారం అందించడంలో తలెత్తే ఇబ్బందులను వీటితో అధిగమించవచ్చు' అని సీఎం పేర్కొన్నారు. 'ప్రతి వ్యక్తి, కుటుంబం, సమాజం ఆనందంగా ఉండాలి. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఫ్యామిలీ ధ్యేయంతో ముందుకెళ్తున్నాం. విజన్ డాక్యుమెంట్‌కు దేశంలో తొలిసారి 16లక్షల వ్యూస్ వచ్చాయి. వికసిత్ భారత్ కూడా ఈ స్థాయిలో స్పందన రాలేదు. ఆన్‌లైన్‌లో వచ్చిన అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని 10 సూత్రాలతో మళ్లీ విజన్ రూపొందించాం' అని చెప్పారు. 'రాష్ట్రం 15శాతం వృద్ధిరేటు సాధించగలిగితే 2025-26లో జీఎస్‌డీపీ రూ.18.47 లక్షల కోట్లకు చేరుతుంది. ఇందులో 3.5శాతం అంటే రూ.64,646 కోట్లు ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి అప్పు తెచ్చుకోవచ్చు. అప్పులు, ఆదాయం కలిపి రూ.1,84,703 కోట్లు అందుబాటులోకి వస్తాయి, వృద్ధిరేటు పెరగడం వల్ల అదనంగా రూ.20,645కోట్ల ఆదాయం కలుస్తుంది. అలాగే, 2029-30 నాటికి జీఎస్డీపీ రూ.32.30లక్షల కోట్లకు చేరితే, ఎఫ్ఆర్‌బీఎం కింద రూ.1,13,066 కోట్ల అప్పు తెచ్చుకోవచ్చు. అప్పు, ఆదాయం కలిపి రూ.3,23,046కోట్ల ఆదాయం చేతిలో ఉంటుంది. 15 శాతం వృద్ధిరేటుతో అదనంగా కలిసిన ఆదాయం రూ.42,136 కోట్లకు చేరుతుంది' అని చంద్రబాబు వివరించారు.

### వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుదేలు


రాష్ట్రంలో గత ఐదేళ్లలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల ప్రగతి కుంటుపడిందని సీఎం చెప్పారు. '2014-19లో వ్యవసాయ రంగంలో 16.6శాతం వృద్ధి రేటు నమోదవగా, 2019-24లో అది 10.22 శాతానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ రంగంలో 15.86శాతం వృద్ధిరేటు సాధించాం. 2014-19లో పారిశ్రామిక రంగం 11.9 వృద్ధిరేటు సాధించింది. 2019-24లో ఇది 11.33శాతానికి తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.7శాతంగా ఉంది. 2014-19లో సేవారంగంలో 11.9శాతం వృద్ధి నమోదైంది. 2019-24లో ఇది 10.84 శాతానికి క్షీణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగంలో 11.7 శాతం వృద్ధి రేటు నమోదైంది. 2014-19లో 13.5 శాతంగా నమోదైన వృద్ధిరేటు 2019-24లో 10.32 శాతానికి తగ్గింది. ప్రస్తుతం 12.94 శాతానికి చేరుకుంది. 2014-19లో జాతీయ సగటు వృద్ధి రేటు 10.98 శాతం కంటే ఏపీలో అధికంగా (13.5%) నమోదైంది' అని సీఎం పేర్కొన్నారు.

### తలసరి ఆదాయంలో ఏపీ ముందంజ

పదేళ్ల నుంచి రాష్ట్రంలో నమోదవుతున్న తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే మెరుగ్గా ఉందని చంద్రబాబు చెప్పారు. '2018-19లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,031 కాగా, జాతీయ సగటు రూ.1,25,946 మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,68,653 కాగా జాతీయ సగటు రూ.2,00,162గా ఉంది' అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర జనాభా 2051 నాటికి 5.41 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్టు సీఎం చెప్పారు. '2011లో దేశ జనాభా 122.09కోట్లు ఉండగా రాష్ట్ర జనాభా 4.95 కోట్లుగా ఉంది. అప్పుడు దేశవ్యాప్త టీఎఫ్ఆర్ రేటు 2.34 కాగా, రాష్ట్ర టీఎఫ్ఆర్ రేటు 1.68గా ఉంది. 2026నాటికి దేశ జనాభా 143.24 కోట్లకు, రాష్ట్ర జనాభా 5.38కోట్లకు పెరుగుతుంది. 2046నాటికి దేశ జనాభా 161.79కోట్లకు, రాష్ట్ర జనాభా 5.42 కోట్లకు చేరుతుంది. అలాగే 2051నాటికి దేశ జనాభా 164.77కోట్లకు చేరితే, రాష్ట్ర జనాభా స్వల్పంగా తగ్గి 5.41కోట్లకు చేరుతుంది' అని పేర్కొన్నారు. 2051 నాటికి దేశవ్యాప్త టీఎఫ్ఆర్ 1.07కు తగ్గుతుందని, అదే సమయంలో రాష్ట్ర టీఎఫ్ఆర్ కూడా 1.07కు తగ్గుతుందని చంద్రబాబు వెల్లడించారు.








రాజధానిలో చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో చేపట్టిన జీఏడీ టవర్ల పిల్లర్లు ఇవి. గత ఐదేళ్ల జగన్ పాలనలో నిర్లక్ష్యానికి గురై వర్షపు నీటిలో మునిగిపోయాయి. ఇన్నేళ్లుగా ఇవి నిండా నీటిలో నానిపోతూనే ఉన్నాయి. కొన్ని రోజులుగా భారీ మోటార్లతో ఈ నీటిని తోడే పనిని చంద్రబాబు సర్కారు చేపట్టింది. గురువారం నాటికి నీరు దాదాపుగా తోడెయ్యగా జీఏడీ నిర్మాణాల పిల్లర్లు, పునాదులు ఇలా బయటకు కనిపించాయి.

# విశాఖ ఉక్కుకు ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన విధివిధానాలను ఇరువురు మంత్రులు వెల్లడించే అవకాశాలున్నాయి.

### ఫలించిన సీఎం చంద్రబాబు కృషి

సీఎం చంద్రబాబు ఢిల్లీకి వచ్చిన ప్రతిసారి, ప్రధాని మోదీని కలిసిన ప్రతి సందర్భంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై చర్చలు జరిపినట్లు కేంద్ర ఉక్కు శాఖ వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ వచ్చినప్పుడు కూడా స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని సీఎం కోరిన విషయం తెలిసిందే. ఈనెల మొదటి వారంలో ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని కలిశారు. విశాఖ స్టీల్ ప్లాంటును తక్షణమే ఆదుకోవాలని, రుణాలన్నీ తీర్చేసి, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి సాయం చేయాలని కోరారు. ఈ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ఇప్పటికే కుమారస్వామి కూడా వెల్లడించారు. ఈ వ్యవహారంలో కేంద్రం నుంచి అందించాల్సిన సహకారంపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కూడా కుమారస్వామి చర్చలు జరిపినట్లు సమాచారం. స్టీల్‌ప్లాంట్ నష్టాలబాటలో వెళ్లకుండా సమర్థంగా నిర్వహించే విషయమై చంద్రబాబు ఒక బ్లూప్రింట్‌ను కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. ఆయన సూచనల మేరకు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్రం సిద్ధం కావడంతో ప్రత్యేక ప్యాకేజీ విధివిధానాలు ఏవిధంగా ఉంటాయనే విషయంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### కూటమి వచ్చాక మారిన పరిస్థితి

విశాఖ స్టీల్ ప్లాంటు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఉద్యోగులకు 4నెలల నుంచి జీతాలు లేవు. కర్మాగారంలోని 3 బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా రోజుకు 21వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం 2బ్లాస్ట్ ఫర్నేస్‌లే పనిచేస్తున్నాయి. పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగక ఖర్చులు అధికమై నష్టాలు పెరుగుతున్నాయి. అప్పుల భారం పెరిగిపోతోంది. బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.17వేల కోట్లతో కలుపుకొని మొత్తం రూ.25వేల కోట్ల అప్పులు ఉన్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు కొద్దినెలలుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, విశాఖ ఎంపీ శ్రీభరత్ అభ్యర్థన మేరకు రెండు దఫాలుగా కేంద్రం రూ.1,650 కోట్ల ఆర్థిక సాయం చేసింది. వీటిని చట్టబద్ధమైన చెల్లింపులకు ఉపయోగించారు. ఇప్పుడు మరో రూ.11,500 కోట్ల ఆర్థిక సాయానికి కేంద్రం అంగీకరించగా.. దీనిలో రూ.10,500 కోట్లు ప్లాంట్‌కి నేరుగా ఆర్థిక ప్రయోజనం కింద, మరో రూ. వెయ్యి కోట్లు మరో రూపంలో ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్రం నిర్ణయం పట్ల విశాఖ ఉక్కు వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

- 12 నెలలకు 12 థీమ్‌లతో కార్యక్రమాలు:సీఎస్ విజయానంద్

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. ఈ నెల 18న కడప జిల్లా మైదుకూరులో సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవతంగా నిర్వహించేందుకు కలెక్టర్లు తగిన శ్రద్ధ చూపాలన్నారు. నెల కొకటి చొప్పున 12మాసాలకు 12 థీమ్‌లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని క్యాంపెయిన్ మోడ్‌లో నిర్వహించాలని మంత్రి నారాయణ సూచించారు. కాగా, విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో 26న నిర్వహించనున్న 76వ గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. వివిధ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా కనీసం 14 శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# కార్యకర్తే అధినేత

- పసుపు జెండా ఒక ఎమోషన్
- ప్రాణమా? పార్టీనా? అంటే... పార్టీనే ఎక్కువని జై కొట్టే చేతులు అనేకం
- కోటి మందితో అతి పెద్ద కుటుంబం
- కార్యకర్తలకు మంత్రి లోకేశ్ లేఖ




అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'నందమూరి తారక రామారావు పార్టీ పెట్టిన ముహూర్త బలం చాలా గట్టిది. నాడు ఒక్కరితో ప్రారంభమైన ప్రయాణం నేడు కోటి మందితో అతి పెద్ద కుటుంబంగా మారింది' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఆయన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతూ లేఖ రాశారు. 'సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ఒక పండుగలా నిర్వహించారు. ఊరూ వాడా జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు. ఏపీ, తెలంగాణ, అండమాన్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఉన్న తెలుగువారు, వివిధ దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భాగస్వాములయ్యారు. గత రికార్డులు తిరగరాస్తూ కోటి సభ్యత్వాలతో సరికొత్త చరిత్ర సృష్టించాం. సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులు, సిబ్బందికి శుభాకాంక్షలు. పసుపు జెండా మనకు ఒక ఎమోషన్. పీకమీద కత్తి పెట్టి వేరే పార్టీ అధినేతకు జై కొడితే విడిచిపెడతామని చెప్పినా.. 'జై చంద్రబాబు, జై టీడీపీ' అంటూ ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య నాకు ప్రతిక్షణం గుర్తుకొస్తారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థులు ఉన్మాదుల్లా మీద పడుతుంటే మీసం మెలేసి, తొడకొట్టి.. 'జై చంద్రబాబు' అన్న అంజిరెడ్డి తాత తెగువ నాకు నిత్యస్ఫూర్తి. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రతి గ్రామంలో 'ప్రాణం ఎక్కువా? పార్టీ ఎక్కువా?' అంటే పార్టీనే ఎక్కువ అని జై కొట్టే చేతులు అనేకం. ఏమిచ్చినా, ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది. దేశంలో ఏ పార్టీకీ లేని కార్యకర్తల బలం టీడీపీకి సొంతం. అలాగే ఏ పార్టీ ఇవ్వని గౌరవం కార్యకర్తలకు టీడీపీ ఇస్తుంది. కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను గౌరవించే ఒకే ఒక్క పార్టీ టీడీపీ' అని లోకేశ్ పేర్కొన్నారు.

### కార్యకర్తలకు చేసిన చిరుసాయం

'కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయ కర్తగా పవిత్రమైన బాధ్యత నాకు అప్పగించారు. ఇప్పటివరకు 2,500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సాయం అందించాం. వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5,164మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున రూ.103.28 కోట్లను అందజేశాం. అనారోగ్యంతో బాధపడుతున్న అనేకమంది కార్యకర్తలకు వైద్య సాయం అందించాం. 2వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. 5వేల కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచి రూ.19కోట్లు సాయం చేశాం. జెండా మోసే ప్రతి కార్యకర్తలకు అండగా నిలవడమే అజెండా. కొన్ని నియోజకవర్గాల నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని లక్షకు పైగా సభ్యత్వాలు చేయడంతో పాటు జీవితకాల సభ్యత్వాలూ ఎక్కువ చేశారు. వారికి ప్రత్యేక అభినందన. కార్యకర్తకు భరోసా ఇచ్చే నమోదు కార్యక్రమంలో పాల్గొని కోటి సభ్యత్వాలతో రికార్డులు బద్దలు కొట్టడంలో భాగస్వామి అయిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు' అని లోకేశ్ భావోద్వేగభరితంగా లేఖ రాశారు.

### కార్యకర్తల కష్టమే కోటి సభ్యత్వం: చంద్రబాబు



తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కష్టమే కోటి సభ్యత్వమని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వం కోటి మైలురాయిని దాటిన సందర్భంగా గురువారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'పార్టీ సభ్యత్వం కోటి దాటడం ఎంతో గర్వకారణం. రాజకీయ పార్టీ సభ్యత్వ నమోదులో ఇదో గొప్ప రికార్డు. అసాధారణమైన ఈ లక్ష్యాన్ని చేరుకొన్న వేళ టీడీపీ కుటుంబ సభ్యులు అందరికీ శుభాకాంక్షలు. ఈ ఘనత ఎనలేని సంతృప్తిని ఇచ్చింది. ఈ మహా క్రతువులో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు, ప్రతి నాయకుడికీ నా అభినందనలు. ధన్యవాదాలు. కోటి మంది పసుపు సైన్యంతో పార్టీని తీర్చిదిద్దిన కార్యకర్తే ఈ పార్టీకి అధినేత. కార్యకర్తల పార్టీగా టీడీపీ దినదిన ప్రవర్ధమానంగా వర్ధిల్లుతోంది. కార్యకర్తల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న లోకేశ్‌కు ప్రత్యేక అభినందనలు' అని చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు, ఎంపీలతో చంద్రబాబు కొంతసేపు సమావేశం కానున్నారు. వర్తమాన పరిణామాలపై వారితో చర్చిస్తారు. ఆదివారం రాత్రికి ముఖ్యమంత్రి బృందం దావోస్ బయలుదేరి వెళ్తోంది.

# దోపిడీ దొంగల బీభత్సం

- ఏటీఎంలో పెట్టాల్సిన 93 లక్షలతో పరార్
- బీదర్, హైదరాబాద్‌లో కాల్పులు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు

బెంగళూరు, ఆబిడ్స్/మంగళ్‌హాట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దోపిడీ దొంగలు కర్ణాటక రాష్ట్రం బీదర్, హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఓ ఏటీఎంలో జమ చేయాల్సిన రూ.93 లక్షలను కొల్లగొట్టగా.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు పరారయ్యే క్రమంలో.. హైదరాబాద్‌లో కాల్పులు జరిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బీదర్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉన్న ఏటీఎంలో నగదును నింపేందుకు సెక్యూరిటీ ఏజెన్సీ సిబ్బంది తమ వాహనంలో గురువారం ఉదయం 10.55 సమయంలో చేరుకున్నారు. ఏటీఎం వద్ద వాహనాన్ని నిలిపి.. రూ.93లక్షలున్న ట్రంకు పెట్టెను కిందకు దింపగానే.. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు సిబ్బంది కళ్లలో కారం చల్లి.. పిస్టల్‌తో ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో గిరి వెంకటేశ్(40) అనే సెక్యూరిటీ గార్డు అక్కడికక్కడే మరణించగా.. మరో గార్డు శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వెంటనే దుండగులు ట్రంకుపెట్టితో ద్విచక్రవాహనంపై పారిపోయారు.

### హైదరాబాద్‌కు దుండగులు

వెంటనే బీదర్ పోలీసులు అప్రమత్తమై.. చెక్‌పోస్టుల వద్ద హైఅలెర్ట్ ప్రకటించారు. అయితే.. దుండగులు ట్రంకుపెట్టెలోని నగదును బ్యాగుల్లోకి మార్చుకుని, హైదరాబాద్ చేరుకున్నారు. మధ్యాహ్నం 3.30 సమయంలో ఆబిడ్స్ సమీపంలోని రోషన్ ట్రావెల్స్‌లో రాయ్‌పూర్ వెళ్లేందుకు రెండు బస్ టికెట్లు తీసుకున్నారు. సాయంత్రం 6.30సమయంలో బస్సు రాగా.. ట్రావెల్స్ సిబ్బంది ప్రయాణికుల లగేజీని తనిఖీ చేసి, లోనికి అనుమతించారు. ఏటీఎం దుండగులను కూడా వారి బ్యాగులు చూపించాలని కోరగా రూ.50వేలు ఇవ్వజూపారు. సున్నితంగా తిరస్కరించిన జహంగీర్.. ఆ బ్యాగులను తెరిచి, చూశారు. అందులో డబ్బుల కట్టలుండడంతో.. వారిని కిందకు దింపి, పోలీసులకు సమాచారం ఇస్తామని బెదిరించారు. దాంతో దుండగులు అతనిపై కాల్పులు జరిపి, పరారయ్యారు. జహంగీర్ కడుపు, తొడ భాగాల్లో తూటా గాయాలయ్యాయి. అతణ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, డీసీపీ బాలస్వామి నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు.



తుపాకీ గురిపెడుతున్న దుండగులు



ఈడీ విచారణ తర్వాత మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

# విదేశీ కరెన్సీలో ఎందుకు చెల్లించారు?

- ఆర్బీఐ అనుమతి తీసుకున్నారా?
- మంత్రిగా ఉండి నిబంధనలను ఎలా ఉల్లంఘించారు?
- ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్‌పై ఈడీ ప్రశ్నలు
- ఏడున్నర గంటలపాటు కొనసాగిన విచారణ

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'విదేశీ సంస్థ అయిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)కు రూ.45.71 కోట్లకు సమానమైన మొత్తాన్ని విదేశీ కరెన్సీలో ఎందుకు చెల్లించారు? రిజర్వ్‌బ్యాంకు అనుమతి తీసుకున్నారా? విదేశీ కరెన్సీ నిధుల చెల్లింపులో పాటించాల్సిన నిబంధనలను ఎందుకు అనుసరించలేదు?' అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. 'నాడు మంత్రి హోదాలో మీరు చెబితేనే హెచ్ఎండీఏ నుంచి డబ్బును ఎఫ్ఈఓకు విడుదల చేశామని అధికారులంటున్నారు. మీరు ఆ విధమైన ఆదేశాలు ఎందుకు ఇచ్చారు?' అని ప్రశ్నించారు. ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి కేటీఆర్‌ను ఈడీ అధికారులు గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరున్నర వరకు.. దాదాపు ఏడున్నర గంటలపాటు విచారించారు. ఎక్కువగా హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కేటీఆర్‌ను ప్రశ్నించారని, దాదాపు 40 ప్రశ్నలను ఈడీ అధికారులు సంధించినట్లు తెలుస్తోంది.

### కొత్త ఆదేశాలు ఎందుకు ఇచ్చారు?

'2022 అక్టోబరు 25న జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం ప్రమోటర్ కంపెనీ అయిన ఏస్ నెక్స్‌జెన్.. అన్ని సీజన్లకు ఫీజు చెల్లించాల్సి ఉండగా, మీరెందుకు 2023లో కొత్త ఆదేశాలు ఇచ్చారు? హెచ్ఎండీఏ జనరల్ నిధుల నుంచి రెండు ఇన్వాయిస్‌లకు సంబంధించిన మొత్తాన్ని క్లియర్ చేస్తూ ప్రొసీడింగ్ ఉత్తర్వులు ఇచ్చిన నాటి చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి.. మీ నుంచి వచ్చిన ఆదేశాలనే అమలు చేశానని చెప్పారు కదా?' అని ఈడీ అధికారులు ప్రశ్నించగా.. అదంతా అధికారులే చూసుకున్నారని కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. ఆనాటి లావాదేవీలకు సంబంధించిన సొమ్ము ఎక్కడికీ పోలేదని, ఎఫ్ఈఓ వద్ద భద్రంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం ఆ సొమ్ము తీసుకోకుండా, కక్షసాధింపు కోసమే తనపై కేసు పెట్టిందని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది. ఇది తప్పుడు కేసు, ఇందులో పైసా అవినీతి జరగలేదని కేటీఆర్ పలుమార్లు అన్నప్పుడు.. అడిగిన ప్రశ్నకు మాత్రమే జవాబు ఇవ్వండని ఒక దశలో ఈడీ అధికారులు సూచించినట్లు సమాచారం. పురపాలక శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేటీఆర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించి ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

**SREE VIDYANIKETHAN**
**International School**
A CBSE affiliated school for classes I to XII

# YOUR CHILD'S PATH TO GLOBAL EXCELLENCE STARTS AT SVIS.

## With a strong foundation, it's an opportunity to finish with degrees from elite global universities.

WISCONSIN UNIVERSITY OF WISCONSIN-MADISON | RWTH AACHEN UNIVERSITY | PennState University



Give your child the foundation to excel globally! At Sree Vidyanikethan International School, students embark on a seamless journey from school to prestigious universities worldwide. As a sister affiliate of Mohan Babu University, one of India's top universities with global tie-ups, our students gain access to institutions like Penn State (New Jersey, USA), University of Wisconsin (Madison, USA), and RWTH Aachen (Germany). Start their journey with us today!

EducationWorld
*India School Rankings 2024-25

**AP'S NO.1* CO-ED BOARDING SCHOOL**

**TIRUPATI'S NO.1* SCHOOL**

## NURTURING TOMORROW'S LEADERS WITH INNOVATIVE LEARNING

- **Tirupati's only school with Atal Tinkering Lab for innovation**
- **Experiential learning for better conceptual clarity**
- **STEM activities to foster critical thinking, collaboration and problem-solving for future leaders**





## 40 ACRES OF EXCELLENCE FOR HOLISTIC GROWTH

- 40-acre Green Campus with CCTV Surveillance and Wi-Fi
- Smart Classrooms, Equipped with Complimentary Tablets
- Enriched Library with Digital Resources
- State-of-the-art Physics, Biology, Chemistry, Mathematics and IT Labs
- World-class Indoor and Outdoor Sports Facilities
- Only School in Tirupati to Offer Horse-riding Facilities
- Swimming Pool Facilities Under the Able Guidance of a Coach
- School Band Dance, Art and Music Studios

## ADMISSION OPEN
for Grade 1 to 12 | Academic Year 2025-26

## INTEGRATED STUDY PROGRAM

- IIT Foundation Classes for Class 6 to 10
- Chrysalis Curriculum for Class 1 to 5
- Coaching for Olympaids (IEO, IMO, NCO, NSO, IGKO & ISSO) and NTSE

## COMPETITIVE EXAM PREPARATION ASSISTANCE IN SCIENCE AND COMMERCE FOR CLASSES 11 & 12

- For MPC - Preparation for IIT - JEE (MAINS AND ADVANCED) / APEAPCET
- For BiPC - Preparation for NEET / APEAPCET
- For Commerce (CEC/MEC) - Preparation for CA Foundation Courses
- Well Experienced and Expert Faculties
- DPT - Daily Practice Tests, FPT - Fortnightly Practice Tests, Cumulative Tests, YGT - Yearly Grand Tests, Real Time JEE Mock Test, Doubt Clearing Sessions

## For Admissions, Call/WhatsApp: +91-7337333725

Sree Sainath Nagar, Tirupati, Andhra Pradesh - 517 102 www.svis.school/tirupati

Scan to know more